RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 ‖ సంచిక : 191 ‖ ఆదిలాబాద్ ‖ శుక్రవారం, డిసెంబర్ 20, 2024 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12

### షెడ్యూల్ కులాల వర్గీకరణ శాస్త్రీయంగా జరగాలి

ములుగు, డిసెంబర్ 19(ఎ.ఎం.ఎస్): హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూలు కులాల విచారణ కమిషనర్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షమీం అక్తర్ కి గురువారం మెమోరండం సమర్పించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ శాస్త్రీయంగా జరగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మడికొండ అంబేద్కర్ మాల సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్, కార్యదర్శి జవ్వాజి కిషన్, కాలేశ్వరపు రాజేందర్, వెనమల్ల రమేష్, అంకేశ్వర కుమారస్వామి, మాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

### మొదలైన వేసవికాలం వరి నాట్లు

తుంగతుర్తి, డిసెంబర్ 19(ఎ.ఎం.ఎస్): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలో వేసవికాలం వరినాట్లు మొదలయ్యాయి. మండల పరిధిలోని దేవుని గుట్ట గ్రామంలో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. వ్యవసాయ సాగుకు ప్రభుత్వం స్పందించి తమకు రైతుబంధు ఇవ్వాలని రైతులు కోరుకుంటున్నారు. వేసవి సీజన్ కు వరినాట్లు వేయడానికి ఎంతో ఖర్చు అవుతుందని, ప్రభుత్వం ఆదుకోవాలని సూచిస్తున్నారు. నాటు వేయడానికి కూలీల ఖర్చు విపరీతంగా పెరిగిందని రైతులు వాపోతున్నారు.

# అదానీ విషయంలో రాహుల్ గాంధీ ద్వంద ప్రమాణాలు

- రేవంత్ వైఖరిపైన మండిపడిన కెటిఅర్
- అదానీ వ్యవహారంలో కాంగ్రెస్ డీల్లీలో కుస్తీ, గల్లీలో కుస్తీ మాదిరి ఉందని విమర్శ



హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అదానీ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ద్వంద వైఖరిని ఎండగడుతు ఆయన రాహుల్ గాంధీకి లేఖ రాశారు. జాతీయ స్థాయిలో అదానీ పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు.కేటీఆర్ తన లేఖలో, కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో గౌతం అదానీపై నిరసనలు వ్యక్తం చేస్తూ, మోదీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూనే, తెలంగాణలో రేవంత్ రెడ్డి అదానీ గ్రూప్‌కు ఎర్ర తీవాచీ పరచడం విడ్డూరంగా ఉందని అన్నారు. "మీ పార్టీ ఒకవైపు అదానీ గ్రూప్ క్రోనీ క్యాపిటలిజంపై పోరాటం చేస్తోందని చెప్పుకుంటుంది, మరొకవైపు మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదానీ గ్రూప్ కోసం సుమారు 12 వేల కోట్ల రూపాయాల భారీ డీల్స్ కుదుర్చుకుంటున్నాడు" అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. డిసెంబర్ 18న టీపీసీసీ 'చలో రాజ్‌భవన్' కార్యక్రమంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. అదానీ అవినీతిపై కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో చేపట్టిన ఉద్యమంలో ఈ కార్యక్రమం చేపట్టి, తెలంగాణలో మాత్రం అదానీతో అంటకాగుతున్న రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గోనడం కాంగ్రెస్ ద్వంద వైఖరికి నిదర్శనం అన్నారు. అయితే, ఇదే సమయంలో రేవంత్ రెడ్డి దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో అదానీ గ్రూప్‌కు పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకున్నారనే విషయాన్ని ప్రస్తావించారు. దీంతోపాటు గౌతం అదానీ రేవంత్ రెడ్డికి ఇచ్చిన రూ. 100 కోట్ల విరాళం, బీఆర్ఎస్ ఈ విషయాన్ని బయటపెట్టిన తర్వాతే తిరిగి ఇచ్చివేసిందని కేటీఆర్ ఆరోపించారు.

"అది 'క్విడ్ ప్రో కో' కు క్లాసిక్ ఉదాహరణ" అంటూ, "అవినీతి వ్యతిరేక పోరాటమంటే ఇదేనా? దానం తీసుకుని దొంగలాగా దొరికిన తర్వాత తిరిగి ఇవ్వడమా?" అని ప్రశ్నించారు. హైదరాబాద్ హోటళ్లలో అదానీ ప్రతినిధులతో కాంగ్రెస్ నాయకులు భూ దందా చేస్తున్నారని, అందులో కాంగ్రెస్ కేబినెట్ మంత్రులు కూడా భాగస్వామ్యులుగా ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ రాహుల్ గాంధీకి సూటిగా సవాలు విసిరారు. "మీ సీఎం రేవంత్ రెడ్డితో అదాని అనుబంధం గురించి మీరు ప్రశ్నిస్తారా? లేక ఆయన వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడటానికి మౌనంగా ఉంటారా?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న అదానీ వ్యతిరేక నిరసనలు ఒక "రాజకీయ డ్రామా"గా అభివర్ణించారు.తెలంగాణ ప్రజలు, దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని క్షమించరని, వారిని సరైన సమయంలో ప్రజా క్షేత్రంలో శిక్షిస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకత్వం ఈ విషయంలో తన నిబద్ధతను నిరూపించుకుంటూ అదానీ విషయంలో తెలంగాణ కాంగ్రెస్, రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం విషయంలో తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక జాతీయ పార్టీగా పార్టీకి తెలంగాణతో సహా అన్ని రాష్ట్రాలలో ఒకే వైఖరి ఉండాలని, కానీ తెలంగాణలో దోచుకుంటాం, కానీ డీల్లీలో నిరసనలు తెలుపుతామన్న వైఖరి పక్కా అవకాశవాదం అవుదన్న విషయం రాహుల్ గాంధీ తెలుసుకోవలన్నారు. ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీ వైఖరి దేశ ప్రజలముందు నవ్వులపాలువుతుందన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డికి అదానీ విషయంలో పార్టీ వైఖరికి అనుగుణంగా వ్యవహరించేలా అదేశాలివ్వాలని లేకుంటే కాంగ్రెస్ మోసపూరిత విధానాలను ప్రజలు గుర్తిస్తారని తెలుసుకోవాలన్నారు.



# వజ్రోత్సవాల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

### వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు"

హైదరాబాద్ : రేపు, ఎల్లుండి జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు సూచించారు. మహిళా రైతులు కూర్చోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈరోజు ఉదయం వ్యవసాయ కార్యదర్శి, APC M. రఘునందన్ రావు IAS , కమిషనర్ B. గోపి IAS లతో కలిసి మంత్రి రాజేంద్రనగర్ లోని PJTAU స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆడిటోరియంను పరిశీలించారు. ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఇతర ఉన్నతాధికారులు జరుగుతున్న ఏర్పాట్లను మంత్రికి వివారించారు. కార్యక్రమాల నిర్వహణలో సమయపాలన పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకి ఉపయోగపడేలా, ఆవరణలో అనువైన ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులపతి గౌరవ జిష్ణు దేవ్ వర్మ, గౌరవ ముఖ్య మంత్రి A. రేవంత్ రెడ్డి, పర్యటన, ప్రసంగ కార్యక్రమాల్లో సమయపాలన పాటించాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

### మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు

హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బీ: తెలంగాణ పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. 2025, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నట్లు ఎస్సెస్సీ బోర్డు ప్రకటించింది. పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. ఇక ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు.

పది పరీక్షల టైం టేబుల్:మార్చి 21(శుక్రవారం) ఫస్ట్ లాంగ్వేజ్,మార్చి 22(శనివారం) సెకండ్ లాంగ్వేజ్,మార్చి 24(సోమవారం) థర్డ్ లాంగ్వేజ్(ఇంగ్లీష్),మార్చి 26(బుధవారం) గణితం,మార్చి 28(శుక్రవారం) సైన్స్(ఫిజికల్ సైన్స్),మార్చి 29(శనివారం) సైన్స్(బయోలాజికల్ సైన్స్),ఏప్రిల్ 2(బుధవారం) సోషల్ స్టడీస్,ఏప్రిల్ 3(గురువారం) ఓఎస్ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -1,ఏప్రిల్ 4(శుక్రవారం) ఓఎస్ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -2

# ఉన్నవి లేనట్టు.. లేనివి ఉన్నట్టు చెప్పడంలో హరీశ్ రావు దిట్ట

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం



హైదరాబాద్ డిసెంబర్ 19 : ఉన్నవి లేనట్టు.. లేనివి ఉన్నట్టు చెప్పడంలో హరీశ్ రావు దిట్ట అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అప్పులపై హరీష్ రావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సంవత్సరం కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష కోట్ల అప్పు చేశారని హరీష్ రావు ఆరోపిస్తున్నారని.. కానీ, తమ సర్కార్.. ఎఫ్ఆర్ఎంబీకి లోబడి ఈ ఏడాదిలో రూ.52వేల కోట్ల అప్పు మాత్రమే తెచ్చామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సర్కార్ రూ.3 లక్షల కోట్లే అప్పు చేసిందని.. కానీ, కాంగ్రెస్ రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందని తప్పుడు ప్రచారం చేశారని హరీశ్ ఆరోపించారు.దీనిపై డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గత సర్కార్ చేసిన అప్పులతో పాటు పెండింగ్ బిల్లులు కూడా ఉన్నాయని, ఈ రెండు కలిసి మొత్తం రూ.7 లక్షల 10 వేల కోట్ల అప్పు ఉందని చెప్పారు. పదేళ్లు అప్పులు తప్ప.. బిఆర్ఎస్ చేసిందేమి లేదని ఆయన విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.20 వేల 600 కోట్లు రైతు రుణమాఫీ చెల్లించామని చెప్పారు. బిఆర్ఎస్ నాలుగేళ్లు చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని విమర్శించారు. ఇప్పటికే రూ.24 వేల కోట్లకు పైగా మేము అప్పులు తీర్చామని, మార్చి నుంచి ఇప్పటి వరకు మొదటి తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. అలాగే, రైతులకు ఉచితంగా నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తున్నామని, మహిళల కోసం మహాలక్ష్మి పథకం అమలు చేశామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టుకుంటూ వెళ్తున్నామని డిప్యూటీ సీఎం భట్టీ చెప్పారు.

# విమానాశ్రయంలో తెలంగాణ పర్యాటక సమాచార కేంద్రం ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు





హైదరాబాద్ : దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ సరికొత్త ఆవిష్కరణలు శ్రీకారం చుడుతుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తెలంగాణ తెలంగాణ పర్యాటక సమాచార కేంద్రాన్ని మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పర్యాటక శాఖ చేపడుతున్న సంస్కరణలో భాగంగా పర్యాటకులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన వారసత్వ ప్రదేశాలు, సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యం, అబ్బురపరిచే ప్రకృతి దృశ్యాలను సందర్శించేందుకు వచ్చే దేశీయ, విదేశీయ సందర్శకుల కోసం రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలు, హరిత హోటల్స్, టూర్ ప్యాకేజీలు, రిజర్వేషన్, వెళ్లే మార్గాలు (రూట్ మ్యాప్) వంటి సమాచారాన్ని అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమాచార కేంద్రంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 10 గంటల వరకు సందర్శకులకు సేవలు అందుబాటులో ఉంటాయి.ఇప్పటికే పర్యాటక సంస్థ బషీర్‌బాగ్, బేగంపేట టూరిజం ప్లాజా, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ యాత్రినివాస్, శిల్పారామంతో పాటు ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో సమాచార, రిజర్వేషన్ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మెనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణిక్కర్, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో రూ. 24,276 కోట్ల పనులకు పాలనాపరమైన అనుమతులు

- పోలవరం ప్రాజెక్టు ఎడమ కాల్వ, హంద్రీనీవా సుజల ప్రవంతి రెండో దశ, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్‌కు అనుమతి
- మంగళగిరి ఎయిమ్స్‌కు అదనంగా మరో 10 ఎకరాల భూమి
- ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం

అమరావతి డిసెంబర్ 19 : ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో రూ. 24,276 కోట్ల విలువైన పనులకు పాలనాపరమైన అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది .ఈ సమావేశంలో రాజధాని నిర్మాణానికి హడ్కో ద్వారా రూ. 11 వేల కోట్లు రుణానికి, కేఎఫ్‌డబ్ల్యూ ఆర్థిక సంస్థ ద్వారా రూ. 5 వేల కోట్ల రుణానికి ఆమోదం వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాల్వ పనులకు మళ్లీ టెండర్లు పిలిచే ప్రతిపాదనకు,

హంద్రీనీవా సుజల ప్రవంతి రెండో దశ పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్‌కు అనుమతి నిస్తూ నిర్ణయం తీసుకుంది.వర్షకాలంలో భారీ వర్షాలకు నష్టపోయిన 10 జిల్లాలోని వరద ప్రభావిత బాధితులకు రుణాల రీ షెడ్యూల్‌పై, రైతులకు రుణాల రీషెడ్యూల్ కోసం స్టాంప్ డ్యూటీ మినహాయించే ప్రతిపాదనపై చర్చ కొనసాగింది. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలకు ఉచితంగా ఇచ్చే అంశం,ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి నిధుల విడుదలపై చర్చ



జరిగింది.ధాన్యం కొనుగోలు కోసం మార్క్‌ఫెడ్ ద్వారా వెయ్యి కోట్ల రుణానికి ఆమోదం వ్యక్తం చేసిన కేబినెట్ వెయ్యి కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారంటీకి ఆమోదం తెలిపింది . మంగళగిరి ఎయిమ్స్‌కు అదనంగా మరో 10 ఎకరాల భూమి కేటాయించడానికి నిర్ణయం తీసుకుంది.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ

### కమిషన్ ముందు విచారణకు ఐఏఎస్ స్మితా సభర్వాల్, మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ లు

హైదరాబాద్ డిసెంబర్ 19 : కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. గురువారం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు విచారణకు ఐఏఎస్ స్మితా సభర్వాల్, మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణ అనుమతులపై ప్రశ్నించారు. క్యాబినెట్ అనుమతి లేకుండానే జీవోలు వచ్చాయా? అని కమిషన్ ప్రశ్నించింది. కమిషన్ ప్రశ్నలకు తెలియదని స్మితాసబర్వాల్ సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుల నిర్మాణంలో తన రోల్ లిమిటెడ్ అని, ప్రాజెక్టులపై తనకు అవగాహన లేదని ఆమె చెప్పినట్లు సమాచారం. ఇక, మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ కుడా ఇలాగే సమాధానం చెప్పడంతో జస్టిస్ పీసీ ఘోష్ సీరియస్ అయినట్లు



తెలుస్తోంది. కొద్దికాలమే ఇరిగేషన్ సెక్రటరీగా ఉన్నానని.. సీఎస్ గా ఉన్నపుడు కెబినేట్ నిర్ణయాల మేరకు ముందుకెళ్లానని సోమేశ్ కమిషన్ కు తెలిపారు. కమిషన్ అడిగిన చాలా ప్రశ్నలకు.. తెలియదు, గుర్తుకు లేదు.. చాలా ఏళ్లైందని సోమేశ్ కుమార్ సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో అడిగే ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పాలని కమిషన్ సీరియస్ అయ్యింది. ఏ నిర్ణయమైనా కెబినేట్ నిర్ణయం మేరకు ముందుకెళ్లాననడంపై చంద్రఘోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## వలస కార్మికులకు ఏది భరోసా?


ఎక్కడ నుంచో వచ్చి పని చేస్తున్న తమకు హక్కూ, చట్టమూ వుందని తెలీక కాంట్రాక్టర్ ఇచ్చిన కూలి తీసుకోవడం తప్ప ఎదిరించడంలేదు. చేయమన్నంత కాలం పని చేయడమే తప్ప పని గంటల లెక్క వారికి తెలీదు. ఇచ్చినంత పుచ్చుకోవడమేగానీ ఇంత తక్కువ ఇచ్చారేమని అడిగే ధైర్యమూ వారికి లేదు. ఇంటికి వెళ్లకూడదంటే బాధతో పని చేయడమే తప్ప ఎందుకు పంపరని ప్రశ్నించడంలేదు. ఎక్కడ పనిచేయాలని చెబితే అక్కడ పనిచేయడమే తప్ప అది ప్రమాదకర ప్రదేశమని, ఏ చిన్న ప్రమాదం జరిగినా తాను చనిపోతానని ఏ కోశానా అనుకోడు. ఇదంతా తన కుటుంబాన్ని పోషించుకోవడానికి చేస్తున్న పనిగానే వలస కార్మికుడు భావిస్తున్నాడు. ఇదే పరిశ్రమాధిపతులకు, లేబర్ కాంట్రాక్టర్లకు ఒక వరంగా మారింది. వలస కార్మికులను మోసగించడానికి ఇదొక అస్త్రమైంది. విద్యార్హతలు కల్గిన వారికి ఎక్కువ జీతం ఇవ్వాల్సి వస్తుందని, తక్కువ జీతానికి పనిచేస్తున్న వలస కార్మికులను ప్రమాదకర ప్రదేశాల్లో పెట్టుకొని పనిచేయించడంతో ప్రతీ ప్రమాదంలోనూ వీరు చనిపోవడమో, తీవ్రంగా గాయపడ్డమో జరుగుతోంది. అచ్యుతాపురం సెజ్‌లోని అసెన్షియా, సీనర్జిన్ కంపెనీ, వివిధ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో చనిపోయిన, గాయపడినవారు ఎక్కువ మంది వలస కార్మికులే. యజమానులు ఏ పరిహారం చెల్లించకుండా, వైద్యం చేయించకుండానే వారిని సొంత ప్రాంతాలకు పంపిస్తున్న ఘటనలున్నాయి. సిఐటియు జోక్యం చేసుకున్న చోట బాధిత వలస కార్మిక కుటుంబాలకు కొంత న్యాయం జరుగుతున్నా, బయటకు తెలీని ప్రమాదాల్లో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. మృత దేహాలను, క్షతగాత్రులను రహస్యంగా సొంత ప్రాంతాలకు పంపిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జెఎన్‌పిసి), అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా, ఇతర పరిశ్రమలు, హెటిరో, డెక్కన్ కెమికల్ పరిశ్రమలోనూ, ఎన్ఎఓబి నిర్మాణంలోనూ జరిగిన ప్రమాదాల్లో ప్రాథమిక వైద్యం చేయించకుండానే ఇళ్లకు పంపిన విషాదకరమైన పరిస్థితులున్నాయి.

అస్సాం, బీహార్, చత్తీస్‌గఢ్, జార?ండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది వలస కార్మికులు ఇక్కడ వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. వీరికి పని, వేతన భద్రత లేదు. కనీస సదుపాయాల్లేని జైలు కంటే ఘోరమైన చీకటి రేకుల షెడ్లలో బంధించినట్లు వలస కార్మికులను పెడుతున్నారు. మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల సౌకర్యం వీరికి వుండదు. రాత్రి డ్యూటీ చేసుకొని నిద్ర పోదామన్నా సరైన వసతి లేదు. పరిశ్రమల్లోనే కాదు, ప్రమాదకరమైన, కఠినమైన నిర్మాణ పనుల్లోనూ వలస కార్మికులు వున్నారు. ఎన్ఎఓబి నిర్మాణ పనుల్లో స్థానిక నిర్వాసిత, ప్రభావిత గ్రామాలకు చెందిన 371 మంది వుండగా, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు దాదాపు నాలుగు వేల మంది వున్నారు. ప్రతీ 20 మంది కార్మికులలో ఒకరు వలస కార్మికుడు అని అంచనా. దేశంలో వలస కార్మికుల ఆకలి కేకలు, మరణాల వార్తలు పదే పదే వస్తున్నాయని.. వారికి సాయం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టాయని సుప్రీంకోర్టు పలుసార్లు ప్రశ్నించింది. కోవిడ్ సందర్భంలో తమ సొంత ప్రాంతాలకు వెళ్లడానికి వలస కార్మికులు పడ్డ కష్టాలపై సుప్రీంకోర్టు చలించిపోయింది. "స్వస్థలాలకు వెళ్లాలని ప్రయత్నిస్తున్న వలస కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు మాకు ఆందోళన కలిగిస్తున్నాయి. వారికి రిజిస్ట్రేషన్, రవాణా, ఆహారం, తాగునీరు అందించడంలో పలు లోపాలను మేం గుర్తించాం" అని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వలస కార్మికుల బతుకుల్లో ఏ మార్పూ లేదు. ఏ సదుపాయాలూ వారు పొందడంలేదు. వలస కార్మికుల చట్టం 1979 ప్రకారం వారికున్న హక్కులేవీ అమలుచేయడంలేదు. వలస కార్మికులను పనిలో నియమించుకొనే కాంట్రాక్టర్లు లైసెన్సులు పొందాలన్న నిబంధన సరిగా పాటించడంలేదు. పాటించిన కొంతమంది కాంట్రాక్టర్లు వారికి నివాసిత ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడంలేదు. వలస కార్మికుల నుంచి కమీషన్ పొందడంపై వున్న శ్రద్ధ, వారి బాగోగులపై వుండడంలేదు. కుటుంబాలకు విద్య, వైద్య సదుపాయం కల్పించాలన్న నిబంధన అమలుచేయడంలేదు. ప్రయాణ చార్జీలు ఇవ్వడం లేదు. సెలవులు సరిగా ఇవ్వరు. కనీస వేతనాలు చెల్లించరు. అత్యవసర పరిస్థితుల్లో ఇళ్లకు వెళ్లాలన్నా పంపించరు. వలస కార్మికుల చట్టం 1979 కార్మికుల హక్కులను, ప్రయోజనాలను పరిరక్షించే అతి ముఖ్యమైన చట్టం. యజమానుల దోపిడి నుంచి రక్షించే చట్టం ఇది. వలస కార్మికుడిని పనిలో పెట్టుకొనేముందు ప్రతీ కాంట్రాక్టర్ తప్పనిసరిగా సంబంధిత అధికారి నుంచి లైసెన్స్ పొందాల్సి వుంది. వలస కార్మికులను గుర్తించి, వారి ప్రాంతాలను నోటిఫై చేసే బాధ్యతను కార్మికశాఖ తీసుకోవడంలేదు. ఏ వివరాలనూ గుర్తించడంలేదు. ఏ వర్కర్ ఎక్కడ నుంచి ఎప్పుడొచ్చాడో, ఏ పరిశ్రమలో ఎంతమంది వలస కార్మికులు ఏ పని చేస్తున్నారో సమాచారం సేకరించరు. వారికి కనీస సదుపాయాలు, వసతులు లభిస్తున్నాయో లేదోనన్న స్థానిక పరిశీలన అసలే లేదు. కనీస వేతనాల చట్టం 1948 నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికులకు షెడ్యూల్ ఉద్యోగులతో సహా వేతనాలు సవరించాల్సి వుంది. వలస కార్మిక చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం అంతర్రాష్ట్ర వలస కార్మికులకు కనీస వేతనాల చట్టం 1948 సెక్షన్ 41 ప్రకారం నిర్ణయించిన వేతనాల కంటే తక్కువ చెల్లించకూడదు. పని, నివాసిత ప్రాంతాల్లో వలస కార్మికులపై ఎటువంటి దౌర్జన్యాలకు పాల్పడకుండా తగిన రక్షణ చట్టాలున్నాయి. అయితే, సరళీకరణ నేపథ్యంలో పరాయీకరణ పెరిగింది. యాజమానులు తమ దోపిడీని మరింత విస్తృతం చేసుకోవడానికి వలస కార్మికులతో రాత్రి, పగలు అత్యధిక గంటలు పని చేయిస్తున్నారు.

అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికుల చట్టాల అమలుపై శ్రద్ధ పెట్టడం లేదు. యాజమాన్యానికి అనుకూలమైన విధానాలు, చట్టాలను తీసుకొచ్చాయి. దీంతో అవి దేశంలో 4.14 కోట్లకు పైగా వున్న వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకొనే అమానవీయ పద్ధతులను అనుసరిస్తున్నాయి. ప్రధానంగా సెజ్‌లలో కార్మిక సంఘాలు పెట్టుకొనే అవకాశం లేకపోవడంతో కాంట్రాక్టర్లు, యజమానులకు వలస కార్మికులను దోపిడీ చేయడం, మోసగించడం మరింత సులభమైంది. అయితే, కేరళలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం వలస కార్మికులను అతిథి కార్మికులుగా గుర్తించి ప్రత్యేక చట్టాలు చేసింది. కనీస వేతనాలు అమలు చేస్తోంది. సంక్షేమ పథకాలు వర్తింపజేస్తోంది. ఈ తరహా రక్షణ మిగిలిన రాష్ట్రాల్లో చేయాల్సిన అవసరముంది. మన రాష్ట్రంలో వలస కార్మికులకు పని ప్రాంతంలో రక్షణకు ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. సొంత రాష్ట్ర ప్రజల వలె ఉచిత వైద్యం, ఉచిత రేషన్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ పథకాలు అందజేయాలి. పిల్లలకు ఉచిత విద్య అందించాలి. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వలస కార్మికులను గుర్తించి ప్రభుత్వ వెబ్‌సైట్లో వారి వివరాలు నమోదు చేయాలి. వారికి స్థానికంగా ఏ సమస్య వచ్చినా పరిష్కరించే లైజనింగ్ అధికారిని నియమించాలి. స్థానిక ప్రాంతాల్లో ఉపాధి లేక కుటుంబ పోషణ కోసం వేర్వేరు ప్రాంతాల్లో పని చేసే వలస కార్మికులను మనుషులుగా గుర్తించాలి. అన్ని రక్షణలూ వారికి కల్పించాలి.

# వ్యక్తి వికాసానికి మార్గం పుస్తకం

పుస్తకం మూడు అక్షరాలే అయిన ఎంతో మంది కలలకు, ఉజ్వల జీవితాలకు ఆధారం. పుస్తక పఠనం మనిషిలో విజ్ఞానాన్నిపెంచుతుంది . పుస్తకం సామాన్యుని ఆయుధం. "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో." అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆ మాటలు నేటికి పుస్తక ప్రియుల చేవుల్లో మార్మోగుతూనే ఉంటాయి. ఒక మంచి పుస్తకం వేయి మంది మిత్రులతో సమానమని అన్నారు మరో మహానుభావుడు. ఎందరో మహాను భావులు పుస్తక పఠనం విశిష్టతను ప్రయోజనాలను తెలియచేశారు.



పుస్తకం ఓ మంచి నేస్తం

ఒంటరి తనములో తోడుగా ఉండే ఓ మంచి స్నేహితుడు పుస్తకం. "పుస్తకం ఓ మంచి నేస్తం ".పుస్తకం అమ్మలా లాలిస్తుంది. నాన్నలా ఆదరిస్తుంది. గురువులా హితబోధ చేస్తుంది. బాధపడే వారిని ఓదార్చుతుంది.అలసిన మనసుల ను సేద తీరుస్తుంది.అందుకే పుస్తకం అనితరమైన ఆయుధంగా నేస్తంగాఅన్ని తరాలను అలరిస్తోంది. జీవితంలో విజ్ఞానాన్ని సంపాదించుకొని ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడే సాధనంపుస్తకం. లిపుస్తకం మనోవికాసానికి మార్గదర్శి మనోవికాసానికి మార్గనిర్దేశానికి "గురువుగా" ఉపయోగపడుతుంది. పుస్తక ప్రచురణ ప్రారంభమయిన తర్వాత మానవ జీవన గమనంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి.

ఉదయం టీ తాగితే వచ్చే హాయి పుస్తక పఠనం తో అంత హాయి వస్తుంది అంటారు పుస్తక ప్రియులు . పుస్తక ప్రియులకు అన్నిటిని మరిపించే విజ్ఞాన, వినోద, వికాస భాండాగారం పుస్తకం. జీవితములో ఉన్నత స్థాయికి ఎదిగిన వారి విజయ రహస్యం పుస్తకం. వారు ఎదిన క్రమంలో అనుభవాలు ఎదురుకొన్నకష్టాలను అక్షర రూపంలో అందించి ధైర్యాన్ని ఇస్తుంది పుస్తకం. పుస్తక పఠనం వల్ల సామాజిక అవగాహన సమస్యల పరిష్కార శక్తి యుక్తి ఇనుమడిస్తుంది. సమయానుకూల స్పందనను మెరుగైన ప్రజా సంబంధాల దృఢత్వంతో. మానవీయ విలువలు రక్షించబడుతాయి ." నా బార్య బిడ్డల కన్న పుస్తకమే నాకు ఎక్కువ నా ప్రాణం పుస్తకం" అని లిఅంభేద్కర్లి అన్నారు. పుస్తకాలకు ఆయన అంత విలువ నిచ్చే వారు.

ప్రస్తుతం అన్ని వయసుల వారు పుస్తకాలకు దూరమై టి 'వి చూస్తూ, వీడియో గేమ్స్ ఆడుతూ మానవ సంబంధాలు లేకుండా ఒంటరి జీవితానికి అలవాటు పడడం శోచనీయం. ఎప్పుడు సోషల్ మీడియాలో వుంటు కాలం గడిపే దుస్థితిలో కూరుకు పోవడం వల్ల ఒత్తిడికి లోనవుతున్నారని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి. పుస్తకాలను మ్యూజియంలో పెట్టుకొనిచూడడం తప్ప చదవడానికి ఆసక్తి చూపడం లేదు.

పుస్తక పఠనంవిజ్ఞాన వికాసం

ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవంతో తెలిసివస్తుంది. పుస్తకాన్ని చదవడంతో మనోవికాసం కలిగి నూతన ఆలోచనలు జనిస్థాయి . పుస్తకం అజ్ఞాన్ని తొలిగించి విజ్ఞాన్నిఅందిస్తుంది . గురువులా బోధిస్తుంది .ఒంటరితనంలో స్నేహితుడి లాగా అక్కున చేర్చుకుంటుంది. బాధపడేవారిని ఓదారుస్తుంది .అలసిన మనసుకు సేద తీరుస్తుంది .అందుకే పుస్తకం పఠనం తరాల తరాల సంస్కృతిని అందిస్తుంది. మానవ నాగరికత చరిత్ర వారసత్వం జాతి ఔన్నత్యం పట్ల అవగాహనకు పుస్తక పఠనం "వారధిగా" నిలవడం గమనార్హం. ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని పుస్తక పఠనం ఒక సామాజిక ఉద్యమంగా కొనసాగాల్సిన అవసరం ఉంది.

మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది ఉన్నాయి.సమకాలీన సమాజంలో సామాజిక' సాంకేతిక మార్పులు ఎన్ని వచ్చిన పుస్తక ప్రియులు పుస్తకాన్ని వదలలేదు.సినిమాలు' టివి లు 'ఇంటర్నెట్ మొబైల్' మాయలు దరి చేరిన పుస్తకం విలువ తగ్గలేదు. లిరచయిత కాఫ్కాలి

"మనల్ని గుచ్చి గాయపరిచి ఇబ్బంది పెట్టే రచనలు చదవాలి. మంచి పుస్తకం మనలో దాగి వున్న ప్రతిభను సృజనను తట్టి లేపాలి.పుస్తక పఠనం మనలో గడ్డ కట్టిన సముద్రాన్ని గొడ్డలి లాగా పగుల కొట్టాలి" అంటాడు ప్రముఖ "రచయిత కాఫ్కా."

పుస్తక పఠనం ఆరోగ్యానికి మేలులి"లిపుస్తక పఠనం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మేధస్సు సక్రమంగా పనిచేస్తుంది పాజిటివ్ ఆలోచనలు ప్రేరేపిస్తుంది .నెగెటివ్

దృక్పథాన్ని అరికడుతుంది.

పుస్తక పఠనం బహుళ ప్రయోజనాలను నూతన ఆలోచనలు సృజన శక్తి తాత్వికత

శాస్త్రీయత విశ్లేషణ పరిశీలన పరిశోధన పరిష్కారం సామర్థ్యం నూతన ఆవిష్కరణలకు దోహదపడుతుంది.

విశ్లేషణా సామర్థ్యాలను. పెంపొందిస్తుంది.

పుస్తకంపఠనం ఒత్తిడిని తగ్గిస్తుందిలి అనవసర ఆలోచనలు నియంత్రిస్తుంది .శారీరక మానసిక ఆరోగ్యం చేకూరుతుంది .ఒత్తిడి నుండి విముక్తి చెందాలంటే రాత్రి పడుకునే ముందు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు చదవడం మంచిది.శారీరక మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది .అలాగేఏకాగ్రత చేకూరి ఒంటరి తననాన్ని దూరం చేస్తుంది.ఎదిగే పిల్లలకు ఒక్కో వయసులో ఒక్కో తరహా పుస్తకం అవసరం. ప్రారంభంలో బొమ్మలు కథలు పుస్తకాలు మొదలుపెట్టి నాగరికతలు " పరికరాలు 'సాహస గాధలు ' మహనీయుల జీవిత చరిత్రలు ' శాస్త్రవేత్తలు' శాస్త్రవేత్తల 'పరిశోధనలు " మొదలగు అంశాల మీద అవగాహన చైతన్యం కలిగించడానికి అవసరమయ్యే పుస్తకాలు చదివే అలవాటు జీవన విధానములో బాగం కావాలి .

ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవం. ప్రపంచ వ్యాప్తంగావేరు వేరు (విభిన్న) తేదీలలో జరుపుకుంటున్నప్పటికి ఇన్ని ప్రత్యేకతలు వున్న ఏప్రిల్ 23 వ తేదీని ప్రపంచ పుస్తక దినోత్సవం పాటించాలని 1955 లో యునెస్కో ప్రకటించింది. అంతే కాకుండా ప్రపంచ పుస్తక కాపీ హక్కుల దినంగా జరుపాలని రచయితలు ప్రచురణ కర్తలు పాఠకులు ఉపద్యాయులను ఈ రోజు గౌరవించాలని సూచించింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో "పుస్తక మహోత్సవాన్ని" నిర్వహిస్తారు ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం పాటించాలని పారిస్ లో 1955లో జరిగిన యునెస్కో సాధారణ సమావేశములో 23 ఏప్రిల్ ను ప్రపంచ పుస్తక కాపీ రైట్ దినోత్సవం గా ప్రకటించింది.

భారత్ లో చదువరుల సంఖ్య ఎక్కువ

ప్రపంచంలోపుస్తకాలు చదివే (పాఠకులు) చదువరుల సంఖ్యమీధ జరిపిన సర్వే లో భారతదేశంలో చదివే వారు ఎక్కువ ఉన్నట్టు తేలింది. ఈ సర్వే పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువపుస్తకాలు చదివే వారు భారతీయులే . భారతీయులు వారానికి సగటున 10.2 గంటలపాటుపుస్తక పఠనం చేస్తారని దశాబ్దం కింద చేసిన ఒక అధ్యయనము లో తేలింది. 2013 నాటి సర్వే ప్రకారం పుస్తక పఠనం సమయం 10.4 గంటలకు పెరిగింది. టీ'వీలు సినిమాలు ఇంటర్నెట్ వినియోగం మారుతున్న జీవనశైలివల్ల పుస్తక పఠనము పై మోజు తగ్గలేదు.పుస్తక పఠనం లో భారత్ టాప్ లో వుండడం గర్వించదగిన అంశం( గమనార్హం) పుస్తక పఠనం చేసే వారి సంఖ్య మరింత పెరగాలని పుస్తక ప్రియులు కోరుకుంటున్నారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ఉరుకుల పరుగుల జీవితంలో పుస్తకపఠనం తగ్గిపోయింది ఆన్లైన్లో చదువుతున్నారు .పుస్తకాలు పట్టుకుని పఠనం చేయడం మర్చిపోతున్నారు . అందుకే కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమకు తోచినట్టుగాపుస్తక పఠనం పట్ల ప్రజల్లో ఆసక్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నాయి. అందులో భాగంగా పుస్తక ప్రదర్శన పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై సెమినార్లు సదస్సులు వివిధ ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించడం గమనార్హం.

ప్రభుత్వం పౌరసమాజం

పౌరసమాజం' స్వచ్ఛంద సంస్థలు ధార్మిక సంస్థలు 'మహిళా సంఘాలు 'యువజన సంఘాలు విద్యార్థి సంఘాలు' ఉద్యోగ సంఘాలు' గ్రంథాలయాలస్థాపనకు నిర్వహణకు పూనుకోవాలి.పఠనంతో పరిజ్ఞాన పరివ్యాప్తిలో క్రియాశీలక భాగస్వాములుకావాలి.పుస్తకాలు చదివే లక్షణం వాతావరణం ప్రజల్లో కలిగించాలి.పుస్తకాలు కొని చదివే సంస్కృతిని పెంపొందించడం . పుస్తకాలు ప్రపంచానికి చేసిన సేవలు గుర్తు చేసుకోవడం కొత్త తరాలను పుస్తక పఠనం వైపు ఆకర్షించడం ప్రపంచ పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా యునెస్కో ఆశయాలసాధన దిశగాకృషి జరగాలి. కేంద్ర 'రాష్ట్ర' స్థానిక ప్రభుత్వాలు పౌర గ్రంధాలయాలు స్థాపనకు పూనుకోవాలి . పాటశాల కళాశాల స్థాయిలో లైబ్రరీ లలో డిజిటల్ టెక్నాలజీ ఆధునిక సమాచార సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి మౌలిక సదుపాయాలు కల్పించాలి. పాఠకులకు మెరుగైన సేవలు అందించాలి .మానవ వనరుల సర్వతో ముఖాబివృద్ధి కి దోహదపడే బహుముఖ చర్యలుచేపట్టి విజ్ఞాన భారత్ నిర్మాణానికి పటిష్ట కార్యాచరణ ప్రణాళిక తో సగ్రమైన చర్యలకు.సంసిద్ధం కావాలని ఆశిద్దాం



నేదునూరి కనకయ్య

# బయో ఫ్యూయెల్ కు కరువైన ప్రోత్సాహం"




మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు.

అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్న మైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహొలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బొరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది.

భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారిణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందు బాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది.స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

# అర్ధంలేని పన్నులు అమెరికాకే నష్టం! అమెరికా 'ఘనత' ఆసియాకు ఘాతం

పచ్చి మతవాద పెట్టుబడిదారుల సామ్రాజ్యవాద పిచ్చి కుదరదు. వాళ్ళే వాణిజ్యవేత్తలైతే తమ కోసం, తమ తాబేదారుల కోసం వారి దోపిడీకి హద్దుండదు. అందుకు మిత్ర అమిత్ర దేశాలను కట్టడి చేస్తారు. స్వదేశ ప్రజల ఇక్కట్లనూ లెక్క చేయరు. పాత ఘనతను తిరిగి తెస్తామని మాయమాటలు చెప్తారు. నేటి అంతర్జాతీయ సమాజంలో ఈ గుణగణాల కలహ చక్రవర్తి డొనాల్డ్ ట్రంప్. అధ్యక్షునిగా ఎన్నికైన ట్రంప్ 25 నవంబర్ 2024 న సోషల్ మీడియాలో తన ఎన్నిక వాగ్దానాలను పునరుద్ఘాటించారు. కుర్చీనెక్కిన తొలి రోజే మెక్సికో, కెనడా, చైనాల నుండి వచ్చే వస్తువులపై భారీగా పన్నులు పెంచుతానన్నారు. దిగుమతులపై కొత్త సుంకాల విధింపుకు, ఆసియాలో అతిపెద్ద వ్యాపార భాగస్వాములతో సంబంధాన్ని మార్చుకుంటానని, అది వారి ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాలను కలిగించగలదని ట్రంప్ ఎన్నికల ప్రచారంలో ప్రతిజ్ఞ చేశాడు. రాబోయే పరిణామాలు అనిశ్చితం. అయినా తమ ఆర్థికాభివృద్ధికి అమెరికాకు అమ్మకాలపై ఆధారపడే ఆసియా దేశాలను దిగుమతి వస్తువులపై పెంచే పన్నులు దెబ్బతీస్తాయి. 2023లో అమెరికాకు అతి పెద్ద పది ఎగుమతి ఆసియా దేశాలు: 1. చైనా మొత్తం ఎగుమతులు 3.38 లక్షల కోట్ల డాలర్లు. అందులో అమెరికాకు 50,120 కోట్ల డాలర్లతో 14.8% 2. జపాన్ ఎగుమతులు 717,90 కోట్ల డాలర్లు. అమెరికాకు 14,510 కోట్ల డాలర్లతో 20.2% 3. దక్షిణ కొరియా ఎగుమతులు 63,220 కోట్ల డాలర్లు. అమెరికాకు 11,630 కోట్ల డాలర్లతో 18.4% 4. వియత్నాం ఎగుమతులు 35,470 కోట్ల డాలర్లు. అమెరికాకు 9,700 కోట్ల డాలర్లతో 27.4% 5. తైవాన్ ఎగుమతులు 43,240 కోట్ల డాలర్లు. అమెరికాకు 7,620 కోట్ల డాలర్లతో 17.6% 6. థాయిలాండ్ ఎగుమతులు 28,510 కోట్ల డాలర్లు. అమెరికాకు 4,850 కోట్ల డాలర్లతో 17% 7. మలేసియా ఎగుమతులు 31,260 కోట్ల డాలర్లు. అమెరికాకు 3,550 కోట్ల డాలర్లతో 11.3% 8. సింగపూర్ ఎగుమతులు 47,530 కోట్ల డాలర్లు. అమెరికాకు 4,490 కోట్ల డాలర్లతో 9.5% 9. ఇండియా ఎగుమతులు 43,140 కోట్ల డాలర్లు. అమెరికాకు 7,580 కోట్ల డాలర్లతో 17.6% 10. ఇండోనేసియా ఎగుమతులు 25,880 కోట్ల డాలర్లు. అమెరికాకు 2,320 కోట్ల డాలర్లతో 9%. చైనా వస్తువులపై ట్రంప్ విధించబోయే అధిక సుంకాలతో పరిశ్రమలు చైనా నుండి ప్రక్క దేశాలకు మారే అవకాశం ఉంది. దీంతో ఇతర ఆగ్నేయాసియా దేశాలకు లాభం చేకూరగలదు. ట్రంప్ పన్నులను నివారించడానికి కొన్ని దేశాలు తమ ఉత్పత్తిని బాగా తగ్గించవచ్చు. చైనా, కంబోడియా, వియత్నాం, మెక్సికో, బ్రెజిల్ ఇలా తగ్గించనున్నట్లు ప్రకటించాయి. లేదా ప్రోత్సాహకాలను కల్పించే ఇతర దేశాలకు తమ పరిశ్రమలను తరలించవచ్చు.అమెరికా 2023లో, చైనా, వియత్నాం, థాయ్‌లాండ్, ఇండియా, జపాన్‌ల నుండి ఎగుమతులలో ప్రథమ స్థానంలో, దక్షిణ కొరియా, ఇండోనేసియాల నుండి రెండవ స్థానంలో, మలేసియా, సింగపూర్‌లతో మూడవ స్థానంలో ఉంది. అత్యధికంగా మెక్సికో నుండి తర్వాత ఎక్కువగా చైనా, కెనడాల నుండి దిగుమతి చేసుకుంది. అమెరికా వస్తువులను పొందే మొదటి 10 దేశాలలో 6 ఆసియా దేశాలు. అమెరికా దిగుమతుల్లో వాటి శాతం 32. అనేక ఆసియా దేశాలతో అమెరికా వాణిజ్య లోటులో ఉన్నందున వస్తు సరఫరా పరస్పరం కాదు. అంటే అమెరికా ఆ దేశాలకు ఎగుమతి చేసే దానికంటే ఎక్కువ దిగుమతి చేసుకుంటుంది. 2024 మొదటి 9 నెలల్లో అమెరికా పెద్ద వాణిజ్య లోటు చైనాతో, తర్వాత మెక్సికో, వియత్నాంలతో ఉంది. వియత్నాంతో 9,060 కోట్ల డాలర్ల లోటు ఉంది. జపాన్, దక్షిణ కొరియాలతో వాణిజ్య లోటు మొదటి 10 స్థానాల్లో ఉంది. గత ఏడాది కాలంలో చైనా వస్తువుల దిగుమతి తగ్గించడంతో చైనాతో వాణిజ్య లోటు తగ్గింది. థాయ్‌లాండ్ వంటి దేశాలతో లోటు పెరుగుతోంది. వాణిజ్య లోటును తగ్గించడానికి దిగుమతులపై సుంకాలను పెంచాలనుకుంటున్నట్లు ట్రంప్ చెప్పారు. అయితే అతని పన్నుల పెంపును అమెరికన్లు చెల్లించవలసివస్తుందని ఆర్థికవేత్తలు హెచ్చరించారు. పెరిగిన దిగుమతుల ఖర్చులను కంపెనీలు వినియోగదారులకు బదిలీ చేయడం వల్ల స్వదేశంలో ధరలు పెరుగుతాయి.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి





లింగాల డిసెంబర్19(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల మెనూ సంబంధించిన చార్జీలను సీఎం రేవంత్ రెడ్డి ధరలు పెంచడం జరిగిందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. లింగాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలను ఆయన పరిశీలించడం జరిగింది. విద్యార్థుల సమస్యల గురించి ఆయన అడిగి తెలుసుకోవడం జరిగింది.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతి గృహాల్లో ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు ఆయా వసతి గృహాల వార్డన్లు నాన్న నేను భోజనాన్ని అందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. మండలంలోని ఆయా వసతి గృహాల్లో మౌలిక సమస్యలు ఉంటే ఆయా శాఖ అధికారులు వారికి సమర్పించి ఆ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న వార్డెన్లు సిబ్బంది సమయానికి పాటించి విద్యార్థులకు రోజువారీగా పండ్లు గుడ్లు తదితర పోషక విలువైన కూరగాయలతో సమతుల్యమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. భోజన విషయంలో వార్డెన్లు అజాగ్రత్తగా ప్రవర్తిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం లింగాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఆసుపత్రిని ఆయన పరిశీలించడం జరిగింది. ఆసుపత్రిలోని పలురికాలను ఆయన పరిశీలించడం జరిగింది. మెరుగైన వైద్యం అందుతుందా లేదా అని విషయాన్ని రోగులతో ఆయన అడిగి తెలుసుకోవడం జరిగింది. వైద్య సిబ్బంది వితినిర్వాహంలో నిర్లక్ష్యంగా వివరించి విధులకు ఆటంకం కలిగిస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమయం పాలన పాటిస్తూ విధులు నిర్వర్తిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆస్పత్రులు అన్ని రోగాలకు సంబంధించిన మందులను నిల్వ ఉంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు డాక్టర్లు వారితో సన్నిహితంగా ఉంటూ మాట్లాడుతూ వైద్యం చేస్తే సగం రోగం తగ్గినట్టుగా రోగులు ఆస్వాదిస్తారని అన్నారు. ఎమ్మెల్యే వెంట వైద్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో ఆదివాసి చట్టాలను గిరిజనేతులకు తాకట్టు పెడుతున్న తహసీల్దార్ ను వెంటనే సస్పెండ్ చేయాలి..

## జిఎస్పీ కార్యదర్శి పూనెం సాయి దొర.....



వెంకటాపురం డిసెంబర్ 19 (వుదయం ప్రతినిది) జిఎస్పి ఆధ్వర్యంలో కొమరం భీమ్ కాలనీ ఆదివాసులు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి నాలుగో రోజు జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర ప్రారంభించి మాట్లాడుతూ ఆదివాసి చట్టాలను గిరిజనేతులకు తాకట్టు పెడుతున్న ములుగు జిల్లా వెంకటాపురం తాసిల్దారును తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు పై అక్రమ బవులంతస్తులు నిర్మిస్తుంటే గిరిజనేతరులపై 145 సెక్షన్ ఎందుకు ఈంచలేదని ఆయన మండిపడ్డారు.గత 20 సంవత్సరాల నుండి ఆదివాసీలు సాగులో ఉన్న భూములకు ఎలా 145 సెక్షన్ ఎలా పెడతారు అని ఆయన మండిపడ్డారు ఏజెన్సీ ప్రాంతమైన ఐదో షెడ్యూల్ భూభాగంలో పనిచేస్తున్న గిరిజనేచర్లను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండల కేంద్రంలో బడా గిరిజనేతరుడు అక్రమ భవులంతస్తులు నిర్మిస్తుంటే అధికారులు నిదురపోతున్నారా మాకు సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు ఆదివాసీల ఓట్లతోని గెలిచిన ఆదివాసి ఎమ్మెల్యేలు కూడా నాలుగు రోజుల నుండి దీక్షలు చేస్తున్నప్పటికీ కూడా ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరంగా ఉన్నదని ఆయన అన్నారు ఆదివాసీలపై కేసులు పెట్టడమే ఈ ప్రభుత్వ లక్ష్యమా లేదంటే ఆదివాసీలతోనే దండయాత్ర కూడా సిద్ధమని త్వరలోనే వెంకటపురం మండల కేంద్రాన్ని బందు పిలుపు ఇస్తామని ఆయన హెచ్చరించారు మేము ఎలాంటి కేసులు కైనా తెగించైనా ఆదివాసి ఉద్యమాన్ని ఆదివాసులను కాపాడుకుంటామని ఆయన అన్నారు 1/70 చట్టాన్ని ఈ రెవిన్యూ అధికారులు ఎందుకు అమలు చేయడం లేదని ముక్తకంఠంతో మండిపడ్డారు వలస గిరిజనేతర్లను గో బ్యాక్ అని ఆయన మండిపడ్డారు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల స్థితిగతులను ములుగు జిల్లాలో ఉన్న ములుగు జిల్లా కలెక్టర్ గారు ఐటిడిఏ పిఓ గారు పర్యవేక్షణ చేయాలని లేదంటే ఆదివాసి ఉద్యమం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఏజెన్సీ ప్రాంతంలో వలస గిరిజనేతరులకు ప్రభుత్వ భూములపై వెంకటాపురం తాసిల్దారు ఎలా పట్టాలిచ్చారని ఆయన ప్రశ్నించారు ఒక ఆదివాసులు సాగు భూమిని కూడా అడ్డుకుంటున్నారంటే రాజకీయ బలంతో ఆదివార చట్టాలను నిమ్మకు నీరు ఎట్టినట్లు ఎవరిస్తున్నారని ఆయన ఆరోపించారు కొమరం భీమ్ ఆదివాసులకు అన్యాయం చేస్తే మాత్రం వెంకటాపురం మండల కేంద్రంలో వలస గిరిజ నేతల భరతం పడతామని ఆయన మండిపడ్డారు ఆదివాసీలు భారత రాజ్యాంగంలో చట్టాలు ఉన్నప్పటికీ ఈ నీచమైన రాజకీయ పార్టీలు తుంగలో తొక్కుతున్నారని ఆయన సూటిగా ప్రశ్నించారు ఈ రేవంత్ రెడ్డి గారు ఆదివాసుల పక్షాన పని చేయలేని పక్షంలోని ఇలాంటి ఉద్యమాలు కొనసాగుతున్నయని ఆయన అన్నారు కొమరం భీమ్ కాలనీ ఆదివాసి లకు న్యాయం జరగకపోతే మాత్రం రేపు జరగబోయే సర్పంచి ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయొద్దని ఆయన ఆదివాసులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కొమురం భీం కాలనీ ఆదివాసులు పాల్గొన్నారు

# ప్రతి విద్యార్థి ఆరోగ్య సంరక్షణే ప్రధాన ధ్యేయం

- పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్
- పాముల నుంచి విద్యార్థులకు అపాయం కలుగకుండా చూడాలని
- అధికారులకు కీలక ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్





జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 19( వుదయం ): గురుకుల పాఠశాలల్లో చదువుతోపాటు ప్రతి విద్యార్థి ఆరోగ్య సంరక్షణే ప్రధాన ధ్యేయమని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. గురుకుల పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలు పాములు, ఇతర విష పురుగులు రాకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.పాము కాటు కేసుల నేపథ్యంలో పెద్దాపూర్ లోని గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం సందర్శించారు. పాఠశాల లోని చుట్టూ పరిసర ప్రాంతాలను తిరిగి పరిశీలించారు. పొదలు చెట్లు పెరిగిపోకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఈ విషయంలో అధికారులు బాధ్యత యుతంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలోని హాస్టల్ గదులు, బెడ్స్ ను పర్యవేక్షించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పెద్ద చెట్ల పై ఒకవేళ పాములు ఉంటే పాములు పట్టే వారితో వాటిని పట్టించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అపాయం కలుగకుండా పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అత్యుత్తమంగా వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణం సురక్షిత ప్రాంతంగా ఉండేలా తీర్చిదిద్దాలని, ఏలాంటి విష సర్పాలు క్రిమి కీటకాలు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పర్యవేక్షిస్తుండాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని పేర్కొన్నారు.

పాఠశాల వద్ద శుభ్రత పాటించడం తోపాటు, కిటికీలకు నెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. ఇలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల పాఠశాల ఆవరణ, హాస్టల్ ఆవరణలోకి విష సర్పాలు, పాములు రాకుండా ఉంటాయని తెలిపారు. పాము కాటు నుంచి తప్పించుకునే మార్గాలు, ఒకవేళ పాము కాటు గురైతే ప్రథమ చికిత్స సంబంధించిన వాటిపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆరోగ్య సంరక్షణతో పాటు విద్యకు అత్యధికంగా శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన కింద వద్దని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మెట్పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పాఠశాల ప్రిన్సిపాల్ తహసిల్దార్, ఎంపీడీవో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

ఈనెల 27, 28 తేదీలో సమ్మె.

ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం.

కార్మిక సంఘం సిఐటియు మండల అధ్యక్షుడు ఉస్మాన్ పాషా.



ఖానాపురం డిసెంబర్ 19 వుదయం ప్రతినిధి.మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో సూపర్డెంట్ వెంకటేశ్వర్ రెడ్డి కి వినతి పత్రం అందజేసినట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సంఘం సిఐటియు మండల అధ్యక్షుడు ఎస్కే ఉస్మాన్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేసే సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే టోకెన్ సమ్మెకు అన్ని గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు బోడ వీరన్న, ప్రధాన కార్యదర్శి గూగుల్ బిక్షపతినాయక్, మహిళా మండల అధ్యక్షురాలు కోడూరు వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలు యాకూబీ,కార్యదర్శి కుమార్, సభ్యులు ఎర్ర సోమక్క, సమ్మక్క, ప్రసన్న, పార్వతి, కవిత, శైలజ, నరసయ్య, బిక్షం, స్వామి, మాణిక్యం, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం జరిపిస్తున్న మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి:కలెక్టర్ సి. రెడి





రంగారెడ్డి జిల్లా డిసెంబర్19(వుదయం ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూరే విధంగాప్రభుత్వం జరిపిస్తున్న మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలనికలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేప్రక్రియను కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలోపరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసంప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్నతీరును పరిశీలించిన కలెక్టర్, వారికి సూచనలు చేశారు. రోజుకు ఎన్నికుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు? సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలోఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని ఆరా తీశారు. ప్రభుత్వమార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలనుఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఈనెలాఖరులోగా ప్రణాళికాబద్ధంగా సర్వే పూర్తి చేయాలని అన్నారు. అర్హతకలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్న దృష్ట్యా, దరఖాస్తుదారుల వివరాల నమోదులోపొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపాలిటీపరిధిలోని వారు వార్డు అధికారిని, గ్రామాల్లో ఉండే వారు పంచాయతీకార్యదర్శిని సంప్రదించవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.అనంతరం పెంజర్ల గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రమును ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రతిరోజూ సగటున ఎంతమంది రోగులు వస్తున్నారు. గ్రామంలోనిగర్భిణిలకు సరైన మందులు, పరీక్షలు నిర్వహిస్తున్నారా అని అడిగితెలుసుకున్నారు. ప్రతి పదిహేను మంది మహిళలో ఒకరికి అబార్షన్ అవుతున్నందునదీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల అబార్షన్జరిగిన మేఘన అనే మహిళతో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అబార్షన్ లు జరగకుండా తగిన వైద్యం అందించాలని తెలిపారు. ప్రభుత్వఆసుపత్రులలో అధిక మొత్తంలో ప్రసవాల జరిగేలా చూడాలని డాక్టర్, సిబ్బందికిసూచించారు. వైద్య సిబ్బందితోపాటు పేషెంట్లకు సంబంధించిన రిజిస్టర్లనుపరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది విధులకు సరైన సమయానికి హాజరు కావాలని,ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలుపరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికిసూచించారు. టెస్టులు నిర్వహించి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలనిసంబంధిత సిబ్బందిని ఆదేశించారు. రోగులకు అందిస్తున్న మందులనుపరిశీలించారు.

# ఏక సభ్య కమీషన్ చైర్మన్ కు వినతి పత్రం సమర్పించిన ఏక్ శంకర్ మాదిగ



హనుమకొండ, డిసెంబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండ జిల్లా హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమీషన్ ఈరోజు ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో విచారణ కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ షెడ్యూల్డు కులాల ఉపవర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం జిల్లా ఉమ్మడి వరంగల్ హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయము నందు విచారణ వచ్చిన డాక్టర్ జస్టిస్ శమీమ్ అత్తర్ గారిని కలిసి మాదిగలకు మాదిగ ఉప కులాలకు జరుగుతున్న అన్యాయం మొన్న జరిగిన డీఎస్సీ లో కూడా మాదిగ మాదిగ ఉపకులాలకు తక్కువ శాతం ఉద్యోగాలు అవకాశాలు వచ్చినయని షెడ్యూల్ కులాల వర్గీకరణ లేకపోవడం వల్ల 58 కులాలకు జరుగుతున్న అన్యాయం మరియు హనుమకొండ జిల్లా కేంద్రంలో 14 మండలాలలో 18 నుంచి 22% మాదిగలు ఉంటారని వర్గీకరణ లేకపోవడం వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని కమిషన్ చైర్మన్ కు వినతి పత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్మ దినేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకుశంకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ప్రశాంత్ మాదిగలు వినతి పత్రం అందజేశారు.

# ఆర్టీసీ బస్సు నుండి డీజిల్ మాయం

లింగాల డిసెంబర్19(వుదయం ప్రతినిధి): కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు చెందిన హైదరాబాద్ బయల్దేరి బస్సు రోజువారి మాదిరిగానే లింగాల మండల కేంద్రంలో రాత్రి సమయంలో నైట్ హాల్టును చేయడం జరుగుతుంది. ఈ బస్సు ద్వారా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి సమయంలో బస్సులో ఉన్న డీజిల్ మొత్తం దొంగలించిన సంఘటన బుధవారం చోటు చేసుకున్నది. గురువారం రోజు ఉదయం బస్సు డ్రైవర్ బస్సు నడిపి సమయం చేస్తున్న సమయంలో బస్సు కదలకపోవడంతో అనుమానం వచ్చి డిజిల్ చూడడంతో పూర్తిగా దొంగలించడం జరిగిందని గమనించి లింగాల పోలీస్ స్టేషన్లో డ్రైవర్ ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ విషయంపై లింగాల ఎస్ఐ పూర్తిగా పరిశీలించడం జరుగుతుందని అన్నారు.

# త్రాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం

## అనేకసార్లు చెప్పిన పట్టించుకోని కార్యదర్శి



శాయంపేట,19 (వుదయం ప్రతినిధి) మండల కేంద్రంలోని ఆరవ వార్డులో గత మూడు నెలలుగా త్రాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. త్రాగునీరు రావడంలేదని అధికారులను అడిగితే మోటారు కాలిపోయిందని చెబుతున్నారని అన్నారు. కాలిపోయి మూడు నెలలు అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందులు ఉన్నాయని చెప్పినప్పటికీ కనీసం కన్నెత్తి చూడకుండా గ్రామ కార్యదర్శి వ్యవహరిస్తున్నారని తెలిపారు. త్రాగునీరు కోసం బావులను ఆశ్రయించవలసి వస్తున్నదని, వాటి ఫలితంగా రోగాల బారిన పడే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్యదర్శి పై చర్యలు తీసుకొని మంచినీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, గీత, రాజమ్మ, సంధ్యారాణి, నీలమ్మ, సునీత, రజిత, లక్ష్మి, తదితర మహిళలు పాల్గొన్నారు.

# దమ్మపేట ప్రెస్ క్లబ్ నూతన చైర్మన్ గా అక్కం సత్యనారాయణ

### ప్రధాన కార్యదర్శిగా తోట మల్లేశ్వరరావు



దమ్మపేట డిసెంబర్19(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండల కేంద్రంలో అక్కం సత్యనారాయణ కాంప్లెక్స్ లో దమ్మపేట ప్రెస్ క్లబ్ గౌరవ సమన్వయ సభ్యులు అడపా లచ్చయ దొర, రావు శ్రీధర్, పిట్టల రాంబాబు సమక్షంలో సభ్యులు సమావేశమై దమ్మపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అందరి సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపకులు అడపా లచ్చయ్య దొర, చామర్తి సాయి ప్రసాద్ శాస్త్రి, ప్రెస్ క్లబ్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ 1999 వ సం.లో స్థాపించిన మన దమ్మపేట ప్రెస్ క్లబ్ కి మూడు దశాబ్దాల కాలంలో దమ్మపేట మండల వ్యాప్తంగా ఎందరో పత్రిక విలేకర్లు తమ సేవలు క్లబ్ కి అందించారు అని మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు మన క్లబ్ ని ఆదరించారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ సమావేశంలో నూతనంగా క్లబ్ లో చేరిన సభ్యులను ఉద్దేశించి మన సభ్యుల వ్రాసే పత్రిక వార్తలు ప్రజా మన్ననను పొందే విధంగా, సామాన్యుడికి సహాయం చేసే విధంగా, సమాజంలో సముచిత గౌరవించే విధంగా ఉండాలి అని తెలియజేశారు, ఈ సమావేశంలో క్లబ్ సభ్యుల సలహాలు, సూచనలను తీసుకున్నారు, ఈరోజు ఎన్నుకున్న నూతన కమిటీ కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటదని, ఈ రెండు సంవత్సరాలు కాలంలో కమిటీలో ఉన్న సభ్యులు ఎటువంటి పరిస్థితుల్లో కూడా కమిటీ నుండి తప్పుకోకూడదు అని ఒకవేళ ఎవరైనా సభ్యుడు అతిక్రమించిన ఎడల వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పగా దీనికి అందరి సభ్యులు ఏకగ్రీవ ఆమోదం తెలియజేశారు. నూతన కమిటీ లో భాగంగా చైర్మన్ పేరుని అక్కం సత్యనారాయణ పేరు చెప్పగానే సభ్యులందరూ ఏకగ్రీవంగా తమ నిర్ణయాన్ని తెలియజేశారు తదుపరి గౌరవ అధ్యక్షులుగా 2000 సంవత్సరం నుండి దమ్మపేట ప్రెస్ క్లబ్ కి పనిచేస్తున్న చామర్తి సాయి ప్రసాద్ శాస్త్రి ని ఏకగ్రీవంగా సభ్యులందరూ ఎన్నుకున్నారు, మిగతా కమిటీ సభ్యులను సభ్యులందరు ఆమోదంతో క్రింద తెలిపిన కమిటీ పదవులు నిర్ణయించబడ్డాయి.

ఉపాధ్యక్షుడిగా కౌలూరి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి గా తోట మల్లేశ్వరరావు, కోశాధికారి గా రొయ్యల బాబురావు, సహాయ కార్యదర్శి గా గట్ల శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి గా పానుగంటి లక్ష్మణ్ గౌడ్, కార్యనిర్వాహక సభ్యులు గా రావు రవిశంకర్, తాలూరి ప్రవీణ్, పునుగుపాటి వెంకటేశ్వరరావు, గాజుబోయిన శ్రీనివాసరావు, దొడ్డా వినోద్ కుమార్. ఎన్నుకోవడం జరిగింది

# నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం..మాజీ సర్పంచ్ తూటి పావనిరమేష్



చెన్నరావుపేట డిసెంబర్19(వుదయం ప్రతినిధి): చెన్నారావుపేట మండల కేంద్రంలోని గ్రామంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ సర్పంచ్ తూటి పావనిరమేష్ అన్నారు..ఈ రోజు చెన్నారావుపేట మండలంలోని అక్కల్ చెడ గ్రామం హరియా నాయక్ తండా లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా అర్హులైన నిరుపేదలకు ఉండటానికి నివాసం గూడు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ఆన్లైన్ సర్వే లో పాల్గొన్నారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉండడమే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ధ్యేయమని వారు అన్నారు.గ్రామంలోని హరియా నాయక్ తండాలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రజా పాలనలో దరఖాస్తుల ఆధారంగా గ్రామ కార్యదర్శి చేరాలు సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బాణోత్ వీరన్న నాయక్ మండల నాయకులు భూక్య సురేష్ బాధవత్ బాలు భద్రు సురేష్ అనిల్ రవి రాజేష్ బాలు బుజ్జి మంగమ్మ విజయ కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక సైబర్ నేరాలను పసిగట్టాలి.

**సైబర్ నేరాలను పసిగట్టాలని కామారెడ్డి పోలీసు కళాబృందం కళాకారులు లిఎమ్మెస్ ప్రభాకర్, మద్నూరు ఏఎస్ఐ సుధాకర్, బాన్సువాడ షీ టీం కానిస్టేబుల్ ప్రియాంక లు అన్నారు..**




మద్నూరులోని డిసెంబర్19(వుదయం ప్రతినిధి): తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం జూనియర్ కళాశాలలో కామారెడ్డి పోలీసు కళాబృందంవారిచే సాంకేతిక సైబర్ నేరాలపై, షీ టీం గురించి, డ్రగ్స్, ట్రాఫిక్ పోలీసు రూల్స్ గురించి అవగాహన సదస్సును కల్పించారు. ఈ సందర్భంగా లిఎమ్మెస్ ప్రభాకర్లి మాట్లాడుతూ–సమాజంలోని యువత సైబర్ నేరాలను పసిగట్టాలని, ఇంట్లో తల్లిదండ్రులకు, అక్కాచెల్లెళ్లకు అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. ఉదాహరణకు సమాజములో జరుగుతున్న యదార్థ సంఘటనలను కొన్నింటిని ఉదాహరించి కథారూపములో చెప్పారు. బాన్సువాడ షీ టీం సభ్యురాలు లిప్రియాంకలి మాట్లాడుతూ–మహిళలపట్ల, అక్కాచెల్లెండ్లపట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే 100 నెంబర్ కు డయల్ చేయాలని, వెంటనే షీ టీం వచ్చి నేరగాలను పట్టుకుంటారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ కు అలవాటు పడవద్దని, మంచిని గ్రహించాలని, చెడును వదిలిపెట్టాలని, అన్నారు. లిమద్నూరు ఏఎస్ఐ సుధాకర్లి మాట్లాడుతూ–రోడ్లపై నడిచే ప్రజానీకం, వివిధ వాహనాలను నడిపేవారు ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని అన్నారు. విద్యార్థులు అన్ని విషయాలను తెలుసుకోవాలని, విద్యలో బాగా రాణించాలని అన్నారు.

అన్ని విధాల పోలీసులు రక్షణగా ఉంటారని ఏ విషయమైనా నిర్భయంగా పోలీసులకు ఫోన్ చేసి చెప్పవచ్చని అన్నారు. కామారెడ్డి పోలీస్ కళాబృందం సభ్యులు– లిసాయిలు, ఎం అనిల్,లి ఇన్ చార్జ్ అసిస్టెంట్ ప్రిన్సిపాల్ లిసుమన్, ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత,సంస్కృతోపన్యాసకులు బి వెంకట్, ఉపాధ్యాయులు–వేణుగోపాల్ ,నరహరిప్రసాద్,జే.గణేశ్, సంతోష్,రాము, నాగేంద్ర, విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు..

# మాజీ మంత్రి పాటి రాజ్యం 31వ వర్ధంతి

సిరిసిల్ల, డిసెంబర్19(వుదయం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కేంద్రంలో గురువారం మాజీ మంత్రి ఉన్నత విద్యాశాఖ మరియు భారీ నీటి పారుదల శాఖ మంత్రి పాటి రాజ్యం 31వ వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో దళిత సంఘాలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని ఆయన చేసిన అభివృద్ధి పనులు కొనియాడారు.

# 12వ సంవత్సరంలో అడుగు పెట్టబోతున్న హేమంత్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు



(గద్వాల డిసెంబర్ 19 వుదయం ప్రతినిధి )జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సుంకులమ్మ మెట్టు వీధి 30వ వార్డుకు చెందిన రామాంజనేయులు సంధ్యా దంపతుల మొట్టమొదటి ముద్దుల కుమారుడు 11సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా హేమంత్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పెద్దనాన్న పెద్దమ్మ అయినటువంటి మధు లలిత జోగులాంబ గద్వాల జిల్లా ఆంధ్రప్రభ జిల్లా స్టాపర్ సీనియర్ జర్నలిస్టు ఎన్నటికీ తరగని ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు సుఖశాంతులను ప్రసాదించాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటూ హేమంత్ కుమార్ కి పెద్దనాన్న పెద్దమ్మ శుభాశీస్సులు ధీర్ఘాయుష్మాన్ భవ! హృదయ పూర్వక 12వ సంవత్సరం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రావెళ్ళ సాయిశ్రీ ఆధ్యాత్మిక సేవాభావం ఆదర్శనీయం

### యెర్నేని బాబు



కోదాడ టౌన్ డిసెంబర్ 19(వుదయం) అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం అభినందనీయమని కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. గురువారం పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రావెళ్ల కృష్ణారావు ,మాలతి దంపతుల కుమార్తె సాయిశ్రీ జన్మదినం సందర్భంగా అయ్యప్ప స్వాములకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ జన్మదిన వేడుకల కు వృధా ఖర్చులు చేసే ఈ రోజుల్లో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం అభినందనీయం అన్నారు .అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదనీ స్వాముల దీక్షలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రావెళ్ల కృష్ణారావు మాలతి, తాళ్లూరి నరసింహారావు, సరిత, సందీప్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# కంపు...కంపు... కుళ్లిన గుడ్లు కాలువలో... ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి

కోదాడ –అనంతగిరి రహదారి మార్గమధ్యంలో...



అనంతగిరి, డిసెంబర్ 18 కోదాడ– అనంతగిరి రహదారి మార్గమధ్యంలోని ఐటిఐ కళాశాల సమీపంలోని కాల్వలో కుళ్ళిన గుడ్లు పడేస్తున్నారు. దీంతో వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. భయంకరమైన వాసన వెదజల్లుతుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానికులు పేర్కొంటున్న ప్రకారం బాతు కూలిన గుడ్లు పడేస్తున్నారని, ఇలా ప్రతి నెల ఇదేవిధంగా ఇక్కడ కాలువలో పడేసి పోతారని తెలిపారు మురిగిన బాతు గుడ్లు వల్ల రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు స్థానికులకు దుర్వాసన తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో దోమల ఈగలు బెడద తీవ్రంగా వ్యాప్తి చెందడంతో నీరు కలుషితంగా మారి పశువులు దాహం తీర్చుకొని చనిపోయే ప్రమాదాలు కలుగుతున్నాయి. ఇదే విషయం పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇలా బాతు గుడ్లు పడేయడంతో నీరు సైతం కలుషితమవుతూ దగ్గరలో ఉన్న బోరు బావులోకి చేరి స్థానికుల ఆరోగ్య సమస్యలతో బాధపడాల్సి వస్తుంది ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# స్త్రీ వైద్య నిపుణుల కోరుట్ల మెట్పల్లి అసోసియేషన్ కార్యవర్గ ఏర్పాటు...

### కోరుట్ల మెట్పల్లి స్త్రీ వైద్య నిపుణుల అసోసియేషన్ అధ్యక్షురాలుగా డాక్టర్ స్వీటీ అనుప్



కోరుట్ల డిసెంబర్ 19 (వుదయం ప్రతినిధి) కోరుట్లలో జరిగిన గైనకాలజిస్టుల సమావేశంలో కోరుట్ల మెట్పల్లి అబ్ స్టెటీషియన్ అండ్ గైనకాలజిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (కేవెూగ్స్ కే ఎం ఓ జి ఏన్) అధ్యక్షురాలిగా డాక్టర్ స్వీతి అనుప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులుగా డాక్టర్ అనురాధ వేణుగోపాల్ డాక్టర్ భోగ శ్రీలత కార్యదర్శిగా డాక్టర్ హెప్సిబా జేకబ్ సహాయ కార్యదర్శిగా డాక్టర్ మానస డాక్టర్ రాజ్యలక్ష్మి కోశాధికారిగా డాక్టర్ జోష్ణ రమేష్ ఉపకోషాధికారిగా డాక్టర్ శృతి అన్వేష్ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ఎన్నికైన డాక్టర్ స్వీతి అనుప్ మాట్లాడుతూ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు మహిళా వైద్యుల సమస్యలను ఐక్యంగా పరిష్కరించుకుంటామన్నారు స్త్రీల వ్యాధులు సమస్యలు సురక్షిత పట్ల ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు కార్యవర్గ ప్రమాణ స్వీకారం డిసెంబర్ 22 రోజున ఉదయం 11 గంటలకు ఇస్తా రెస్టారెంట్ బంకెట్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు

# కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మొదటి కార్యవర్గ సమావేశం





కమలాపూర్ డిసెంబర్ 19 (వుదయం ప్రతినిధి) హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ కు మొదటిసారి ఏర్పడిన నూతన పాలకవర్గం గురువారం నాడు మొదటి సమావేశం చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి అధ్యక్షతన మార్కెట్ కార్యాలయంలో నిర్వహించారు ఇట్టి సమావేశంలో వైస్ చైర్మన్ దేశిని అయిలయ్య ఎంపీడీవో గుండె బాబు, సింగిల్ విండో చైర్మన్ పేరాల సంపత్ రావు, మార్కెట్ కార్యదర్శి రాజు, సూపర్వైజర్ యాకయ్య, డైరెక్టర్లు ఉరుసు తిరుపతి, సముద్రాల కృష్ణ, కెత్తే విజయేందర్, చకిలం దయాకర్, మిల్కూరి శ్రీనివాస్, ఆకినపల్లి బిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి, జనగాని శివకృష్ణ, యాకూబ్, నెగ్గుల లింగయ్య, పాల్గొన్నారు నూతన పాలకవర్గం ఏర్పాటులో సహకరించి పాలక వర్గ నియామకంలో ప్రత్యేక చొరవ చూపించిన రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ గారికి ధన్యవాదాలు తెలుపుతూ పలు తీర్మానాలు చేయనైనది, వ్యవసాయ మార్కెట్ లో నూతన గోదాముల నిర్మాణం, పాలకవర్గ సమావేశం మందిరం, దాన్యం ఆరబోసే ఫ్లాట్ ఫారాలు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేయుటకు తీర్మానం చేయనైనది అనంతరం మార్కెట్ కమిటీ అధికారులు కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మిక తనిఖీ





రంగారెడ్డి జిల్లా డిసెంబర్19(వుదయం ప్రతినిధి): గురువారం కొత్తూరు మండలంలోని పెంజర్లలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగాతనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలను, హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పదవ తరగతి సందర్శించివిద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు చదువు పట్ల నిర్లక్ష్యం వహించరాదని, భయ%శీ%తో పరీక్షలు రాయవద్దని, ఆత్మవిశ్వాసంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. కృషి, పట్టుదలతో పరీక్షలు రాసినప్పుడేమెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. పాఠశాలకు గైర్హాజరు అవకుండా క్రమంతప్పకుండా పాఠశాలకు హాజరై కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలనిఅన్నారు. మళ్ళీ మళ్ళీ ఇలాంటి అవకాశం రాదని, అందుకే బాగా చదివి పదవ తరగతిలో అధిక ఉత్తీర్ణత శాతంను సాధించాలని అన్నారు. పదవ తరగతి పరీక్షలకుసరియైన ప్రణాళికతో సిద్ధం కావాలని అన్నారు. పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగైనఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని సూచించారు. పదవ తరగతిలో 10కి 10 గ్రేడ్ పాయింట్స్ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనమును పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రమును సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రములోని పిల్లలతో ముచ్చటించారు. పిల్లల పేర్లు, వారు వేసే డ్రాయింగ్ ను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు, గర్భిణిలకుఅందిస్తున్నఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలో రక్తహీనతరాకుండా మంచి పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ అంగన్వాడీ సిబ్బందికిసూచించారు. చిన్న పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి వారికిసరైన ఆహారం అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలలో ఉన్నబరువు, ఉండాల్సిన బరువు వివరాలను నమోదు చేయాలని, పిల్లల్లో అనిమియా రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధనలకు నాంది పలకాలి

### అడిషనల్ కలెక్టర్ పి రాంబాబు



కోదాడ టౌన్ డిసెంబర్ 19(వుదయం) వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధన రంగాలకు నాంది పలకాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి పాఠశాలలో సూర్యాపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 52 వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజానికి మనుగడ సైన్స్ అండ్ టెక్నాలజీ అని అన్నారు. సైన్స్ లేకపోతే జీవితమే లేదని విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభిరుచిని పెంచుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు డాక్టర్లు ఇంజనీర్లు ఉపాధ్యాయులు శాస్త్రవేత్తలు కావాలని కలలు కంటున్నారని వారి కలలను సాకారం చేయాలన్నారు. భారతదేశం శాస్త్రవేత్తలకు పుట్టినిల్లు అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు జీవితాన్ని దారం పోసిన అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తల యొక్క ఆశయాలను సాధించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యనందిస్తున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 23 మండలాల నుండి 84 ఇన్స్పైర్ అవార్డుల ప్రయోగాలు, 312 ప్రదర్శనలు వచ్చాయని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు ఉపాధ్యాయ సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సిహెచ్ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు , జిల్లా సైన్స్ అధికారి ఎల్ దేవరాజ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఎంపీడీవో రామచంద్రరావు,ఎంఈఓ సలీం షరీఫ్, ఛాత్రు నాయక్, కౌన్సిలర్ గంధం యాదగిరి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైన్స్ ఫెయిర్ కమిటీల కన్వీనర్లు, కో కన్వినర్లు,సభ్యులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అజాంజాహి మిల్లు కార్మిక భవనం వివాదంలో కీలక పరిణామం

జనగామ, డిసెంబర్19(వుదయం ప్రతినిధి): అజాంజాహి మిల్లు కార్మిక భవనం వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది.

గురువారం కార్మిక భవన స్థలాన్ని వరంగల్ తహశీల్దార్ ఇక్బాల్ పరిశీలించి, కీలక ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఏజెన్సీ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించండి.

-బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్న ఏజెన్సీ ప్రజలు.
-రవాణా శాఖ మంత్రిని కలిసి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య.
-సానుకూలంగా స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
-త్వరలోనే బస్సు సౌకర్యం కల్పిస్తామన్న రవాణా శాఖ మంత్రి.





బయ్యారం(వుదయం ప్రతినిధి) డిసెంబర్ 19.బయ్యారం మండలంలో ఏజెన్సీ గ్రామాలకు సంబంధించి బస్సు సౌకర్యం కొరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని స్థానిక ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతంలో రూట్ -1 మహబూబాబాద్ నుండి బోడగుట్ట తండ మీదుగా ఉప్పలపాడు, వెంకట్రాంపురం, బయ్యారం, కొత్త పాత ఇర్సులాపురం, రామగుండాల, జగత్రావుపేట కంబాలపల్లి నారాయణపురం ఇల్లందు రూట్ - 2 మహబూబాబాద్ నుండి కంబాలపల్లి, గురిమెళ్ళ వినోభానగరం, గౌరారం, బాలాజీ పేట, పెత్తళ్లగడ్డ బయ్యారం రూట్ -3 మహబూబాబాద్ నుండి గంధంపల్లి,కోటగడ్డ, కొత్తగూడెం, కొయ్యగూడెం, కంబాలపల్లి కస్తూరినగరం, గంధంపల్లి ఈ గ్రామాల మీదుగా బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్న ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని అలాగే నామలపాడు గ్రామంలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు.వారిని చూసేందుకు వచ్చే వారి తల్లిదండ్రుల రాకపోకలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున రాష్ట్రంలో ఉండబడే ప్రతి ఒక ప్రైవేట్ ఆర్టీసీ బస్సులను నామలపాడు స్టేజి దగ్గర స్టాప్ చేయాలనీ వినతి పత్రం అందజేశారు.ఇల్లందు నియోజకవర్గ ప్రజలు పడుతున్న అవస్థలను తెలుసుకున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వినతి పత్రాన్ని అందుకొని సానుకూలంగా స్పందించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పరిపాలనలో ఏ ఒక్కరు కూడా ఇబ్బందులకు గురి కాకూడదని దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నాం.అలాంటిది ఏజెన్సీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందికి గురి కాకుండా ఎలాంటి జాప్యం లేకుండా త్వరితిగతిన బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,సొసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు - ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ (బిజెఆర్)



యాదాద్రి భువనగిరి / డిసెంబర్ వుదయం ప్రతినిధి : అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. భువనగిరి మున్సిపల్ పట్టణ పరిధిలోని 8వ వార్డు సీతానగర్ లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పాల్గొని అధికారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను పరిశీలించి ఇందిరమ్మ యాప్ లో లబ్దిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డి సహకారంతో మునిసిపల్ పరిధిలోని ప్రతి వార్డులో లబ్ధిదారులకు న్యాయం జరిగేలా ఇందిరమ్మ కమిటీలు వేసినట్లు ఆయన తెలిపారు. సర్వే ఆధారంగా అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తారాని ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముందుకు వచ్చిందని, లబ్దిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆన్లైన్ అప్లోడ్ అధికారి పొందు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉడత రమేష్, సిరుపంగ నాగరాజ్ గోపి మనమ్మ, కూర నాగేందర్, ఎండి కరీం లబ్ధిదారులు పాల్గొనడం జరిగింది.

# వుదయం కథనానికి స్పందన మాడ కార్యాలయం ఏర్పాటుపై చర్యలు.?

జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 19(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ లో మాడా కార్యాలయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అనే కథనం గురువారం వుదయం పత్రికలో ప్రచురించడంతో ఎటునాగారం ఐటిడిఏ పి, ఓ, చిత్ర మిశ్రా, స్పందించినట్లు తెలిసింది బుధవారం మహాదేవపూర్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటించడంతో కొందరు ఎస్ టి ప్రజలతోపాటు రైతులు మాహదేవపూర్ లో మాడా కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఐటిడిఏ ఆధ్వర్యంలో ఉన్న సంక్షేమ ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఉమ్మడి రాష్ట్రంలో స్థానికంగా మాడా కార్యాలయం ఉండడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజన ప్రజల చెంతకు చేరేవని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన విషయం వుదయం పత్రికలో ప్రచురించడంతో స్పందించిన ఎటునగరం ఐటిడిఏ పిఓ చిత్ర మీశ్రా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఉన్న ఐటిడిఏ ఆధ్వర్యంలో ఉన్న భవనాలను మరమ్మతులు చేసి అధికారులు గిరిజన ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యచరణ చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు పిఓ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది సంబంధిత శాఖ అధికారులు నేడు మహాదేవపూర్ లో పర్యటించి మాడా కార్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.?



# అత్యంత వైభవంగా తిరుప్పావడ సేవ



మేళ్లచెరువు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు మేళ్లచెరువు/ హుజూర్నగర్ డిసెంబర్ 19(వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో వేంచేసి ఉన్నటువంటి శ్రీ గోదా భూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానము నందు తిరుప్పావడ సేవను ఘనంగా నిర్వహించడం జరిగింది. ధనుర్మాస మహోత్సవంలో భాగంగా ఈరోజు నాలుగో రోజు సందర్భంగా స్వామివారికి సుప్రభాతం ప్రా తః కాలార్చన తదుపరి తిరుప్పావై పాశుర విన్నపం జరబడింది. ఈ నాలుగో రోజు పాశురంలో వానదేవుడు అయిన పర్జన్యుడు చక్కగా కురవాలని పద్మనాభుడి యొక్క శంకు చక్ర ధనస్సుల వలె మెరుపులతో బాగా కురవాలని,పాడిపంట బాగుండాలని విన్నవించడం జరిగింది. ఈరోజు గురువారం సందర్భంగా తిరుప్పావడ సేవ సారెడ్డి రామలింగారెడ్డి- అప్పమ్మ దంపతులచే జరువబడింది. ఇట్టి కార్యక్రమంలో అర్చకులు నరగిరి నాధుని రంగాచార్యులు,శ్రీ దత్త విష్ణు, నల్లూరి తరుణ్, సుదర్శన్ ప్రసాదాచార్యులు ,మరియు భక్త బృందం పాల్గొన్నారు.

# ఖబడ్దార్ గంగుల కమలాకర్

. అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి పుటొకో పార్టీ మారినట్టు కాదు
. ఈ రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఎవరైనా పోటీ చేసే స్వేచ్ఛ ఉంది..
. విద్యార్థి దశ నుండి మంత్రిదాకా అధికారం ఉన్నా లేకున్నా ఒకే పార్టీలో ఉన్న వ్యక్తి పొన్నం ప్రభాకర్ గౌడ్
. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్



ఎల్కతుర్తి డిసెంబర్ 19(వుదయం ప్రతి నిది) న్యూస్: మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ మాట్లాడుతూ అవినీతిని కప్పిపుచ్చుకోవడం కోసము పూటకో పార్టీ మారే వ్యక్తి గంగుల కమలాకర్ పొన్నం ప్రభాకర్ గౌడ్ ను విమర్శించే అంత స్థాయి కాదని అన్నారు. విద్యార్థి నాయకునిగా మొదలైనటువంటి రాజకీయ ప్రస్తావన ఓ పార్టీని నమ్ముకుని అంచలంచెలుగా ఎదుగుతూ కరీంనగర్ ప్రజల ఆశీర్వాదంతో పార్లమెంట్ సభ్యుడుగా గెలుపొందారు అని తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అధికారం పార్టీలో ఉన్నా కూడా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని సైతం లెక్కచేయకుండా ఆంధ్ర పెత్తందారుల చేతిలో పార్లమెంట్ లో పెప్పర్స్ పే దాడులకు గురై ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ వచ్చుడో చచ్చుడో అనే నినాదంతో పార్లమెంట్లో గళం విప్పి అధిష్టానొప్పించి స్వరాష్ట్ర తెలంగాణ రావడంలో కృషి చేసిన వ్యక్తి పొన్నం ప్రభాకర్ గౌడ్ అని అన్నారు పొన్నం ప్రభాకర్ గౌడ్ హుస్నాబాద్ ప్రజల కోరిక మేరకు హుస్నాబాద్ నియోజకవర్గ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడి 19000 ఓట్ల మెజార్టీతో గెలుపొంది నేడు హుస్నాబాద్ ప్రజలు ఆశీర్వదించి మంత్రి చేశారని రాష్ట్రంలోనే హుస్నాబాద్ సస్యశ్యామలం చేయడం కోసం కంకణం కట్టుకున్నారని గత ప్రభుత్వంలో ఉన్నటువంటి పెండింగ్ పనులను సంవత్సర కాలంలోనే నిధులు మంజూరు చేసిన వ్యక్తి పొన్నం ప్రభాకర్ గౌడ్ అని అన్నారు. బీసీ నాయకుడు మంత్రి పదవిలో ఉండడం బి ఆర్ ఎస్ వెలమ దొరలకు ఇష్టం లేక బీసీ నాయకులతోనే విమర్శలు చేయించడం సరికాదని అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతున్నటువంటి రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లాంటి వ్యక్తిని పట్టుకొని విమర్శించడం సరికాదని ఇంకోసారి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను విమర్శించినట్లయితే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. అక్రమంగా సంపాదించినటువంటి సొమ్మును కాపాడుకోవడం కోసం పూటకో పార్టీ మారి గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని గ్రానైట్ కోరీలలో నచ్చిన విధంగా పర్మిషన్లు తీసుకొని ప్రభుత్వానికి చెల్లించే ఆదాయాన్ని కట్టినట్టువంటి వ్యక్తి కమలాకర్ అని మరోసారి రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను విమర్శించినట్లయితే హుస్నాబాద్ ప్రజలే బుద్ధి చెప్పే రోజులు వస్తాయని పద్ధతి మానుకొని రాష్ట్రానికి ప్రజలు కావలసిన వాటిలో సూచనలు ఇస్తే బాగుంటుందన్నారు

# కేంద్రమంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలి

బీఎస్పీ డిమాండ్.



పరకాల డిసెంబర్ 19 (వుదయం ప్రతినిధి): పరకాల నియోజకవర్గ కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. తదనంతరం దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొనగా అమిత్ చిత్రపటాన్ని దగ్ధం చేయడం జరిగింది.ఈ కార్యక్రమం నియోజకవర్గ అధ్యక్షులు కాకి శరత్ చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి శనిగరపు రాజు హాజరై మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని పార్లమెంటు సాక్షిగా అవమానపరచడం రాజ్యాంగాన్ని అవమానపరచడమే అని భారత దేశ ప్రజలను అవమానపరచడమేనని అన్నారు.ఈ మాటల వెనుక రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని లేకపోతే బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు వెలువెత్తుతాయని అలాగే సుప్రీంకోర్టు అమిత్ షాపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని శనిగరపు రాజు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పసుల వినయ్ అంబేద్కర్, నియోజకవర్గ ఇన్చార్జి కర్రె రమేష్, కార్యదర్శి విష్ణు, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మడికొండ ప్రశాంత్, బిఎస్ యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ ,మచ్చ పవన్ కళ్యాణ్, స్వేరోస్ రాజేంద్రప్రసాద్, దొగ్గెల వినయ్, మచ్చ రాజేష్, పసుల బిక్షపతి ఓనపాకల కుమార్ పెండెల చందు పెండేలా దుర్గ ప్రసాద్ చిలువేరు రాఘవ బీఎస్పీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# ఐటీ టవర్ ద్వారా ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై శిక్షణ

రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ డిప్యూటీ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి భవేశ్ మిశ్రా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి హైదరాబాద్ రహదారిలో ఉన్న ఐ టి టవర్ ను పరిశీలన



నల్గొండ డిసెంబర్ 19(వుదయం ప్రతినిధి): నల్గొండ ఐటీ టవర్ ద్వారా ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ డిప్యూటీ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి హైదరాబాద్ రహదారిలో ఉన్న ఐ టి టవర్ ను సందర్శించారు. నల్గొండ నల్గొండ ఐటీ టవర్ చాలా బాగుందని, ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకుగాను ఉద్యోగులను గుర్తించడంతో పాటు, 20 బ్యాచ్ లు గా విభజించి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ కు సూచించారు. అంతేకాక ఐటి టవర్ లో 500 మంది సాఫ్ట్ వేర్ ఉద్యోగులతో జపాన్ కు చెందిన ఒక కంపెని తన కార్యకలాపాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఐ టి టవర్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలను త్వరితగతిన రూపొందించడమే కాకుండా, కంప్యూటర్ సాఫ్ట్వేర్ పనులు సులభతరం అవుతాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, ఐ టి టవర్ మేనేజర్ నాగరాజు, ఆర్డిఓ అశోక్ రెడ్డి ,స్థానిక తహసిల్దార్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్ తదితరులు ఉన్నారు.

# పేదల పెన్నిధి.. ఒకటో వార్డు కౌన్సిలర్ వేములకొండ పద్మ సైదులు

వందకు పైగా కుటుంబాలకు ఆర్థిక సహాయం
పేదలను ఆపత్కాలంలో ఆదుకుంటున్న కౌన్సిలర్
ప్రజల దాహార్తి కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు
పజా సమస్యలు తీర్చడంలో ముందంజ



సూర్యాపేట, డిసెంబర్ 19(వుదయం ప్రతినిధి ): సూర్యాపేట పట్టణంలో మున్సిపల్ ఒకటో వార్డ్ కౌన్సిలర్ వేములకొండ పద్మ సైదులు గౌడ్ కౌన్సిలర్ గా ఎన్నికైన నాటినుండి నేటి వరకు మాజీ మంత్రివర్యులు దామోదర్ రెడ్డి అండదండలతో ఆదేశానుసారం పేదలకు వెన్నంటి ఉంటూ వస్తున్నారు. 100కు పైగా కుటుంబాలకు ఆపత్కాలంలో ఉన్న పేదలకు ఆర్థిక సాయం చేస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉ ంటున్నారు. పార్టీలో పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉంటూనే మరొకవైపు తన వార్డులో గల సమస్యలను పరిష్కరిస్తూ వార్డులో గల ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఎవరికైనా ఏ అర్ధరాత్రి ఆపద వచ్చిన తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వారికి తోడుగా ఉంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రభుత్వంలో ఉన్న లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేస్తూ ఒకటవ వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. అదేవిధంగా తన సొంత డబ్బులతో వార్డు ప్రజల కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను తీర్చారు దీంతో ప్రజలందరికీ ఉచితంగా తాగు నీటిని పొందేందుకు వీలు కల్పిస్తున్నారు .వార్డు ప్రజలు పూర్తి మద్దతు ఇస్తూ కౌన్సిలర్ను ప్రోత్సహిస్తున్నారు. ప్రజలు ఇదేవిధంగా ప్రోత్సహిస్తే మునుముందు వార్డులో అభివృద్ధిని కొనసాగిస్తారు.

## బతుకమ్మ ఆడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ఆందోల్, డిసెంబర్19(వుదయం ప్రతినిధి): ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలను కోరుతూ సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు బతకమ్మ ఆడుతూ గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కరించే వరకు వివిధ రూపాల్లో నిలిచిన తెలుపుతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## వంటావార్పుతో ఉద్యోగుల నిరసన

నారాయణఖేడ్, డిసెంబర్19(వుదయం ప్రతినిధి): సమగ్ర శిక్ష ఉద్యోగులు నారాయణపేట మున్సిపల్ పార్క్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరుకున్నాయి. గురువారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. శిబిరం వద్ద రోడ్డుపై బైఠాయించి భోజనాలు చేశారు. సమ్మెలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు.

# నలుగురు పిల్లలు బుల్లెట్ గాయాలతో ఆస్పత్రుల్లో పోరాడుతున్నారు...

పినపాక నియోజకవర్గం డిసెంబర్19(వుదయం ప్రతినిధి): ఈ నెల 12వ తేదీన చత్తీస్ గడ్ రాష్ట్రం మాడ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో ఏడుగురు మావోయిస్టులు మరణించినట్టు నారాయణ్ పూర్ పోలీసులు ప్రకటించారు. వాళ్ళ వద్ద పలు ఆయుధాలు దొరికాయని కూడా పోలీసులు చెప్పారు. మరణించిన వాళ్ళపై ఆలీవ్ గ్రీన్ డ్రస్సులు కూడా ఉన్నాయి.డిసెంబర్ 11వ తేదీ ఉదయం 8.30 గంటలకు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లోని దక్షిణ మాడ్ లో తన ఇంటికి సమీపంలోని అడవికి ఆనుకుని ఉన్న పొలాల వద్ద పశువులను మేపుకుంటూ 14 ఏళ్ల చైత్రం ఓయం తన తల్లిదండ్రులతో కలిసి ఉన్నాడు.నేను కొంచెం నీరు తీసుకురావడానికి నదికి వెళ్ళాను. నేను నా కంటైనర్‌ను నింపుతున్నప్పుడు, నేను అకస్మాత్తుగా భద్రతా దళాలను చూశాను, ”అని పిల్లవాడు చైత్రం ఓయం న్యూస్‌లాండ్రీకి ఫోన్‌లో చెప్పాడు. అకస్మాత్తుగా, వారు నాపై కాల్పులు ప్రారంభించారు.” అని తెలిపాడు.భయపడిన చైత్రం అడవిలోపలికి పారిపోయాడు. అతని మేనమామ, మరో బంధువు కూడా పరిగెత్తుకొచ్చి అతనితో చేరారు. వారు దట్టమైన పొదల్లో దాక్కున్నారు. చైత్రం నొప్పితో ఉన్నాడుబీ ఆ పిల్లవానికి బుల్లెట్ తగిలిందని గ్రహించాడు కానీ అతను అడవిని విడిచిపెట్టి బైటికి వెళ్ళడానికి ధైర్యం చేయలేదు.రెండు రోజుల తర్వాత చైత్రం తండ్రి మసల్ ఓయామ్ కాల్చి చంపబడ్డాడని వారికి తెలిసింది.ఆ రోజు ఉదయం జిల్లా రిజర్వ్ గార్డ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు చంపేసిన గ్రామస్తులలో మసల్ ఒకరు. చనిపోయినవారంతా “నక్సల్స్” అని భద్రతా దళాలు పత్రికా ప్రకటన విడుదల చేశాయి. కానీ గ్రామస్తులు మాత్రం దాన్ని కొట్టిపడేశారు. చైత్రంతో సహా నలుగురు పిల్లలపై కూడా దళాలు కాల్పులు జరిపాయి. వారిలో పలువురు ప్రస్తుతం దంతేవాడ, రాయ్‌పూర్‌లోని ఆసుపత్రిలో గాయాలతో చికిత్స పొందుతున్నారు.వారు పిల్లలపై కాల్పులు జరిపారని పోలీసులు ఖండించలేదు.నేను నా తల్లిదండ్రులతో వ్యవసాయం చేస్తున్నాను,” అని ఎనిమిదేళ్ల సోను ఓయం చెప్పారు. “అకస్మాత్తుగా, కాల్పులు ప్రారంభమయ్యాయి. నా తలకి ఏదో తగిలింది. నేను మేల్కొన్నప్పుడు, నేను నేలమీద పడి ఉన్నాను.ఆ రోజు ఉదయం తన కొడుకు తలపై బుల్లెట్ తగిలిందని సోనూ తల్లి పెండో న్యూస్‌లాండ్రీకి చెప్పారు. “నా భర్త, కొడుకు, నేను పొలాల్లో వ్యవసాయం చేసేందుకు వెళ్లాం. కాల్పులు ప్రారంభమైనప్పుడు నేను నీటిని తీసుకరావడానికి వెళ్ళాను, ”అని ఆమె చెప్పింది. “కాల్పుల శబ్దం విని నేను పరుగు ప్రారంభించాను. నా భర్త కూడా పరిగెత్తాడు కానీ నా కొడుకు పరిగెట్టలేకపోయాడు. అతన్ని పోలీసులు కాల్చారు.పోలీసు అధికారులు ప్రకటించిన దాని ప్రకారం, భద్రతా బలగాలు నారాయణపూర్, దంతేవాడ, కొండగావ్‌లలో జిల్లా రిజర్వ్ గార్డ్ సభ్యులు, సీఫ్స్ , పోలీసు స్పెషల్ టాస్క్ ఫోర్స్ సభ్యులతో కూడిన బృందాలు. వారు డిసెంబర్ 10 నుండి 12 వరకు ఆపరేషన్” నిర్వహించారు, దీని ఫలితంగా ఏడుగురు ‘‘నక్సలైట్లు’’ మరణించారు.మృతులను రామచంద్ర అలియాస్ దస్రు, కోసి అలియాస్







రమిలా మద్కం, రైను పోయాం, సోమరి ఓయం, గూడ కుచ్చ, కమలేష్ అలియాస్ కోహ్లా, సోమారు అలియాస్ మోతుగా పోలీసులు గుర్తించారు. రామచంద్ర కార్తీక్ , మోహన్ రావు అనే పేర్లతో కూడా పిలుస్తారు.అయితే గ్రామస్తులు న్యూస్‌లాండ్రీకి భిన్నమైన కథనం చెప్పారు. పత్రికా ప్రకటనలో కొన్ని పేర్లు తప్పుగా రాయబడ్డాయి గూడ కుచ్చ అని వారు చూపిస్తున్న ఫోటో గుడ్సా ఓయం అనే గ్రామస్థుడిది, కమలేష్ అలియాస్ కోహ్లా అని వాళ్ళు చెప్తున్నది కోహ్లాల్ ఓయం. సోమరు అని పోలీసులు ప్రకటించింది. మోతు ఓయం అని వారు చెప్పారు. ఐదవ పేరు, రేణు పోయామ్. పత్రికా ప్రకటనలో పేర్కొన్న వారిలో కోసి, రామచంద్ర మాత్రమే నక్సల్స్ అని మిగతా ఐదుగురు గ్రామస్తులే అని స్థానికులు చెప్తున్నారు.వారు సాధారణ గ్రామస్థులు కాదు. వారు మావోయిస్టు పార్టీకి చెందినవారు” అని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పి సుందర్‌రాజ్ తెలిపారు. వారు సమీప ప్రాంతాల నివాసితులు కావచ్చు, వారు నక్సల్ కార్యకలాపాలలో పాల్గొనలేదని దీని అర్థం కాదు.అన్నారాయన.పిల్లలను కాల్చడం గురించి అడిగినప్పుడు, సుందర్‌రాజ్ ఇలా అన్నాడు: “గాయపడిన పిల్లలను పోర్టర్‌లుగా లేదా మానవ కవచాలుగా ఉపయోగించవచ్చని మా ప్రాథమిక దర్యాప్తు సూచిస్తుంది. మేము ఇప్పటివరకు కనుగొన్న దాని ఆధారంగా, కాల్పుల సమయంలో నక్సల్స్ వారిని షీల్డ్‌లుగా ఉపయోగించుకున్నారు, ఎదురుకాల్పుల్లో వారు గాయపడి ఉండవచ్చునని తెలుస్తోంది. మేము ఈ విషయంలో దర్యాప్తును కొనసాగిస్తున్నాము. అన్నాడు.న్యూస్‌లాండ్రీ ఆ రోజు జరిగిన దాని గురించి గ్రామస్థులతో మాట్లాడింది.హత్యకు గురైన తన భర్త గుడ్సా ఓయం, తాను డిసెంబర్ 11న పొలంలో వరి కోస్తున్నట్లు ఆయన భార్య సుక్లి ఓయం న్యూస్‌లాండ్రీకి తెలిపారు.పరుగున వస్తున్న గ్రామస్తుల కేకలు నేను విన్నాను. తుపాకీ కాల్పుల శబ్దం వినగానే మేం కూడా పరిగెత్తడం మొదలుపెట్టాంఅని ఆమె చెప్పారు. “పోలీసులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. విచ్చలవిడిగా కాల్పులు జరుపుతున్నారు. నేను ఎలాగోలా తప్పించుకున్నాను కానీ నా భర్త తప్పించుకోలేకపోయాడు పోలీసులు ఆయనను చంపేశారు.సుక్లీ కుమారుడు నెవార్ ఓయామ్, 14 ఏళ్ల వయస్సు, ఇప్పుడు అతను కూడా కనిపించడం లేదు.. “నాకొడుకు తన ప్రాణాలను కాపాడుకోవడానికి తన తండ్రితో పరుగెత్తాడు, కానీ ఇప్పుడు అతను ఎక్కడా కనిపించడం లేదు.అని ఆమె చెప్పింది. అతను కూడా హత్య చేయబడి ఉండవచ్చని గ్రామస్థులు చెబుతున్నారు.మరో కొడుకు, కూతురు ఉన్న సుక్లీ ఆ రోజు జరిగిన సంఘటన నుంచి మెల్లెగా తేరుకొని ఏం జరిగిందో చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. మా కుటుంబం సంతోషంగా జీవిస్తోంది. నేనూ, నా భర్త వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం అని చెప్పింది. “అతను ఏ నక్సల్ గ్రూపులోనూ భాగం కాదు. పోలీసులు అతనిని, ఇతర గ్రామస్తులను ఎటువంటి కారణం లేకుండా చంపారు.పోలీసుల కాల్పుల్లో భర్తను కోల్పోయిన మసల్ అనే వ్యక్తి భార్య షడ్లు ఓయామ్ న్యూస్‌లాండ్రీతో ఇలా అన్నారు: “మేము ఆ ఉదయం ఇతర గ్రామస్థులతో కలిసి పొలాల్లో పని చేస్తున్నప్పుడు కాల్పులు జరపడం విన్నాము. అందరూ భయాందోళనలకు గురయ్యారు. అన్ని వైపులకు పారిపోవటం ప్రారంభించాము.”పోలీసులు గ్రామస్థులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం నేను చూశాను. అని షడ్లు ఆరోపించారు.నా భర్త శరీరంలోకి రెండు బుల్లెట్లు దూసుకపోయాయి. అప్పటికి అతను చనిపోలేదు, గాయపడ్డాడు. పోలీసులు అతన్ని తీసుకెళ్లారు, అని ఆమె ఆరోపించింది, భద్రతా దళాలు పత్రికా ప్రకటన విడుదల చేసినప్పుడే అతను చనిపోయాడని తనకు తెలిసింది. నా భర్త నక్సల్ కాదు. అతను సాధారణ రైతు మాత్రమే. అని ఆమె చెప్పింది.బుల్లెట్ గాయం అయిన 15 ఏళ్ళ బాలిక రామ్లీ పోయం న్యూస్‌లాండ్రీతో మాట్లాడుతూ, పోలీసులు వచ్చినప్పుడు, ఆ ఉదయం తన తల్లిదండ్రులతో కలిసి పొలం నుండి నల్లరేగడిని పండిస్తూ తాను అదే స్థలంలో ఉన్నానని చెప్పింది.పోలీసులు కాల్పులు ప్రారంభించారు. అందరూ అటూ ఇటూ పరుగులు తీశారు,అని ఆమె ఫోన్‌లో న్యూస్ లాండ్రీ ప్రతినిధితో చెప్పింది. “నేను భూమిలో పని చేస్తున్నాను. ఇంతలో వెనుక నుంచి మెడకు ఏదో తగిలి కింద పడ్డాను. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు.రామ్లీని భైరామ్‌గఢ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆమెను మొదట దంతెవాడలోని మెడికల్ ఆసుపత్రికి, తర్వాత జగదల్‌పూర్ ఆసుపత్రికి, ఆ తర్వాత రాయ్‌పూర్‌లోని మెకహరా ఆసుపత్రికి, ఆపై చివరకు రాయ్‌పూర్‌లోని డికెఎస్ ఆసుపత్రికి తరలించారు.నకారి అనే గ్రామస్థుడు న్యూస్‌లాండ్రీతో మాట్లాడుతూ ఉదయం 4 గంటలకుకాల్పులు జరిగినట్లు విన్నాను. కానీ ఉదయం 8 గంటల తర్వాత, చాలా మంది గ్రామస్థులు వ్యవసాయం చేస్తున్నప్పుడు, పోలీసులు పొజిషన్ తీసుకొని మాపై కాల్పులు ప్రారంభించారు” అని నకారి చెప్పాడు.చైత్రమ్‌కి బుల్లెట్ తగలడం నేను చూశాను. అతని తండ్రి శరీరంలోకి రెండు బుల్లెట్లు దూసుకపోయాయి. అప్పుడు అందరూ తమ ప్రాణాలను కాపాడుకోవడానికి పరిగెత్తడం ప్రారంభించారు.17 ఏళ్ల రాజు బండ న్యూస్‌లాండ్రీతో మాట్లాడుతూ తాను డిసెంబరు 11న నారాయణపూర్‌లోని ముదుంవాడ గ్రామానికి వెళ్ళి తన సోదరి కుటుంబానికి వ్యవసాయపనుల్లో సహాయం చేశాను. ఆ సమయంలోనే భద్రతా దళాలు కాల్పులు జరిపాయి.అని చెప్పాడు. రాజు కాలికి బుల్లెట్ తగలడంతో భైరం గఢ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కార్యకర్త సోనీ సోరి న్యూస్‌లాండ్రీతో మాట్లాడుతూ డిసెంబరు 13 రాత్రి తనకు గ్రామస్తుల నుండి ఫోన్ కాల్స్ వచ్చాయి, కొంతమంది గ్రామస్తులు చనిపోయారని, పిల్లలు గాయపడ్డారని చెప్పారు.నేను ఇంద్రావతి నదిని దాటి బైరామ్‌ఘర్ సమీపంలోని తాడోపోట్ గ్రామానికి వెళ్లాను. పిల్లలను నది ఒడ్డుకు తీసుకురావాలని గ్రామస్తులను కోరుతూ నేను నాలుగు గంటలు అక్కడ వేచి ఉన్నాను, అని ఆమె టెలిఫోనిక్ ఇంటర్వ్యూలో చెప్పారు. ముగ్గురు పిల్లలను చార్‌పాయ్‌లపై నది దగ్గరికి తీసుకువెళ్లారు. మేము పడవలో నదిని దాటాము.అని చెప్పారు.ఆ సాయంత్రం తర్వాత, సోని సోరి ముగ్గురు పిల్లలను %-% సోను, చైత్రమ్, రామ్లీలను బైరామ్‌ఘర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్చడానికి సహాయం చేసింది.వారికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఆ రాత్రి ప్రాథమిక చికిత్స అనంతరం వారిని దంతెవాడకు రిఫర్ చేశారు” అని తెలిపారు. “సోను, చైత్రం తదుపరి సంరక్షణ కోసం దంతేవాడలో ఉంచగా, రామ్లీని జగదల్‌పూర్‌కు బదిలీ చేసి, ఆపై అధునాతన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు రెఫర్ చేశారు.”డిసెంబరు 11 సంఘటనపై, కార్యకర్త సోని సోరీ న్యూస్‌లాండ్రీతో మాట్లాడుతూ ఇది “భద్రతా బలగాలు, నక్సల్స్ మధ్య జరిగిన ఎన్‌కౌంటర్ కాదుబీ ఇది భద్రతా బలగాలు అమాయక గ్రామస్తులను ప్రత్యక్షంగా హత్య చేయడం.సామాన్యంగా వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన గ్రామస్తులను చుట్టుముట్టి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. వారిని ప్రత్యేకంగా టార్గెట్ చేసి చంపారు” అని ఆమె ఆరోపించారు. “నక్సల్స్ అని పోలీసులు చెప్తున్న ఐదుగురు వ్యక్తులకు నక్సలిజంతో ఎలాంటి సంబంధం లేదు, వారు సాధారణ గ్రామస్థులు. దీనికి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. అంతేకాదు ప్రాణాలతో బయటపడిన వారు ఈ సత్యానికి సాక్షులు.

ఆమె ఇంకా ఇలా అన్నారు: “వారు పిల్లలను కూడా విడిచిపెట్టడం లేదు. దేనిలోనూ ప్రమేయం లేని చిన్న పిల్లలపై ఎందుకు కాల్పులు జరుపుతున్నారు? తమ చర్యలను సమర్థించుకోవడం కోసమే ఎనిమిది, 15 ఏళ్ల చిన్నారులను చంపి నక్సల్స్‌గా ముద్రవేసేందుకు ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించిన సోనీ సోరీ ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. న్యాయ విచారణ జరగాలి, అమాయక గ్రామస్తులను చంపినందుకు బాధ్యులైన పోలీసు సిబ్బందిని చట్ట ప్రకారం శిక్షించాలి అని ఆమె డిమాండ్ చేశారు.

## బాసరలో 3 రోజుల పాటు పురాతన శ్రీ పాప హరేశ్వర స్వామి ధ్వజ, శిఖర ప్రతిష్టాపన మహోత్సవాలు



బాసర డిసెంబర్ 19 ( వుదయం ప్రతినిధి) బాసరలో 21 డిసెంబర్ శనివారం నుండి 23 డిసెంబర్ సోమవారం వరకు 3 రోజుల పాటు అంగరంగ వైభవంగా పురాతన శ్రీ పాప హరేశ్వర స్వామి ఆలయమున గణపతి, సంతాన నాగేంద్రుడు, అన్నపూర్ణ మాత, నందిశ్వరుడు, కాళభైరవుడు, వీర భద్రుడు, బలిపీఠలు, నవగ్రహ మరియు ధ్వజ శిఖర ప్రతిష్టాపన మహోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో మొదటి రోజు ప్రతిష్టాపన కార్యక్రమం గంగా సేకరణ, ఉదయం 11 గంటలకు విగ్రహ ఊరేగింపు నిర్వహించబడును. రెండవ రోజు పంచాచార్య పూజ, స్థాపిత దేవతల మండపారదన, మంత్ర పుష్పం, వేదోపచారములు తీర్థ ప్రసాద వితరణ మూడవ రోజు ప్రాతః కాల పూజలు, ఉదయం 8: 25 ని” లకు ఉత్తర ఫల్గుణ నక్షత్రయుక్త, కుంభ లగ్నములో యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రణ ప్రతిష్ట,నందికొలు సేవ, అగ్ని ప్రవేశం , స్వస్తి కార్యక్రమాలు కలవు మరియు 23 డిసెంబర్ సోమవారం మధ్యాహ్నం 1 నుండి మహా అన్న ప్రసాద కార్యక్రమం దాత మేకల చిన్న రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించబడును. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అర్చక బృందం, విశేష గౌరవ అతిధులు ముధోల్ ఎంఎల్‌ఏ రామారావు పటేల్ గారు, గడ్డి గారి విట్టల్ రెడ్డి, భోస్లె నారాయణ రావు పటేల్ గారు పాల్గొంటారు.

## గుంతల మయంగా బాసర నుండి కిర్గుల్ - బి వెళ్ళే రహదారి చోద్యం చూస్తున్న అధికారులు



బాసర డిసెంబర్ 19 ( వుదయం ప్రతినిధి) బాసర మండలం లోని కీర్గుల్ - బి మరియు బాసర రహదారి మధ్యలో భారీ గుంత పడటం జరిగింది దీనివల్ల ఇక్కడ నిరంతరం రాకపోకలకు ద్విచక్ర వాహన దారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో చాలా ఆక్సిడెంట్ లు జరిగే ప్రమాదం ఉంది కావున దీనిపై అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చగలరని బాసర మరియు కుర్గుల్ - బి గ్రామస్తులు కోరుతున్నారు.

## సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ సమీక్ష

జనగామ, డిసెంబర్19(వుదయం ప్రతినిధి): కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర సఫారీ కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేసన్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ఆయా సంఘాల నాయకులు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవరావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్ పాల్గొన్నారు

## సంగారెడ్డిలో బీసీ, దళిత సంఘాల రాస్తారోకో

సంగారెడ్డి, డిసెంబర్19(వుదయం ప్రతినిధి): : కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంటులో అంబేద్కర్ పై చేసిన వ్యక్తులకు నిరసనగా సంగారెడ్డిలో దళిత, బీసీ సంఘాల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ ముందు గురువారం రాస్తారోకో నిర్వహించారు. అంబేద్కర్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. అమిత్ షా క్షమాపణ చెప్పే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని దళిత సంఘాల నాయకులు తెలిపారు.

## సుస్థిరాభివృద్ధిపై సర్పంచులు,సెక్రటరీలకు ముగిసిన శిక్షణా తరగతులు.



తిరుపతిజిల్లా, చంద్రగిరి, యర్రావారిపాలెం, డిసెంబరు19 (వుదయం ప్రతినిధి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎల్ ఎస్ డి జి) పై సర్పంచ్ లకు,పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల పాటు జరిగిన శిక్షణా తరగతులు ముగిశాయి.ఈ సందర్భంగా ఎంపీడీఓ అరుణ మాట్లాడుతూ పంచాయతీలలో రోడ్లు,వాటర్ సప్లై,ప్రజారోగ్యం, గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై అధికారుల సమన్వయం సమిష్టి కృషి ఎంతో అవసరమని ఉత్తమ పంచాయతీల గా తీర్చిదిద్దాలని కోరారు.

## అంబేద్కర్ పై చేసిన అవమాన వ్యాఖ్యలపై నిరసన.



ధర్మసాగర్ డిసెంబర్19(వుదయం ప్రతినిధి): ఈరోజు అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో హనుమకొండ జిల్లా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పార్లమెంట్లో హోమ్ మినిస్టర్ అమిత్ షా బోధిసత్వ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత .భారతరత్న పై చేసిన అవమాన వాక్యాలపై నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ యం ఎల్లయ్య హనుమకొండ జిల్లా, అధ్యక్షులు చిట్యాల బాబు వరంగల్ జిల్లా అధ్యక్షులు మాంకాల యాదగిరి, హసన్పర్తి మండలం కన్వీనర్ రేణిగుంట దుర్గాప్రసాద్, చారి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు హోంమంత్రి అమీషా అంబేద్కర్ ని అవమానపరిచే మాటలు మాట్లాడడం రాజ్యాంగానికి విరుద్ధమైనటువంటి మాటలు మాట్లాడమనేది తప్పుగా భావిస్తున్నాము. వారు హిందువైనా మాత్రం హిందూ దేవతలను వారు ఎన్ని మాట్లాడుకున్నా మాకు సంబంధం లేదు కానీ అంబేద్కర్ పేరు తీస్తూ అవమానపరచడమైనటువంటిది క్షమించరాని విషయంగా తెలంగాణ రాష్ట్రం యొక్క యువజన సంఘం ముక్తకండంతో ఖండిస్తుంది. ఇలాంటి వాక్యాలు చేయడం అనేటువంటిది మరో మారు జరిగినట్లయితే వారి పదవికి రాజీనామా చేయాలని అవసరం ఎంతైనా ఉంది రాజీనామా చేసే అంతవరకు ప్రజా పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని హెచ్చరిస్తున్నాం నీవు నచ్చే దేవుడు ఏడు తరాలకు వచ్చే పుణ్యాన్ని నువ్వే పొందు అభ్యంతరం లేదు కానీ అంబేద్కర్ పేరు తీయడం అనేది క్షమించరాని తప్పుగా మేము భావిస్తున్నాం. ఇలాంటివి మరొకసారి పునరావృతం కావద్దని ముక్తకంఠంతో హెచ్చరిస్తున్నాం వాస్తవానికి మనువాద సిద్ధాంతాలతో బతుకుతున్న ప్రతి ఒక్కరు బాబా సాహెబ్ అంబేద్కర్ ని అవమానపరచడంలో ముందంజలో ఉంటున్నారు అలాంటి మనువాదులు ఈ దేశంలో ప్రతి ఒక్కరిని మనువాదులే అనుకోవడం దేశద్రోహం చేసే వ్యక్తుల వాక్యాలు గా మేము భావిస్తున్నాం. ఇలాంటి వాక్యాలు పార్లమెంట్లో మాట్లాడడం వారి అజ్ఞానానికి ఆనవాలుగా మేము ఖండిస్తున్నాము.

## యుటిఎఫ్ మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



చిట్యాల డిసెంబర్ 19(వుదయం ప్రతినిధి)బీ నల్గొండ లక్ష్మీ గార్డెన్స్ లో ఈనెల 28 నుండి 30 వరకు నిర్వహించే యుటిఎఫ్ రాష్ట్ర ఆరవ మహాసభల గోడపత్రికలను చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో టీఎస్ యుటిఎఫ్ చిట్యాల మండల శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది.అనంతరము మాట్లాడుతూ ఈ సమావేశానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి పలువురు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు ప్రతి ఉపాధ్యాయుడు ఈ సమావేశాల్లో పాల్గొనాలి కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండల శాఖ అధ్యక్షులు ఏశమల్ల నాగయ్య, బొప్పని యాదయ్య, గడిగోజు సతీష్,రంగా రామలింగయ్య,జానకి,తోట చంద్రశేఖర్,గోగికారి మాధవి, నకిరేకంటి శ్రీధర్,ఎండి సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రైతు చట్టాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలి: రైతు సంఘం నాయకులు



చిట్యాల డిసెంబర్ 19(వుదయం ప్రతినిధి)బీ కేంద్ర ప్రభుత్వం నల్ల రైతు చట్టాలను తిరిగి తీసుకు రావాలనే యోచనను విరమించుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ డిమాండ్ చేశారు.చిట్యాల మండల కేంద్రంలో గురువారం నాడు సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ నల్ల జెండాలు, బ్యానర్ లతో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిపిన ఆందోళన, పోరాటాల ఫలితంగా కొత్తగా తెచ్చిన రైతు చట్టాలను రద్దు చేస్తాం అని ప్రధాని మోడీ అధికారిక ప్రకటన చేసినా, మళ్లీ తీసుకురావాలని ప్రయత్నాలు ముమ్మరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు లడే రాములు, సిపిఎం మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, ఐతరాజు యాదయ్య, కోనేటి రాములు,జిట్ట స్వామి, రైతు సంఘం మండల నాయకులు రూపని ఇద్దయ్య, శిరసు హన్మయ్య,రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నాలుగు రోజులు బ్యాంకు సేవలు బంద్




బెల్లంపల్లి, డిసెంబరు19 (వుదయం ప్రతినిధి) కేంద్రం తెచ్చిన ఒకే రాష్ట్రం, ఒకే గ్రామీణ బ్యాంక్ నినాదం ప్రకారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుకు చెందిన తెలంగాణ బ్రాంచ్‌లు విలీనం కానున్నాయి. ఈ మేరకు గత నెల(నవంబర్)లోనే ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దీంతో పలు బ్యాంకులు రాష్ట్రంలోని పెద్ద బ్యాంకుల్లో విలీనం కానున్నాయి. తెలంగాణలో ప్రజెంట్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలందిస్తున్నాయి. కాగా.. ఈ రెండు బ్యాంకులు కలిసిపోనున్నాయి. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ కలవనుంది. ఈ ప్రక్రియ జనవరి 1, 2025 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈ క్రమంలో డిసెంబర్ 28 నుంచి డిసెంబర్ 31 వరకు తమ శాఖపరమైన, ఆన్‌లైన్ సేవలు మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏఈపీఎస్, సీఎస్‌పీ) అందుబాటులో ఉండవని టిజిబి తెలిపింది. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీ లోపు ఆర్థిక లావాదేవీలు పూర్తి చేసుకోవాలని కోరింది.

# "డబ్బు ముఖ్యం కాదు ప్రజల ప్రాణాలు ముఖ్యం"..డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్

సూర్యాపేట జిల్లా/ఆత్మకూర్ , డిసెంబర్ 19, (వుదయం ప్రతినిధి): "డబ్బు ముఖ్యం కాదు ప్రజల ప్రాణాలు ముఖ్యమని" పవన్ సాయి హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని శాలిగౌరారం మండలం, తుడిమిడి గ్రామానికి చెందిన పవన్ సాయి హాస్పిటల్ అధినేత, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ హైదరాబాదులోని ఎల్బీనగర్ లోని "పవన్ సాయి హాస్పిటల్ "లో తక్కువ ఖర్చుతో ప్లాస్టిక్ సర్జరీ చేసి మరొక మారు తన మానవత్వాన్ని చాటుకున్నారు. డబ్బు ముఖ్యం కాదు మానవ ప్రాణాలు ముఖ్యమని, సమాజంలో ఏదీ శాశ్వతం కాదని, మానవ సేవ మాత్రమే శాశ్వతమనే సిద్ధాంతంతో తక్కువ ఖర్చుతో పేద ప్రజలకు వైద్యం చేస్తున్నారు. దీనిలో భాగంగా గత మూడు నెలల క్రితం జరిగిన యాక్సిడెంట్ లో సూర్యాపేట జిల్లా, ఆత్మకూరు మండలం, ఏపూర్ గ్రామానికి చెందిన రావుల నరేష్ కు కాలు విరిగి వివిధ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్నారు.అయినను నయం కాకపోవడం,సరైన వైద్యం అందక కాలు ఇన్ఫెక్షన్ సోకి మురిగిపోవడం జరిగినది.అట్లాంటి క్లిష్ట పరిస్థితుల్లో పవన్ సాయి



హాస్పిటల్ లో మెరుగైన వైద్యం కోసం ఆశ్రయించారు.వారికిఅతితక్కువ ఖర్చుతో ప్లాస్టిక్ సర్జరీ చేసి మానవత్వం చాటుకున్నాడు డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్.అతి తక్కువ ఖర్చుతో వైద్యం చేయడం పట్ల రావుల నరేష్ కుటుంబ సభ్యులు డాక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు.

# సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ చేయాలి.

## ఎమ్మార్పీఎస్ టీఎస్ భూపాలపల్లి జిల్లా బృందం.



భూపాలపల్లి డిసెంబర్19(వుదయం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ డా.. జస్టిస్ షమీము అక్తర్ ని కలిసిన ఎమ్మార్పీఎస్ టీఎస్ భూపాలపల్లి జిల్లా బృందం . ఎస్సీ వర్గీకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏక సభ్య కమిషన్ తేదీ 19/12/2024 వ రోజున విచారణ కమిషన్ గౌ.. డా.. జస్టిస్ షమీమ్ అక్తర్ షెడ్యూల్డ్ కులాలకు వర్గీకరణ పై వివరణత్మక అధ్యయనం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి విచారణకు హనుమకొండ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మార్పీఎస్ టీఎస్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సలహాలు సూచనలతో కూడిన వివరణాత్మక వినతి పత్రాన్ని అందించడం జరిగింది.. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ టీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ సంబంధించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఇప్పటికే మూడు దశాబ్దాల సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం తర్వాత కూడ ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం వల్ల విద్య ఉద్యోగ వ్యాపార రంగాల్లో మాదిగలు తీవ్రంగా నష్టపోయారని ఇకపైన కూడా తాత్సర్యం చేస్తే అనేక రకాలుగా నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు... త్వరితగతిన ఈ అధ్యయనాలను పరిశీలించి వెంటనే ఎస్సీ వర్గీకరణ నియామకాన్ని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్ మరియు తదితరులు పాల్గొన్నారు..

# శుక్రవారం నాడు విద్యుత్ అంతరాయం

నకిరేకల్ డిసెంబర్ 19( వుదయం ప్రతినిధి): నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని ఆర్లగడ్డ గూడెం , మర్రురు మరియు చందుపట్ల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు 33 కెవి తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించుటకు లైన్ ఏ బి స్విచ్ల రిపేర్ కొరకు శుక్రవారం నాడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ అధికారి సాయి గణేష్ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించగలరని మనవి చేశారు

# కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను మంత్రి పదవి నుండి తీసివేయాలి




కాసిపేట డిసెంబర్ 19 (వుదయం విలేకరి) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నీ పార్లమెంటు సాక్షిగా అవమానపరిచినట్లు మాట్లాడిన. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను వెంటనే మంత్రి పదవి నుండి తీసివేయాలి. భారత దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన అంబేద్కర్ యువజన సంఘం కాసిపేట మండల నాయకులు ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల సమర్పించిన నాయకులు అనంతరం అమిత్ షా చేసిన వాక్యాల పై మండిపడ్డారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం కాసిపేట మండల నాయకులు. దాగం మల్లేష్, లంక లక్ష్మణ్, అగ్నిసత్తి, అక్క పెల్లి బుగ్గరాజు, రత్నం రాజన్న, గోదారుల రాయలింగు, బండారి సత్తయ్య, సుధాకర్, సుమన్, దుర్గం భూమయ్య, తదితరులు పాల్గొన్నారు

# మెడికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 19( వుదయం ):జగిత్యాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏ.ఆర్.టి సెంటర్ ఈ క్రింది కాంట్రాక్టు ఉద్యోగ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ గురువారం నాడు తెలిపారు. అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ క్రింది ప్రకటనలో సూపరెండేంట్ వివరించారు.



# కాంట్రాక్ట్ ఏ.ఎన్.ఎం లందరిని యధావిధిగా రెగ్యులర్ చేయాలి.!

- డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు 48 గంటల నిరసన
- వంటావార్పు చేసి కార్యాలయం ముందే నిద్రపోయిన ఏఎన్ఎంలు
- పరీక్ష లేకుండా రెగ్యులర్ గా నియమించాలి



హనుమకొండ, డిసెంబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి) : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు,ఈ.సీ.ఎ ఎన్. ఎంలు, ఆర్బన్ హెల్త్ సెంటర్స్ ఏ.ఎన్.ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్.ఆర్డి ఏఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఏ.ఎన్.ఎంలను రాత పరీక్ష లేకుండ యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు వరంగల్ లోని డి ఎం హెచ్ ఓ కార్యాలయాల ముందు 48 గంటల నిరసన కార్యక్రమంలో భాగంగా వంట వార్పు చేసి కార్యాలయం ముందు నిద్రపోవడం జరుగుతుంది,అందులో భాగంగా హనుమకొండ,వరంగల్ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినట్లు వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నేత, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ తెలిపారు.గురువారం రోజున తెలంగాణ వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు వరంగల్ లోని డి ఎం హెచ్ ఓ కార్యాలయం ముందు జరిగిన 48 గంటల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న యాద నాయక్, జె సుధాకర్ మాట్లాడుతూ... వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏ.ఎన్.ఎంలు 24 సంవత్సరాల నుండి రెగ్యులర్ కాకపోవడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు,గత 24 సంవత్సరాలుగా సమస్యల పరిష్కారానికి వివిధ రూపాల్లో ఆందోళన పోరాటాలు,నిరవధిక సమ్మెలు చేసిన ప్రభుత్వం నేటికీ రెగ్యులర్ చేయకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు,గతంలో సమ్మె సందర్భంగా ఏఎన్ఎంల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం తేది:02-09-2023న ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని,ఈ కమిటీ ఏఎన్ఎంలతో చర్చించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని ఉన్న ఆ కమిటీ రిపోర్ట్ లేకుండ రాత పరీక్ష తేదీ ప్రకటించడం వెనుకాల ఉన్న అంతర్యామేమిటని అన్నారు,రాత పరీక్షను వాయిదా వేయాలని రాష్ట్రవ్యాప్తంగాకాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 6,500 మంది ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తున్నారని అందులో భాగంగానే ఈరోజు రాష్ట్రంలోని 33 జిల్లాల ముందు 48 గంటల నిరసన కార్యక్రమాలు జయప్రదంగా జరుగుతున్నట్లు యాద నాయక్ తెలిపారు,ప్రభుత్వం బేషజాలకు పోకుండా వెంటనే రాత పరీక్షను వాయిదా వేయాలని లేనియెడల నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ నాయకులు జె సుధాకర్, శ్రీనివాస్, సుజాత,సరోజ చంద్రకళ,ప్రభావతి, సాంబలక్ష్మి,మంజుల,పుష్పలత,విజయ కవిత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సి ఎస్ ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు






లక్షెట్టిపేట డిసెంబర్ 19:- (వుదయం ప్రతినిధి ) పట్టణంలోని సిఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ ఈవ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరము క్రిస్మస్ సంబరాలలో భాగంగా సీఎస్ఐ పాఠశాలల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్. డేవిడ్ పాల్ మాట్లాడుతూ.... సిఎస్ఐ విద్య సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు చాలా చక్కగా ఉన్నాయని, ఏసుక్రీస్తు మానవాళికి అందించిన ప్రేమ, శాంతి, మరియు క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. అందరూ క్రిస్మస్ పండుగను శాంతియుతంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన నృత్యాలు, నాటికలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ సత్యవతి- థామస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# షీ టీమ్స్, సైబర్ నేరాలపై పై అవగాహన



కోదాడ టౌన్ డిసెంబర్ 19(వుదయం) ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, కోదాడ సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి అధ్వర్యంలో, షీ టీమ్ ఎస్ఐ నీలిమ సూచనల మేరకు కోదాడ పట్టణంలోనీ యస్ ఆర్ ప్రైమ్ స్కూల్ లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీమ్స్ ఏ ఎస్ ఐ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ మహిళ రక్షణపై పటిష్టంగా పని చేస్తున్నామని, విద్యార్థులు సమస్యలు ఉంటే అధ్యాపకుల దృష్టికి, అధికారుల దృష్టి తేవాలని, మానసిక ధైర్యం కలిగి ఉండాలని, అనుకూల, ప్రతికూల సమయాల్లో స్పందించే అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల కోరికలను, కళలను నెరవేర్చాల్సిన బాధ్యత మీపై ఉన్నది అని గుర్తు చేశారు. సైబర్ మోసగాళ్ళ మోసాలకు గురు కావద్దనీ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు ఓ టి పీ వివరాలు ఇతరులకు తెలపవద్దు అన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు. ఈ కార్యక్రమం లో పాఠశాల జోనల్ ఇంచార్జ్ రామినేని సురేష్ , ప్రిన్సిపాల్ పుల్లయ్య , షి టీమ్ కానిస్టేబుల్ యాకూబ్ , మహిళా కానిస్టేబుల్ సాయి జ్యోతి , పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు సముదాయానికి స్థల సేకరణకు ప్రభుత్వం తరఫున సహకరిస్తాం

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి




గద్వాల డిసెంబర్ 19 (వుదయం ప్రతినిధి) జిల్లా కోర్టు సముదాయం కోసం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండేలాగా జిల్లా ప్రజల తరపున నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులందరికీ మద్దతుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు ప్రకటించారు. గురువారం ఉదయం 12 గంటలకు గద్వాల్ జిల్లా కోర్టు ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టిన అడ్వకేట్ మిత్రులకు పూలమాలతో వారికి సన్మానం చేసి మద్దతు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాస్టర్ షేక్షావలి ఆచారి మాట్లాడుతూ జిల్లా సముదాయానికి అందరికి అందుబాటులో ఉండే విధంగా అందరికీ ఆమోదయోగ్యంగా స్థల పరిశీలనకు మద్దతుగా ఉంటామని డాక్టర్. ఎస్ ఏ. సంపత్ కుమార్ ఆదేశాలతో కలెక్టర్ తో మాట్లాడి సాధ్య అసాధ్యాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ప్రజలకు అన్ని విధాలుగా ఆమోదయోగ్యంగా ఉండే విధంగా ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీలైతే జిల్లా కోర్టు సముదాయానికి గద్వాల జిల్లా తరఫున ఒక డెలిగేట్స్ లాగా మంత్రిని కల్పించి జిల్లా కోర్టుకు కావలసినటువంటి స్థలాన్ని సమకూర్చే విధంగా సంపత్ కుమార్ సహకరిస్తారని మాస్టర్ షేక్షావలి ఆచారి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పాండురంగ, పట్టణం బీసీ సెల్ అధ్యక్షుడు బసవరాజు, పట్టణ ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, మొదలగువారు ఈ దీక్షలో పాల్గొనడం జరిగింది.

# నూతన బూత్ అధ్యక్షుల, కమిటీ సభ్యుల ఎన్నిక



వరంగల్, డిసెంబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి) : వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలో బిజెపి 40 వ డివిజన్ అధ్యక్షులు ఆకుతోట రాజు ఆధ్వర్యంలో ఈరోజు నూతనంగా బూత్ అధ్యక్షులను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన బూత్ అధ్యక్షులుగా 176వ బూత్ అధ్యక్షులు ఆకుతోట కిరణ్,177వ బూత్ అధ్యక్షులు ఆకుతోట సాయి, 178 వ బూత్ అధ్యక్షులు చీర అశోక్ ,179 వ అధ్యక్షులు చీరాల అశోక్,180 వ బూత్ అధ్యక్షులు అడ్డగట్ల కిషోర్, 181 వ బూత్ అధ్యక్షులు కుసుమ శీను, 182వ బూత్ అధ్యక్షులు ఆవునూరి లింగమూర్తి,183 వ అధ్యక్షులుగా బడుగు రాము, 193వ అధ్యక్షులుగా లింగ బత్తుల రంజిత్, 194వ బూత్ అధ్యక్షులుగా క్షీరసాగరపు రవినాథ్, 195వ బూత్ అధ్యక్షులుగా మేడిపల్లి దేవేందర్,198వ బూత్ అధ్యక్షులుగా తౌటు జ్ఞానుదేవ్, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ఇన్చార్జ్ కనుకుంట్ల రంజిత్ ముఖ్య అతిథి గా పాల్గొని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను సభ్యులను గౌరవంగా సన్మానించారు. దేశం కోసం బిజెపి పార్టీ ఒక్కటే అహర్నిశలు పనిచేస్తుందని కార్యకర్తలు సభ్యులు అధ్యక్షులు తేడా లేకుండా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి తమ సంపూర్ణ సహాయ సహకారాలను అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు, బైరి నాగరాజు, గోగికార్అనిల్, మందాటి సందీప్, తాటిపాముల శరత్, మాచర్ల దీన్ దయాల్, ఆవునూరి సంతోష్ కుమార్ లతోపాటు స్థానిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బిజినెస్




## ఏఐ సాయంతో 80 లక్షల సిమ్ కార్డ్ బ్లాక్..



భారతదేశంలో ఫోన్ చేసి పౌరులను మభ్యపెట్టి చేసే మోసాల సంఖ్య పెరిగింది. మోసపోయిన వ్యక్తులు ఆ ఫోన్ నెంబర్ ద్వారా కేసు పెడుతున్నా నకిలీ వివరాలతో సిమ్ కార్డులను పొందడంతో వారిని పట్టుకోవడం కుదరడం లేదని పోలీసులు చెబుతూ ఉంటారు. అయితే ఇలాంటి సిమ్ కార్డులపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ కొరడా ఝుళిపించింది. ఏకంగా 80 లక్షల సిమ్ కార్డులను బ్లాక్ చేసింది. సైబర్ క్రైమ్ సమస్యలను పరిష్కరించేందుకు నకిలీ పత్రాలను ఉపయోగించి జారీ చేసిన 80 లక్షల సిమ్ కార్డ్‌లను భారత ప్రభుత్వం డీయాక్టివేట్ చేసింది. ముఖ్యంగా పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు ఈ చర్యలు తీసుకుంది. ముఖ్యంగా ఏఐ ఆధారిత సిస్టమ్స్‌ను ఉపయోగించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డీఓటీ) మోసపూరిత సిమ్ కార్డ్‌లను గుర్తించి బ్లాక్ చేసింది. అలాగే సైబర్ క్రైమ్‌లతో నేరుగా లింక్ అయి ఉన్న 6.78 లక్షల మొబైల్ నంబర్‌లు డీయాక్టివేట్ చేసింది. నకిలీ పత్రాలతో నమోదైన మొబైల్ నంబర్‌లను కనుగొనడానికి డీఓటీ ఏఐపై ఆధారపడింది. డీఓటీ చర్యలపై కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ సిమ్ కార్డుల విషయంలో డీఓటీ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కలిసి పనిచేశాయని, అందువల్లే ఈ స్థాయిలో సిమ్ కార్డులను బ్లాక్ చేయడం సాధ్యమైందని పేర్కొన్నారు. అలాగే టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సైబర్ క్రైమ్‌లను నిరోధించడానికి బలమైన విధానాలను ప్రవేశపెట్టింది మెసేజ్ ట్రేస్‌బిలిటీ రూల్‌ను డిసెంబర్ 11, 2024న అమలు చేసింది. ఈ నియమం టెలికాం ఆపరేటర్‌లను నకిలీ సందేశాల మూలంతో పాటు వాటి చైన్‌ను కనుగొనడానికి అనుమతిస్తుంది. అలాగే కాల్‌లు, సందేశాలను బ్లాక్ చేయడం కోసం కొత్త విధానాన్ని అక్టోబర్ 1, 2024 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. నెట్‌వర్క్ స్థాయిలో టెలిమార్కెటింగ్ కాల్‌లు, స్పామ్ సందేశాలను నిరోధించడానికి కఠినమైన మార్గదర్శకాలు అమలు చేస్తున్నారు. ఈ విధానాలు మోసాన్ని తగ్గించడంతో ఆన్‌లైన్ బెదిరింపుల నుండి వినియోగదారులను రక్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం తాజా చర్యలతో స్పామ్ కాల్‌లు, మోసపూరిత కార్యకలాపాలు, సైబర్ క్రైమ్‌లను తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్నందున భారతదేశం ఇలాంటి కీలక చర్యలను తీసుకుందని వివరిస్తున్నారు.

## క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే రూ.2.30 లక్షలు హాంఫట్



భారతదేశంలో 2016లో చేసిన నోట్ల రద్దు తర్వాత డిజిటల్ పేమెంట్లు పెరిగాయి. ముఖ్యంగా ఎన్‌పీసీఐ తీసుకొచ్చిన యూపీఐ పేమెంట్లు భారీగా ఉన్నాయి. యూపీఐ పేమెంట్ల క్యూ ఆర్ స్కాన్ చేసి చేయవచ్చు. తాజాగా పూణేలోని పోలీసును మోసగాళ్లు క్యూఆర్ కోడ్ స్కామ్ ద్వారా మోసగించారు. బేకరీలో స్కాన్ చేసి పేమెంట్ చేశాక ఏకంగా రూ.2.30 లక్షలు కొట్టేశారు. ఆన్‌లైన్ మోసాలు భారతదేశంలో ఇటీవల కాలంలో భారీగా పెరుగుతున్నాయి. దాదాపు ప్రతిరోజూ స్కామర్లు అమాయకపు వ్యక్తులను టార్గెట్ చేస్తూ బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును తస్కరిస్తున్నారు.

సైబర్ సెల్‌లు, పోలీసులు పౌరులను జాగ్రత్తగా ఉండమని కోరుతున్నా స్కామర్లు సరికొత్త విధానాలతో ప్రజలను మోసగిస్తున్నారు. తాజాగా పూణేకు చెందిన ఒక పోలీసు కానిస్టేబుల్ స్వయంగా సైబర్ మోసానికి బలి అయ్యాడు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్కామ్‌లో ఏకంగా రూ. 2.30 లక్షలు పోగొట్టుకున్నాడు. పూణే సమీపంలోని సస్వాద్‌లో నివసిస్తున్న బాధితుడు సాస్వాద్‌లోని బేకరీలో క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా బిల్లు చెల్లించాడు.

బిల్లు చెల్లింపు తర్వాత తన ఖాతా నుంచి రూ.18,755 అనధికారికంగా డెబిట్ అయ్యాయని గుర్తించాడు. వెంటనే అప్రమత్తమైన అతను తన ఇతర బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయగా తన శాలరీ అకౌంట్‌లోని రూ.12,250 సహా ఖాతాలో రూ.50 మాత్రమే మిగిలి ఉండటంతో మరిన్ని అనధికార లావాదేవీలను చూసి ఆశ్చర్యపోయాడు. అలాగే కానిస్టేబుల్ తన గోల్డ్ లోన్ ఖాతా నుంచి రూ.1.9 లక్షల లావాదేవీకి వన్ టైమ్ పాస్ వర్డ్ (ఓటీపీ) నోటిఫికేషన్ రావడంతో అవాక్కయ్యాడు. అయితే అతడు ఓటీపీ ఎవరికీ చెప్పకపోయినా లావాదేవీ విజయవంతంగా పూర్తయ్యిందని మెసేజ్ వచ్చింది. అలాగే మోసగాళ్లు అతని క్రెడిట్ కార్డ్ వివరాలను ఉపయోగించి రూ. 14,000 విలువైన రెండు లావాదేవీలు చేయడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే ఆ కానిస్టేబుల్ బ్యాంకు ఖాతాలతో పాటు క్రెడిట్ కార్డులను కూడా బ్లాక్ చేశాడు. అనంతరం పూణే రూరల్ పోలీసులకు తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పూణే రూరల్ పోలీసులు చెబుతున్నారు.

మోసగాళ్ళు హానికరమైన ఏపీకే ఫైల్ ద్వారా కానిస్టేబుల్ మొబైల్ ఫోన్, బ్యాంక్ ఖాతాలకు యాక్సెస్ చేయడం వల్ల బాధితుడు డబ్బును కోల్పోయాడని పోలీసులు వెల్లడించారు. మోసగాళ్లు పంపిన హానికరమైన లింక్‌ను కానిస్టేబుల్ తన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయడానికి అనుమతించారని, తెలియకుండా క్లిక్ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ మాల్వేర్ నేరస్తులకు లాగిన్ వివరాలు, ఓటీపీలు, మల్టిపుల్ ఖాతాలను యాక్సెస్ చేయడం వంటి సున్నితమైన సమాచారాన్ని పొందడానికి వీలు కల్పిస్తుంది. ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేయడానికి కానిస్టేబుల్‌ను దారి మళ్లించడానికి క్యూఆర్ కోడ్‌ను తారుమారు చేశారా? లేదా?మోసగాళు ఇతర మోసపూరిత వ్యూహాలను ఉపయోగించారా? అనే దానిపై పోలీసులు మరింత దర్యాప్తు చేస్తున్నారు.

## రిక్రూట్‌మెంట్ నిలిపేసిన టెక్ కంపెనీ..



మీరంతా మంచు విష్ణు నటించిన ఢీ సినిమా చూసే ఉంటారు. అందులో హీరో విష్ణు శ్రీహరితో కంప్యూటర్ వల్ల ఉపయోగాలు చెబుతూ పది మంది పది రోజుల్లో చేసే పని ఒక్కరోజులో అవుతుందని చెప్పే డైలాగే మీకు గుర్తు ఉండే ఉంటుంది. అయితే తాజాగా ఓ టాప్ టెక్ కంపెనీ ఏఐ రాకతో ఎక్కువ పని అవుతుందని పేర్కొంటూ ఉద్యోగ రిక్రూట్‌మెంట్ నిలిపేసింది. బై నౌ పే లేటర్ సేవలకు ప్రసిద్ధి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ క్లార్నా నూతన రిక్రూట్‌మెంట్‌లను నిలిపేసిందని. ఇటీవలే ఆ కంపెనీ సీఈఓ సెబాస్టియన్ సిమియాట్‌కోవ్స్కి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇప్పుడు సాంప్రదాయకంగా మానవ ఉద్యోగులు నిర్వహించే దాదాపు అన్ని పనులను చేస్తుందని పేర్కొన్నారు. ఇటీవల ఓ చానల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో, సిమియాట్‌కోవ్స్కి ఏఐ కంపెనీలో అనేక పాత్రలను నిర్వహించగలిగే స్థాయికి ఎదిగిందని సూచించారు. ఒక సంవత్సరం క్రితం నుంచే క్లార్నా కొత్త సిబ్బందిని నియమించుకోవడం ఆపివేసిందని దాని వల్ల శ్రామికశక్తి క్రమంగా తగ్గిందని సిమియాట్‌కోవ్స్కి వెల్లడించారు. గతంలో 4,500 మంది ఉద్యోగులు ఉన్న కంపెనీ ఇప్పుడు 3,500 మందిని కలిగి ఉంది. సాంకేతిక సంస్థల్లో సాధారణంగా వార్షిక అట్రిషన్ రేటు కారణంగా 20 శాతం రీప్లేస్‌మెంట్‌లు ఉంటాయి. అయితే ఆ స్థానాలను భర్తీ చేసుకోకుండా క్లార్నా వర్క్‌ఫోర్స్‌ను కుదించడాన్ని ఎంచుకుంది. ముఖ్యంగా ఆటోమేషన్ కోసం ఏఐను వినియోగిస్తున్నారు. ఈ మార్పు ఉన్నప్పటికీ ప్రస్తుత ఉద్యోగుల జీతాలు ప్రతికూలంగా ప్రభావితం కాకూడదని సిమియాట్కోవ్స్కి సూచించారు. వాస్తవానికి తక్కువ మంది సిబ్బంది కారణంగా క్లార్నాకు సంబంధించిన మొత్తం జీతం ఖర్చులు తగ్గుతున్నందున మిగిలి ఉన్న వారికి భారీగా జీతం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం గురించి ప్రపంచవ్యాప్త చర్చలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఇంటర్వ్యూ వైరల్ అయ్యింది.

## మూడో రోజూ నేల చూపులు



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నేల చూపులు చూశాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై ప్రకటన చేయనున్నట్లు నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహారించారు. ఈ దఫా వడ్డీ రేట్లను తగ్గించనుందన్న అంచనాల్లో బుధవారం భారత మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఈ అంచనాలతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. మదుపరులు లాభాల స్వీకరణకు దిగుతుండడంతో మార్కెట్లన్నీ కుదేలవుతున్నాయి. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ 502 పాయింట్లు లేదా 0.62 శాతం కోల్పోయి 80,182కు పడిపోయింది. ఇంట్రాడేలో 80,868–80,050 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 137 పాయింట్లు లేదా 0.56 శాతం నష్టంతో 24,198 వద్ద ముగిసింది. దాదాపు 1,379 షేర్లు లాభపడగ.. మరో 2,456 షేర్లు పతనం కాగా.. మరో 92 షేర్లు యథాతథంగా నమోదయ్యాయి. ఆటో, ఎనర్జీ, పిఎస్‌యు బ్యాంక్, మెటల్, మీడియా, రియాల్టీ 0.5 శాతం నుంచి 2 శాతం వరకు నష్టపోయాయి.

## విఐ 4జి అత్యుత్తమ సేవలు




తెలుగు రాష్ట్రాల్లో వొడాఫోన్ ఐడియా (విఐ) 4జి అత్యుత్తమ నెట్‌వర్క్ సేవలను అందిస్తుందని క్లస్టర్ బిజినెస్ హెడ్ (ఎపి, టిజి, కర్నాటక) ఆనంద్ దానీ తెలిపారు.

బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 4జి విభాగంలో డౌన్‌లోడ్ స్పీడ్, వీడియో ఎక్స్‌పీరియన్స్, లైవ్ వీడియో అనుభవం, వాయిస్ యాప్ సేవల్లో విఐ మార్కెట్ లీడర్‌గా ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఈ క్లస్టర్‌లో నెట్‌వర్క్ విస్తరణ, మెరుగుదల కోసం రూ.4,122 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో 5జి సేవలను ప్రారంభించనున్నామన్నారు. ఇటీవల దక్కించుకున్న 250మెగాహెడ్జ్ స్పెక్ట్రంతో పైలట్ ప్రాజెక్ట ప్రయోగాలు జరుగుతున్నాయన్నారు.

ఇటీవల అందుబాటులోకి తెచ్చిన విఐ హీరో రీచర్జ్ ప్లాన్ విజయవంతం అయ్యిందని.. 50–60 శాతం మంది ఖాతాదారులు దీని వినియోగించుకుంటున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తమకు 11,500 పైగా టవర్లు ఉన్నాయన్నారు. ఖాతాదారుల నుంచి సగటు రాబడి ఎఆర్‌పియు రూ.200గా ఉందని.. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువన్నారు. ప్రతీ నెల రూ.150 కోట్ల వ్యాపారం జరుగుతుందన్నారు.

## ఎస్‌బిఐ నూతన ఎండిగా రామ మోహన్ రావు నియామకం



దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా రామ మోహన్ రావు అమర నియమితులయ్యారు. దీంతో మరో తెలుగు వ్యక్తికి కీలక పదవీ దక్కినట్లయ్యింది. తెలుగు వ్యక్తి అయినా సిఎస్ శెట్టి ప్రస్తుతం ఎస్‌బిఐ ఛైర్మన్‌గా ఉన్నారు. రామ మోహన్ నియామకానికి కేంద్ర విత్త సేవల శాఖ ప్రతిపాదన చేయగా.. ప్రభుత్వ కమిటీ ఆఫ్ ది కేబినెట్ (ఎసిసి) ఆమోదం తెలిపింది. ఈ హోదాలో రామ మోహన్ రావు మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఆయనకు బ్యాంకింగ్‌లో 29 ఏళ్ల అనుభవం ఉంది. 1991లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరారు. ఎండిగా నియామకానికి ముందు ఆయన ఎస్‌బిఐ బోపాల్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేశారు. అదే విధంగా మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ కార్యకలాపాలను చూశారు. ముఖ్యంగా రుణాలు, రిస్కు, అంతర్జాతీయ బ్యాంకింగ్‌లో విశేష అనుభవం కలిగి ఉన్నారు. సింగపూర్, అమెరికాలోనూ పని చేసిన అనుభవం ఉంది. ఎస్‌బిఐ చికాగో శాఖ సిఇఒ, ఎస్‌బిఐ కాలిఫోర్నియా ప్రెసిడెంట్‌గా పని చేశారు. 2028 ఫిబ్రవరి 29న పదవీ విరమణ పొందనున్న ఆయన పనితీరు ఆధారంగా పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉంది.

# జాతీయం - అంతర్జాతీయం

## పెట్టుబడుల సంవత్సరాన్ని ఏర్పాటు చేస్తాం

తిరువనంతపురం : పరిశ్రమల శాఖ రూపొందించిన ఎంటర్‌ప్రెన్యూరియల్ ఇయర్ తరహాలో పెట్టుబడుల సంవత్సరాన్ని ఏర్పాటు చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ తెలిపారు. భారీ ఉత్పాదక సంస్థల కంటే కేరళ మానవ వనరులు, అధిక నైపుణ్యం సామర్థ్యం, సాంకేతిక పర్యావరణ వ్యవస్థను ప్రభావితం చేసే పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని అన్నారు. కొచ్చిలో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ముందు ఏర్పాటు చేసిన స్టార్టప్ కాంక్లేవ్‌ను మంత్రి ప్రారంభించారు. కేరళకు పెట్టుబడులను ఆకర్షించడంలో స్టార్టప్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంవత్సరంలో భాగంగా 3.25 లక్షలకు పైగా ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభించామని, రూ.22000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించబడ్డాయని తెలిపారు. పెట్టుబడిదారుడు ఈ అనుకూలమైన పరిస్థితి నుండి సంవత్సరంలోకి ప్రవేశిస్తాడని తెలిపారు. స్టార్టప్‌లకు ఇప్పటికే ఉన్న ఆర్డర్‌ల ఆధారంగా రుణాలను పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి చెప్పారు. రాష్ట్ర



పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (కెఎస్ఐడిసి), కేరళ స్టార్టప్ మిషన్ (కె.ఎస్.యు.ఎం) ఈ సమ్మేళనాన్ని నిర్వహించాయి. ఐటీ సెక్రటరీ డాక్టర్ రతన్ యు ఖేల్కర్, కేఎస్ఐడీసీ ఎండీ ఎస్ హరికిషోర్, స్టార్టప్ మిషన్ సీఈవో అనూప్ అంబికా, కిన్‌ఫ్రా ఎండీ సంతోష్ కోసి థామస్ పాల్గొని, మాట్లాడారు.

## గాజాపై ఆగని దాడులు

గాజా : గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడుల్లో గత 24గంటల్లో 38మంది మరణించారు. 203మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రిపై మరోసారి బాంబుల వర్షం కురిసింది. సెంట్రల్, దక్షిణ గాజాల్లో సురక్షిత జోన్లుగా భావించిన శిబిరాలపై తీవ్రంగా దాడులు జరగడంతో పలువురు మరణించారు. కొత్త షరతులు విధించడం ఆపితేనే కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడం సాధ్యమవుతుందని హమాస్ తేల్చి చెప్పింది. దాడులు ముగిసిన తర్వాత గాజాలో సెక్యూరిటీని తమ దేశమే చూస్తుందని, ఏ చర్యలు తీసుకోవడానికైనా తమకు పూర్తి స్వేచ్ఛ వుంటుందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఉత్తర గాజాలోకి ఇప్పటికీ సహాయ బృందాలను ప్రవేశించనివ్వడం లేదని ఐక్యరాజ్య సమితి మానవతా సంస్థ పేర్కొంది. ఆహారం, నీరు తీసుకెళ్లే మూడు సహాయ బృందాలను మంగళవారం వెనక్కి తిప్పి పంపేశారని పేర్కొంది. ఏడాదికి పైగా సాగుతున్న ఈ మారణహోమంలో ఇప్పటికి 45,097మంది పాలస్తీనియన్లు మరణించగా, 1,07,244మంది గాయపడ్డారు. గాజాలో తమ



కార్యకలాపాలను నిషేధించినంత మాత్రాన పాలస్తీనా శరణార్ధుల చట్టబద్ధమైన హోదాపై ఎలాంటి ప్రభావం చూపదని యుఎన్‌ఆర్‌డబ్ల్యు పేర్కొంది. రేపటి నుంచే తమ స్కూళ్లు,. ఆరోగ్య కేంద్రాలు, సేవలన్నింటినీ నిలిపివేసినా పాలస్తీనా శరణార్ధులు అలాగే కొనసాగుతారని, వారి చట్టబద్ధ హోదా మారదని తెలిపింది.

వెస్ట్ బ్యాంక్‌లోని సల్ఫిట్ నగరంలోకి ఇజ్రాయిల్ సైన్యం చొచ్చుకెళ్లింది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ వ్యాప్తంగా పలు నగరాల్లో అనేక దాడులు జరిపింది. ఉత్తర గాజాలోని బెయిట్ హనూన్ నగరంలో ఇజ్రాయిల్ ఆర్మీ జరిపిన దాడిలో ఆరుగురు పాలస్తీనియన్లు చనిపోయారు.

## ప్రత్యేక సంస్థతో మానవ

### అక్రమ రవాణా కేసుల దర్యాప్తు



న్యూఢిల్లీ: మానవ అక్రమ రవాణా కేసులను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, ప్రాసిక్యూట్ చేసేందుకు విడిగా ఒక సంస్థను ఏర్పాటు చేయాలన్న వాదనలను తీవ్రంగానే పరిగణనలోకి తీసుకుంటామని సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. ఇటువంటి కేసుల్లోని బాధితుల భద్రత కోసం విడిగా, సమగ్రంగా ప్రొటోకాల్‌ను రూపొందిస్తామని పేర్కొంది. జస్టిస్ జెబి పార్దివాలా నేతృత్వంలోని బెంచ్ ముందు పిటిషనర్ ఎన్‌జిఓ ప్రజ్వల తరపు న్యాయవాది అపర్ణభట్ మాట్లాడుతూ, ఈ రవాణాకు పాల్పడే వ్యక్తులు చాలా తరచుగా పోలీసుల వల నుండి తప్పించుకుంటారని అన్నారు. సాధారణంగా నేరాలు జరిగే ప్రదేశాల్లో కొంతమంది అరెస్టవుతూ వుంటారని, వీరు కింది స్థాయి ఆపరేటర్లు లేదా బాధితులై వుంటారని, అంతేకానీ అసలు వ్యక్తులై వుండరని ఆమె వివరించారు. 2018-2022 మధ్య కాలంలో 10వేలకు పైగా అక్రమ రవాణా కేసులు నమోదు కాగా, కేవలం 1031 మంది మాత్రమే దోషులుగా నిర్ధారించబడ్డారని పేర్కొన్నారు. ఈ అక్రమ రవాణా కార్యకలాపాలకు అవసరమైన నిధులకు మూలాలు ఎక్కడున్నాయో తెలుసుకునే ప్రయత్నాలు జరగడం లేదని భట్ వివరించారు. ఇటువంటి సమస్యలను ఎదుర్కొనడానికి నేడు ఎలాంటి వ్యవస్థాగతమైన యంత్రాంగం లేదని తెలిపారు. 2016 సెప్టెంబరు కల్లా సంఘటిత నేరాల దర్యాప్తు సంస్థ (ఒసిఐఎ)ను ఏర్పాటు చేస్తామని కేంద్ర హోం శాఖ ఇచ్చిన హామీని సుప్రీం కోర్టు కూడా రికార్డు చేసిందని అపర్ణా భట్ గుర్తు చేశారు. దీనిపై అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భటి స్పందిస్తూ, కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాలు ఈ ట్రాఫికింగ్ సమస్యను సమగ్రంగా ఎదుర్కొంటాయన్నారు.

కొత్త సంస్థ ఏర్పాటుపై స్పందిస్తూ ఇప్పటికే వున్న ఎన్ఐఎ, కొత్త క్రిమినల్ చట్టాలు, అక్రమ రవాణా నిరోధకచట్టం ఇవన్నీ కలిసి ప్రతిపాదిత సంస్థ అవసరాలు తీరుస్తున్నాయన్నారు. దీనిపై తీర్పును బెంచ్ రిజర్వ్ చేసుకుంది.

## మీరు పన్నులేస్తే మేమూ వేస్తాం..

### భారత్‌కు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్ : తమ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై భారత్ సహా పలు దేశాలు అధిక పన్నులు వేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. తాము కూడా ఆ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అలాగే ఎక్కువ పన్నులు వసూలు చేస్తామని ఆయన విలేకరులతో అన్నారు.

'వారు మా మీద పన్నులు వేస్తే అంతే మొత్తంలో మేమూ వారిపై పన్నులు విధిస్తాం. మేము పన్నులు వేస్తే వారూ వేస్తారు. అన్ని సందర్భాలలోనూ వారు మాపై పన్నులు వేస్తున్నారు. మేమేమో వారిపై వేయడం లేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు పిటిఐ వార్తా సంస్థ తెలిపింది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత్, బ్రెజిల్ దేశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్ని అమెరికా వస్తువులపై ఈ రెండు దేశాలతో పాటు మరికొన్ని దేశాలు కూడా అధిక పన్నులు వసూలు చేస్తున్నాయని ట్రంప్ చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ వంద శాతం పన్ను వేస్తే అమెరికా కూడా ప్రతిగా అంతే వసూలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

'భారత్ మాపై వంద శాతం పన్ను వేస్తే మేము ఏమీ వేయకూడదా? మీకు తెలుసు. వారు మాకు ఓ సైకిల్ పంపితే మేము కూడా సైకిల్ పంపుతాం' అని అన్నారు.

## జమిలి బిల్లుపై 31 మందితో జెపిసి

న్యూఢిల్లీ: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లును పరిశీలించడానికి 31 మంది సభ్యులతో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికి రాజ్యాంగం, సంబంధిత చట్టాలను సవరిస్తూ ఈ బిల్లు తీసుకొచ్చారు. ఈ కమిటీలో కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, నూతనంగా ఎన్నికైన ప్రియాంకగాంధీసహా 21 మంది లోక్‌సభ సభ్యులకు, మరో 10 మంది రాజ్యసభ సభ్యులకు స్థానం కల్పించారు. లోక్‌సభ నుంచి కమిటీలో ఉండబోయే 21 మంది సభ్యులలో 10 మంది బిజెపికి చెందిన వారు, ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, శివసేన (షిండే), ఆర్‌ఎల్‌డిలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు, ఎన్‌సిపి, టిఎంసి, డిఎంకె, ఎన్‌సిపికి చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. బిజెపి నుంచి పిపి చౌదరి, సిఎం రమేష్, బాన్సూరి స్వరాజ్, పురుషోత్తం రూపాలా, అనురాగ్ సింగ్ ఠాకూర్, విష్ణు దయాళ్ రామ్, భర్తృహరి మహతాబ్, సంబిత్ పాత్ర, అనిల్ బలుని, విష్ణు దత్ శర్మ ఉన్నారు. జిఎం హరీష్ బాలయోగి (టిడిపి), శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (శివసేన షిండే), చందన్ చౌహాన్ (ఆర్‌ఎల్‌డి), వల్లభనేని బాలశౌరి (జనసేన)



ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖదేయో భగత్ ఉన్నారు. ధర్మేంద్ర యాదవ్ (ఎస్‌పి), కల్యాణ్ బెనర్జీ (టిఎంసి), టిఎం సెల్వగణపతి (డిఎంకె), సుప్రియా సూలే (ఎన్‌సిపి) ఉన్నారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉండబోయే మరో పది మంది పేర్లను రాజ్యసభలో ప్రకటించనున్నారు.

## భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

### చైనా విదేశాంగ మంత్రితో అజిత్ దోవల్ భేటీ

బీజింగ్ : సరిహద్దుల్లో శాంతి స్థాపన, గత నాలుగేళ్లుగా స్తంభించిన ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణతో సహా పలు అంశాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మధ్య బుధవారం చర్చలు జరిగాయి. భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న దోవల్ మంగళవారమే ఇక్కడకు చేరుకున్నారు. ఐదేళ్ల విరామం అనంతరం జరుగుతున్న ప్రత్యేక ప్రతినిధుల 23వ సమావేశంలో పాల్గొనేందుకు వీరు అక్కడకు వెళ్లారు. చైనా కాలమానం ప్రకారం ఉదయం 10గంటలకు చర్చలు ఆరంభమయ్యాయి. తూర్పు లడఖ్‌లో గస్తీకి, బలగాల ఉపసంహరణ కుదిరిన ఒప్పందం నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాలను పునర్నిర్మించుకునేందుకు పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరుపుతున్నారు. భారత్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా వుందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మీడియాకు తెలిపారు. ఇరు దేశాల నేతల మధ్య కుదిరిన ఉమ్మడి అవగాహన, సర్దుబాటును అమలు



చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పరస్పర ప్రయోజనాలు కలిగిన అంశాలను గౌరవిస్తూ, చర్చలు, కమ్యూనికేషన్ ద్వారా పరస్పర విశ్వాసాన్ని పెంచుకోవాలని నేతలు భావించారు. సరిహద్దుల్లో శాంతి భద్రతల నిర్వహణపై ఇరు దేశాల ప్రత్యేక ప్రతినిధులు చర్చించనున్నారు. సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని అన్వేషించాలని నిర్ణయించారు.

## కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ గ్రూప్ పై ఈడీ దాడులు

కోల్‌కత్తా : కోల్‌కత్తా జోనల్ ఆఫీస్ కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ గ్రూప్‌కు చెందిన 13 ప్రదేశాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో ?4.5 కోట్ల విలువైన బంగారం, ఆభరణాలతో పాటు లగ్జరీ వాహనంతో సహా ఎనిమిది వాహనాలను స్వాధీనం చేసుకుంది.

బ్యాంక్ మోసం కేసుకు సంబంధించి ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ)- 2002 ప్రకారం సోదాలు నిర్వహించారు. 30.9.2016న కంపెనీ ఎన్‌పిఏగా మారినందున గ్రూప్ మొత్తం ?6210 కోట్ల డిఫాల్ట్‌తో 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐదు ఆర్థిక సంస్థల నుండి క్రెడిట్ సౌకర్యాన్ని పొందిందని ఈడీ పేర్కొంది. కన్సార్టియం యొక్క లీడ్ బ్యాంక్ అయిన ఎస్.బి.ఐ దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా సంజయ్ సురేఖ, ఇతరులపై ఐపిఎస్ 1860 , అవినీతి నిరోధక చట్టం, 1988లోని వివిధ సెక్షన్ల కింద సిబిఐ, బిఎస్ఎఫ్బి నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక ప్రకటనలో పేర్కొంది.

## రష్యా బలగాల అదుపులో బాంబు పేలుడు అనుమానితుడు

మాస్కో : సీనియర్ సైనిక జనరల్ సహా ఇద్దరు మృతికి కారణమైన మాస్కో బాంబు పేలుడుకు సంబంధించి అనుమానితుడిని తమ అదుపులోకి తీసుకున్నట్లు రష్యన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎఫ్ఎస్‌బి బుధవారం తెలిపింది. ఆ అనుమానితుడు ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ రిక్రూట్ చేసుకున్న ఉజ్బెక్ పౌరుడని పేర్కొంది. ఆ వ్యక్తి పేరును ఎఫ్ఎస్‌బి వెల్లడించలేదు. ఉక్రెయిన్ తనను నియమించిందని ఆ వ్యక్తే చెప్పాడని, 30ఏళ్ల లోపు వయసు వుందని తెలిపింది. ఉక్రెయిన్‌లో మాస్కో మిలటరీ ఆపరేషన్ సందర్భంగా చేపట్టిన చర్యలపై బ్రిటన్, కెనడాలతో సహా పలు దేశాల నుండి రష్యా సైనిక జనరల్ కిరిలొవ్ ఆంక్షలు ఎదుర్కొంటున్నారు. నిషేధిత రసాయన ఆయుధాలతో యుద్ధం చేస్తున్నారంటూ సోమవారం ఉక్రెయిన్ ఆయనపై క్రిమినల్ దర్యాప్తు చేపట్టగా, మంగళవారం బాంబు దాడిలో చనిపోయారు. ఈ దాడిలో కిరిలొవ్ ప్రయాణిస్తున్న కారు బాగా దెబ్బతినగా, డ్రైవర్ గాయాలతో బతికి బయటపడ్డాడు. తన నివాసం నుండి కిరిలొవ్ బయటకు రాగానే రిమోట్ పరికరంతో పేలుడు పదార్థాలను పేల్చివేసినట్లు భావిస్తున్నారు.

## మాస్కోలో పేలుడు

మాస్కో : రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం జరిగిన బాంబు దాడిలో అత్యంత సీనియర్ మిలటరీ నేత, రష్యా ఆర్మీకి చెందిన రసాయన ఆయుధాల విభాగాధిపతి ఇగర్ కిరిలొవ్ మరణించారు. ఈ బాంబు దాడి జరిపింది తామేనని ఉక్రెయిన్ ప్రకటించింది. ఆగేయ మాస్కోలో ఒక అపార్ట్‌మెంట్ భవనం వెలుపల నిలిపి వుంచిన స్కూటర్‌లో పేలుడు పదార్థం పెట్టారు. దాన్ని పేల్చివేయడంతో ఇగర్ కిరిలొవ్ ఆయన అసిస్టెంట్ చనిపోయారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌లో రష్యా బలగాలు విజయం సాధించాయని అధ్యక్షుడు పుతిన్ చెప్పుకున్న మరుసటి రోజే రాజధానిలోని నివాస ప్రాంతంలో ఈ దాడి జరగడం గమనార్హం. రష్యా సైన్యంలో రసాయన, జీవ, రేడియోలాజికల్ ఆయుధాల విభాగానికి కిరిలొవ్ (54) నేతృత్వం వహిస్తున్నారు. కిరిలొవ్‌ను యుద్ధ నేరస్తుడిగా ప్రకటిస్తూ స్పెషల్ ఆపరేషన్‌లో భాగంగానే ఈ పేలుడు జరిపినట్లు ఉక్రెయిన్‌కి చెందిన ఎస్‌బియు సెక్యూరిటీ సర్వీస్ వర్గాలు తెలిపాయి. పేలుడు ధాటికి ఆ భవనంలోని పలు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ముందు తలుపు దారుణంగా దెబ్బతింది. ఈ దాడిని తీవ్రవాద చర్యగా రష్యా అధికారులు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. యుద్ధ రంగంలో నిషేధించిన రసాయన ఆయుధాలను ఉక్రెయిన్‌పై వినియోగించారని, ఆ రకంగా కిరిలొవ్ యుద్ధ నేరస్తుడని ఉక్రెయిన్ చెబుతోంది. యుద్ధ నేరాలకు ప్రతీకారం తప్పదని ఆ వర్గాలు హెచ్చరించాయి.



# జంక్ ఫుడ్ తింటున్నారా? మీ ఆ సామర్థ్యం ఖతం



కాలం మారినా కొద్దీ బబ్బర్లు గుడాలు జొన్నలు అవిసెలు లాంటి మన పురాతన ఆహార పదార్థాలు మాయమై బర్గర్లు పిజ్జాలు ఎగ్ పఫ్ లు నూడుల్స్ వంటి ఆధునిక పాశ్చాత్య వంటకాలు మన సమాజంలోకి వచ్చాయి. మన పప్పులు తింటే దేహానికి బలం.. ఆరోగ్యం.. ఈ పాశ్చాత్య బ్రెడ్డులు తింటే శరీరానికి హానికరం.. తొందరగా పైకి పోవడానికి ఈ తిండి మరింత బూస్ట్ నిస్తుంది. అందుకే ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతున్న వేళ మళ్లీ మన పురాతన వంటల వైపు అందరూ దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం మన ఆధునిక సమాజంలో మనిషి పనిలో పడిపోయి సరైన తిండి తినడం లేదు. ఆదరబాదరగా ఫాస్ట్ ఫుడ్ కు అలవాటు పడుతున్నాడు. అప్పటికప్పుడు ఏది దొరికితే అదే తింటున్నాడు. అయితే జంక్ ఫుడ్ తినేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ జంక్ ఫుడ్ అప్పటికప్పుడు రుచికరంగా అనిపిస్తుందని.. కానీ లాంగ్ రన్ లో వచ్చేటప్పటికీ ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. జంక్ ఫుడ్ తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాల్సిందేనని డాక్టర్లు సూచిస్తున్నారు. ఎందుకంటే ఎక్కువ జంక్ ఫుడ్ తీసుకునే పురుషుల వృషణాల పరిణామం తగ్గకపోవడంతోపాటు వారి వీర్యకణాల సంఖ్య కూడా భారీగా పడిపోతోందని హార్వర్డ్ యూనివర్సిటీ తాజాగా చేసిన పరిశోధనలో తేలింది. ఆరోగ్యకరమైన వ్యక్తులతో పోలిస్తే జంక్ ఫుడ్ తీసుకునే వారిలో వీర్యకణాల సంఖ్య 26 మిలియన్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అంటే జంక్ ఫుడ్ తో మీ పిల్లలు పుట్టే సామర్థ్యం కూడా తగ్గిపోతుందని తేలింది.

# తరచూ జలుబుతో కొవిడ్ నుంచి రక్షణ!



సీజన్ మారినప్పుడల్లా చాలామందికి జలుబు చేయటం సాధారణమే. అయితే అలా అవ్వడం మంచిదేనట! ఆ జలుబు.. రైనో, పారా ఇన్ఫ్లుయెంజా వంటి వాటిలానే కొన్ని రకాల కరోనా వైరస్‌ల వల్ల కూడా రావొచ్చు. అలాంటి జలుబు వల్ల శరీరంలో పెరిగే రోగ నిరోధక శక్తి కారణంగా కొవిడ్ వైరస్ నుంచి దీర్ఘకాలిక రక్షణ లభిస్తుందని యూనివర్సిటీ ఆఫ్ రోచెస్టర్ మెడికల్ సెంటర్‌కు చెందిన పరిశోధకులు వెల్లడించారు. అంతేకాదు కొన్నిసార్లు జీవితాంతం కొవిడ్ నుంచి రక్షణ లభించే అవకాశమూ ఉందట. అదెలా అంటే... గతంలో కరోనా వైరస్ కారణంగా జలుబు చేసిన రోగుల్ని పరిశీలించినపుడు ఆసక్తికర విషయం బయటికొచ్చింది. కరోనా వైరస్‌ను ఎదుర్కొనే రోగ నిరోధక వ్యవస్థలోని మెమొరీ బి కణాలు వైరస్‌లను గుర్తు పెట్టుకుంటాయట. దాంతో ఆ రకమైన వైరస్‌లు మళ్లీ శరీరంలోకి ప్రవేశించగానే ఈ మెమొరీ బి కణాలు స్పందించి యాంటీ బాడీలను విడుదల చేస్తున్నాయట. ఈ కణాలు దశాబ్దాల తరబడి శరీరంలో జీవించి ఉంటాయి. ఫలితంగా గతంలో ఇతరత్రా కరోనా వైరస్‌ల కారణంగా జలుబు చేసిన వాళ్లకి అంత త్వరగా కొవిడ్ రాకపోవచ్చు. ఒకవేళ కొవిడ్ వచ్చినా వాళ్ల మీద అంతగా ప్రభావాన్ని చూపించకపోవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

# బాలల్లోనూ హై బీపీ.. భద్రం సుమా!

అధిక రక్తపోటు (హై బీపీ) అనగానే పెద్దవాళ్లే గుర్తుకొస్తారు. నిజమే. ఇది పెద్దవారిలోనే ఎక్కువ కావొచ్చు. అలాగని పిల్లల్లో ఉండకూడదనేమీ లేదు. కొందరికి వంశ పారంపర్యంగా.. కొందరికి ఇతరత్రా జబ్బులతో ఇది రావొచ్చు. కారణమేదైనా బాల రక్తపోటుపై నిర్లక్ష్యం తగదు. సకాలంలో గుర్తించి, చికిత్స చేయటం అత్యవసరం. లేకపోతే తీవ్ర దుష్ప్రభావాలకు దారితీసే ప్రమాదముంది. పిల్లలకా? అధిక రక్తపోటా? చాలామంది ఇలాగే ప్రశ్నిస్తుంటారు. 'చాల్లే పెద్ద చెప్పొచ్చా'వని పెదవి విరుస్తుంటారు. పిల్లల్లో అధిక రక్తపోటుపై మనదగ్గర సరైన అవగాహన లేదనటానికి ఇలాంటి వ్యాఖ్యలే నిదర్శనం.



దీని గురించి తెలియకపోవటానికి, నిర్లక్ష్యం చేయటానికి కారణాలు చాలానే ఉన్నాయి. పెద్దవాళ్లు ఎలాంటి సమస్యతో ఆసుపత్రికి వెళ్లినా డాక్టర్లు విధిగా రక్తపోటునూ పరీక్షిస్తుంటారు. పిల్లల్లో ఇలాంటిది ఎక్కడా కనిపించదు. ఆ మాటకొస్తే వైద్య కేంద్రాల్లో పిల్లల రక్తపోటును కొలిచే సదుపాయాలే ఉండవు. ఒకవేళ ఉన్నా పిల్లలకు రక్తపోటు పరీక్ష చేయటం అంత తేలికైన పని కాదు. పిల్లలు ఒక దగ్గర కుదురుగా ఉండరు. చిన్న పిల్లలైతే డాక్టర్‌ను చూడగానే ఏడుపు లంకించుకోవచ్చు. వీరిని సముదాయించి, బీపీ పరీక్షకు ఒప్పించటానికి తల ప్రాణం తోకకు వచ్చినంత పనవుతుంది. దీంతో ఎందుకొచ్చిందిలే అనుకొని మిన్నకుండిపోతుంటారు. అంతేకాదు, అసలు బీపీ పరీక్ష ఎవరికి అవసరమనేది నిర్ణయించటమూ కష్టమే. ఇవన్నీ బాల బీపీని గుర్తించలేకపోవటానికి దారితీస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కాస్తో కూస్తో అవగాహన పెరుగుతోంది. గత పదేళ్లుగా పిల్లల్లో రక్తపోటునూ నమోదు చేయటం ఒక పద్ధతిగా సాగుతోంది. గణాంకాలూ అందుబాటులోకి వస్తున్నాయి. నిజానికి పిల్లల్లో రక్తపోటు పెరుగుతోందనే విషయాన్ని అమెరికాలో 90ల్లోనే పసిగట్టారు. అప్పట్లో అక్కడ 5 శాతానికన్నా ఎక్కువ మంది పిల్లలు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని గుర్తించారు. ఇప్పుడది దాదాపు 10 శాతానికి చేరుకుంది. మనదేశంలోనూ తక్కువేమీ కాదు. సుమారు 7% మంది పిల్లలు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని అంచనా.

వయసుతో నిమిత్తం లేకుండా పెద్దవారిలో రక్తపోటును ఓ కచ్చితమైన సంఖ్యతో సూచిస్తాం. బీపీ 120/80 లోపుంటే నార్మల్. అదే 120/80 నుంచి 129/80 వరకు ముందస్తు రక్తపోటు దశ. అదే 130/80 నుంచి 139/89 వరకు మొదటి దశ.. 140/90, అంతకన్నా ఎక్కువైతే రెండో దశ హై బీపీగా పరిగణిస్తారు. పిల్లల్లో ఇలాంటి గంపగుత్త విధానం కుదరదు. అప్పుడే పుట్టిన శిశువు దగ్గర్నుంచి 13 ఏళ్లలోపు వరకు ఒక బృందంగా, 13-18 ఏళ్లు ఒక బృందంగా విభజించి చూడాల్సి ఉంటుంది. సాధారణంగా 13 ఏళ్లు పైబడ్డవారికి పెద్దవాళ్ల మాదిరి కొలమానాలే వర్తిస్తాయి. అదే 13 ఏళ్లలోపువారిలోనైతే వయసు, ఎత్తు, లింగ బేధం, బరువులను బట్టి రక్తపోటు నిష్పత్తిని (పర్సంటైల్) ప్రామాణికంగా తీసుకుంటారు. పర్సంటైల్ 90 కన్నా తక్కువగా ఉంటే నార్మల్‌గా భావిస్తారు. పర్సంటైల్ 90-95 ఉంటే ముందస్తు రక్తపోటు దశ అంటారు. ఒకరకంగా దీన్ని 120/80, అంతకన్నా ఎక్కువ అనుకోవచ్చు. పర్సంటైల్ 95-99 అయితే మొదటి దశ అధిక రక్తపోటుగా భావిస్తారు. అదే 99 కన్నా మించిపోయి, రక్తపోటు 12 ఎం.ఎం. హెచ్‌జీ దాటితే రెండో దశగా భావిస్తారు. ఇది చాలా ప్రమాదకరమైన దశ.

# మెరిసే దంతాల కోసం 'పసుపు'



పసుపు పచ్చగా ఉంటుంది.. దంతాలను ఎలా తెల్లబరుస్తుంది అని అందరికీ డౌట్ రావొచ్చు. దాని గురించి తెలుసుకుందాం. నేడు, పసుపు వివిధ చిన్న ఆరోగ్య సమస్యలకు ఇంటి చికిత్సగా ఉపయోగపడుతుంది. దంతాలు తెల్లబడటం కోసం ఇది ఇంటి దంత సంరక్షణలో చోటు సంపాదించింది. పసుపు వాడటం సురక్షితం, ఇది ఇతర దంత చికిత్సల కంటే బాగా పనిచేస్తుంది. పసుపు పళ్ళు తెల్లబడటానికి సహాయపడుతుంది. పసుపు ఒక ప్రసిద్ధ యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీమైక్రోబయల్ హెర్బ్, ఇది దంత సంరక్షణకు ఉపయోగపడుతుంది.

2012 లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం పసుపులోని కర్కుమిన్ చిగురువాపు లేదా చిగుళ్ల వ్యాధిని నివారించగలదని నిరూపించబడింది. ఇది దంత నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. వివిధ నోటి క్యాన్సర్లను నివారించడంలో కూడా సహాయపడుతుంది. కొద్దిగా పసుపు పొడి తీసుకుని చిగుళ్లు, దంతాల మీద రుద్దాలి. ఆ తరువాత బ్రష్ చేయాలి. వెంటనే కడిగే బదులు, పౌడర్ కనీసం ఐదు నిమిషాలు మీ దంతాలపై ఉంచండి. తరువాత, మీ నోటిని నీటితో బాగా కడగాలి. అప్పుడు, సాధారణ టూత్‌పేస్ట్, టూత్ పౌడర్ లేదా ఇతర దంతాలను శుభ్రపరిచే ఉత్పత్తితో మీ దంతాలను మళ్లీ బ్రష్ చేయండి. నోరు ఇంకా పసుపుగానే ఉంటే మరోసారి బ్రష్ చేయాలి. పసుపు టూత్ పేస్ట్ ఇంట్లోనే ఈ విధంగా తయారు చేసుకోవచ్చు.. 4 స్పూన్ల ఇంట్లోనే తయారు చేసిన పసుపు కొమ్ముల పొడి/ 2 స్పూన్ల బేకింగ్ పౌడర్/ 3 స్పూన్ల కొబ్బరి నూనె ఈ మూడింటిని బాగా కలపాలి. కొద్దిగా తీసుకుని బ్రష్ మీద పెట్టి పళ్లు రుద్దాలి. పళ్ళు తెల్లబడటానికి పసుపు వాడటం ప్రమాదం కాదు. అయితే, పసుపును ఉపయోగించే ముందు మీకు అలెర్జీ ఉన్నదీ లేనిదీ నిర్ధారించుకోండి. రోజుకు ఒకసారి మాత్రమే ఈ పసుపు పేస్ట్‌తో బ్రష్ చేసుకోవాలి. పసుపు అనేది శాశ్వతంగా ప్రాచుర్యం పొందిన సహజ దంతాల తెల్లబడటం. సరిగ్గా ఉపయోగించినప్పుడు, పసుపు సురక్షితమైన ఎంపిక.

# రైతుల ఉద్యమం వెనుక కీలక పాత్ర పోషిస్తున్న మహిళలు



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా లక్షలాది రైతులతో ఢిల్లీ సరిహద్దులు కుంభమేళాను తలపిస్తున్నాయి. భారతదేశ చరిత్రలోనే ఇదొక కనీవినీ ఎరుగని రైతాంగ పోరాటం అని ఇటు భారతీయులతో పాటు అటు ప్రపంచదేశాలు కూడా చెబుతున్నాయి. ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా రైతులు ఉద్యమిస్తున్నారు. ఇన్ని రోజుల నుంచి కేంద్రం నుంచి అనుకూల స్పందన రానప్పటికి అనుకున్నది సాధించి తీరుతామనే దృఢ విశ్వాసం ప్రతి ఒక్క రైతులో ఇప్పటికీ కనిపిస్తుండటం విశేషం. పంజాబ్‌లో మెజారిటీ కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నాయి. వ్యవసాయ చట్టాలు తమకు వ్యతిరేంగా ఉండటంతో.. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయించాకే ఇంటికి తిరుగు ప్రయాణమవుతామని ప్రతినపూని వచ్చి ఇప్పటికి ఇంటికి వెళ్లకుండా ఉద్యమించేవారు ఇందులో చాలామందే ఉన్నారు. ఇక ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఇప్పటికే వందలాది రైతు సంఘాలు ఈ ఉద్యమంలో పాల్గొన్నాయి. ఆ సంఘాల్లో మహిళలు అత్యధికంగా ఉన్నారు. ఉద్యమంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వీరంతా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉద్యమాన్ని విజయవంతంగా ముందుకు నడిపించడంలో తమవంత కృషి అందిస్తున్నారు. రైతుల వద్దకే వ్యాపారులు నేరుగా వెళ్లి పంట కొనుగోలు చేసుకోవచ్చు అని రైతు ఉత్పత్తుల వాణిజ్య, వ్యాపార చట్టం చెబుతోంది. దేశంలో కొన్ని లక్షల మంది ఒంటరి మహిళలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. అసలు మన మార్కెట్ వ్యవస్థ మహిళా రైతులకు ఎన్నడూ అనుకూలంగా ఉన్న పరిస్థితి లేదు. కొత్త చట్టంలో భాగంగా వారు నేరుగా వెళ్లి ఉత్పత్తులను అమ్ముకోవడం సులువైన పని కాదు. దీనికి సంబంధించి గతంలోనే యూపీఏ ప్రభుత్వం ఓ కమిటీని కూడా వేసింది. ఆ కమిటీలో కవిత కురుగంటి అనే మహిళ కూడా సభ్యురాలిగా ఉన్నారు. 2015లో మోదీ ప్రభుత్వానికి నివేదికను సమర్పించినా.. ఆ మార్గదర్శకాలను ఎన్డీఏ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆమె చెబుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు పాలు, కూరగాయలు, అటవీ ఉత్పత్తులు తదితర వస్తువులపై రైతులు పెట్టే పెట్టుబడికి అదనంగా యాభై శాతం కలిపి కనీస మద్దతు ధరగా ప్రకటిస్తూ కేంద్రం చట్టం చేయాలని రైతు సంఘాలన్నీ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాయని ఆమె వివరించారు. ప్రస్తుతం తమ రెండో ప్రధాన డిమాండ్ కూడా అదేనని ఆమె తెలిపారు.

# కర్మ ఫలితమే అదృష్టం కర్మ్ కరే కిస్మత్ బనే జీవన్ కా యహ్ మర్మ్

## ప్రాణీ తేరే హాత్ మేం తేరా అపనా కర్మ్

"మనం జీవితంలో ఆచరించే కర్మను బట్టే మన అదృష్టం ఆధారపడి ఉంటుంది. ఇదే జీవిత రహస్యం. అందుకే ఎవరి అదృష్టం వారి చేతల ద్వారానే నిర్ణయించబడుతుంది కానీ మరేది కాదు" అంటారు మహాత్మా కబీరు. శక్తి వంచన లేకుండా చేసే కృషి వల్లే అదృష్టం కలుగుతుందనేది కబీరు అభిప్రాయం. కష్టేఫలే, కృషితో నాస్తి దుర్భిక్షం అని మన పెద్దలు చెప్పిందీ ఇదే.

మనిషి జీవితం ఎన్నెన్నో మలుపులు తిరుగుతుంటుంది. ప్రతి మలుపూ ఏదో ఒక ప్రభావాన్ని చూపుతుంది. మనం చేసే మంచి పనులు మన అదృష్టాన్ని నిర్ణయిస్తాయని కొందరంటే మనం గతంలో చేసుకున్న దాన్ని బట్టే ఈ స్థితి అని మరికొందరంటారు. విష్ణుమూర్తి ఈ భూమ్మీద రామునిగా అవతరించి.. తనకు ఎదురైన కష్టాలను సహనంతో ఎదుర్కొని, నిరంతరం సత్కర్మలను ఆచరించి పురుషోత్తముడయ్యాడు.

శ్రీకృష్ణుడు కూడా.. అదృష్టం కోసం ముక్కుమూసుకుని తపస్సు చేయాలని చెప్పలేదు. పూజలు, వ్రతాలు, ఉపవాసాలు చేయాలని బోధించలేదు. సంసారం దుఃఖసాగరమని నిరాశపడకుండా మనిషి సహజ స్వభావమైన కర్మ చేయాలని, ఆ చేసేదేదో మంచి కర్మ చేయాలని అర్జునికి బోధిస్తాడు. అంటే మంచి పనులే మనిషికి అదృష్టాన్ని తెచ్చిపెడుతూ మనిషి సుఖసంతోషాలతో జీవించే అవకాశం కల్పిస్తుందని పరమాత్ముని బోధనసారం. "మనిషి నిస్వార్థంతో చేసే మంచి పనుల వల్లే మంచి ఫలితం సిద్ధిస్తుంది. సిద్ధాంతాలు, మతాచారాలకు అతీతంగా.. అనుక్షణం స్వార్థ రహితమైన కర్మను ఆచరించడమే ప్రతి మనిషి పరమావధి. అలా చేయడంవల్ల ఒనగూరే ఫలితాలెన్నో!" అన్నారు స్వామి వివేకానంద. ఒక్కొక్కప్పుడు మంచి పనులతో మనిషి కష్టాలెదుర్కొనే పరిస్థితి రావచ్చు. అలాంటి సందర్భాల్లో ధైర్యంగా వాటిని ఎదుర్కొంటే అంతిమంగా మంచి ఫలితమే లభిస్తుంది. సత్య హరిశ్చంద్రుడు తాను ఇచ్చిన మాటను నెరవేర్చడం కోసంఅష్టకష్టాలను భరించడమే గాక, భార్యాబిడ్డలను సైతం అమ్ముకున్నాడు. తాను కాటికాపరిగా మారాడు. ఎన్ని కష్టాలెదురైనా.. సత్యాన్ని విడువకుండా ప్రయత్నించి భగవత్ సాక్షాత్కారాన్ని పొందాడు. అదీ సత్కర్మల శక్తి. "కష్టాలను తలకెక్కించుకోలేని మనిషి సుఖాలను అనుభవించ సాధ్యపడదు" అని సత్యసాయిబాబా చెప్పేవారు. కష్టపడి పొందిన ఫలితమే మనిషికి సంతోషాన్ని, సంతృప్తిని కలిగిస్తుంది. ఎలాంటి కష్టం లేకుండా వచ్చేవి మానసిక ఆనందాన్ని కలిగించకపోగా అవమానాలకు గురిచేయవచ్చు. వ్యక్తిగత జీవితానికి పెను ముప్పుగా పరిణమించి ప్రాణాలచే పణంగాపెట్టే పరిస్థితి కూడా ఏర్పడవచ్చు అందుకే నిరుపేదైనా సంపన్నుడైనా శ్రమ శీలాన్ని అలవరుచుకోవడం ముఖ్యం.



# ఆంక్షల నేలపై కళను కొనసాగిస్తోంది!

సోరయా షాహిదీ... ప్రపంచవ్యాప్తంగా పేరున్న టాటూ ఆర్టిస్ట్. ఆఫ్ఘనిస్థాన్‌లో టాటూ కళాకారిణి అయిన తొలి మహిళ కూడా ఆమే. కానీ మహిళల స్వేచ్ఛపై ఆంక్షలున్న దేశంలో, తాలిబన్ల హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా టాటూ ఆర్టిస్ట్‌గా ఎదిగేందుకు ఆమె చాలా కష్టపడ్డారు. ఇన్నాళ్లు విదేశాల్లో తన టాటూ కళతో గుర్తింపు పొందిన సోరమా ఇప్పుడు సొంత దేశంలోనూ టాటూ కళకు గుర్తింపు తీసుకురావాలనుకుంటున్నారు. అయితే టాటూ తమ మత ఆచారాల ప్రకారం నిషేధం అంటూ కొందరు మతపెద్దలు ఆమె ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తున్నారు. మహిళలు స్వేచ్ఛగా, సాధికారికంగా బతకాలని విశ్వసించే సోరయా ధైర్యంగా తనకు నచ్చిన పని చేసుకుపోతున్నారు. కాబూల్‌లో ఆమె నడుపుతున్న మొబైల్ టాటూ పార్లర్‌కు యువత నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.



"చాలామంది మణికట్టు మీద, మెడ, కాళ్ల మీద టాటూ వేయించుకుంటున్నారు. అమ్మాయిలైతే సులభంగా ఉండే పువ్వులు, సీతాకోకచిలుక, తమకు ఇష్టమైన వారి పేర్లను టాటూలుగా వేయించుకుంటారు. "తాలిబాన్లు నా పనికి అడ్డు చెబితే, మహిళల స్వేచ్ఛ, సాధికారతను అడ్డుకోవాలని చూస్తే, వారికి వ్యతిరేకంగా నిలబడేవారిలో నేను మొదటివ్యక్తిని అవుతాను" అంటుంది సోరయా. ఆమె పని గిట్టని వారు పార్లర్‌పై ఆకస్మికదాడులు చేసే అవకాశం ఉండడంతో ఆమె ఎక్కువగా సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా టాటూ వేసుకోవాలనుకునే వారిని కలుస్తారు. కాబూల్‌లోని యూనివర్సిటీలో బిజినెస్ మేనేజిమెంట్ కోర్సు చదివిన సోరయా ఒకసారి టర్కీ వెళ్లినప్పుడు సరదాగా తన కుడిచేతి మీద బాణం గుర్తు టాటూ వేయించుకుంది. ఆ టాటూ చూసి వాళ్ల నాన్న, అన్నలు ఆమెను 'టాటూ నేర్చుకొనే బతుకు పో' అని కోప్పడ్డారు. మొదట్లో అయిష్టంగానే ఆమె టాటూ నేర్చుకున్నారు. కానీ పెళ్లయి, భర్తతో విడిపోయాక తన ఎనిమిదేళ్ల కుమారిడిని పోషించేందుకు ఒక పని అవసరమైంది. దాంతో పూర్తిగా టాటూ మీద దృష్టి పెట్టారు సోరయా. "అఫ్ఘనిస్థాన్‌లో ఒక మహిళగా బతికేందకు ఎంతో ధైర్యం కావాలి. నాకు ఆ ధైర్యం ఉన్నందుకు నేను ఎంతో గర్వపడతాను" అంటున్న సోరయా అఫ్ఘన్ మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# వారానికి ఒక్కసారైనా...


ఎక్కడికైనా బయటకు వెళ్ళేటప్పుడు అందరికి గుర్తుకు వచ్చేది దువ్వెన. కానీ దీని పట్ల ఎవ్వరూ అంతగా జాగ్రత్తలు తీసుకోరు. కొందరికైతే దువ్వెనను శుభ్రం చేయాలనే ఆలోచన కూడా రాదు. ఇప్పటి కాలంలో బ్యాగుల్లో అన్నం బాక్స్ లేకపోయినా ఉంటున్నారు కానీ, దువ్వెన లేకుండా ఉండడం లేదంటే అతిశయోక్తికాదు. మరి ఇలాంటి దువ్వెనను ఎలా శుభ్రం చేయాలో చూద్దాం..

దువ్వెనలో చిక్కుకుపోయిన జుట్టును పెన్ను లేదా పెన్సిల్‌తో వదులు చేయాలి. ఆ తర్వాత కత్తెర సాయంతో ఎక్కడికక్కడ కత్తిరించి, బయటకు తీయాలి. ఆపై గోరువెచ్చని నీటిలో కొద్దిగా షాంపూ వేసి దువ్వెనను నానబెట్టాలి. ఇక మెత్తని బ్రష్‌తో దువ్వెనను బాగా రుద్దాలి. అలాగని గట్టిగా రుద్దితే దువ్వెనకు ఉండే పళ్లు విరిగిపోతాయి. కనుక కాస్త చూస్తూ రుద్దాలి. బాగా రుద్దిన తర్వాత మళ్ళీ గోరువెచ్చని నీటితో బాగా కడిగి పొడి టవల్‌తో తుడిచి ఆరబెట్టాలి. అలానే దువ్వెనను నానబెట్టి నీటిలో షాంపూ స్థానంలో బేకింగ్ సోడా, వెనిగర్‌ను ఉపయోగించవచ్చును. దువ్వెనను వారానికి ఒక్కసారైనా శుభ్రం చేసుకుంటే మంచిది.

# సినిమా

## నాగచైతన్య, సాయిపల్లవి శివతాండవం.. తండేల్ శివశక్తి సాంగ్ రిలీజ్ టైం ఫిక్స్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం తండేల్ చందూ మొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025 ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఇప్పటికే విడుదల చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా తండేల్ సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. శివశక్తి ఫుల్ సాంగ్‌ను డిసెంబర్ 22న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. చైతూ, సాయిపల్లవి శివతాండవం చూపించబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోంది తండేల్. ఈ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.




## ప్రభాస్ రాజాసాబ్ విడుదల వాయిదా?

గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంపౌండ్ నుంచి హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న చిత్రం రాజాసాబ్ మారుతి డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారని తెలిసిందే. సినిమా షూటింగ్‌కు సంబంధించి అభిమానుల్లో నెలకొన్న డైలామాకు చెక్ పెట్టాడు మారుతి. ఈ డైరెక్టర్ బచ్చలమల్లి ప్రమోషనల్ ఈవెంట్‌లో రాజాసాబ్ షూటింగ్ పూర్తయిందని క్లారిటీ ఇచ్చేశాడు. అయితే రాజాసాబ్ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి మూవీ లవర్స్‌ను నిరాశ చెందేలా చేస్తుంది. రాజాసాబ్ విడుదల వాయిదా పడిందని వార్తలు వస్తుండగా.. మరోవైపు మీరు ఏ డేట్‌కు చూడాలనుకుంటే బాగుంటదో అదే తేదీన రాజాసాబ్ వస్తుందని మారుతి చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరి రాజాసాబ్ విడుదలపై మేకర్స్ నుంచి అధికారికంగా ఏదైనా ప్రకటన వస్తుందేమో చూడాలి. అంతేకాదు రాజాసాబ్ టీజర్ రన్‌టైం 2 నిమిషాల 15 సెకన్లు అని ఇన్‌సైడ్ టాక్.




## పవన్ కల్యాణ్ ఓజీ సాంగ్‌లో డీజే టిల్లు భామ!

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న మోస్ట్ క్రేజీయెస్ట్ సినిమా ఓజీ సుజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్‌కు సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ చిత్రంలో స్పెషల్ సాంగ్ ఉండబోతుందట.. ఈ పాటలో డీజే టిల్లు భామ నేహాశెట్టి మెస్మరైజ్ చేయబోతుందట. పవన్ కల్యాణ్‌తో నేహాశెట్టి స్టెప్పులేయబోతుందన్న వార్తలపై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. ఈ అప్‌డేట్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూవీ లవర్స్ అండ్ ఫ్యాన్స్.

ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రియారెడ్డి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య తెరకెక్కిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన ఓజీ గ్లింప్స్.. పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.






## రాజాసాబ్ విడుదల తేదీపై సిద్దు జొన్నలగడ్డ ఫోకస్..

### సూపర్ స్ట్రాటజీతో జాక్ రిలీజ్ డేట్ ఫైనల్

టాలీవుడ్ యాక్టర్ సిద్ధు జొన్నలగడ్డ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ క్రేజీ యాక్టర్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి జాక్ బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ SVCC 37గా వస్తోంది. మేకర్స్ తాజాగా విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చారు. ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్‌ను 2025 ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్టు ప్రకటించగా.. రిలీజ్ వాయిదా పడుతుందంటూ వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాక్ సినిమాను ఇదే తేదీన విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. తాజా లుక్‌లో నిర్మానుష్య ప్రదేశంలో ఓ వైపు జీపు కనిపిస్తుండగా.. మరోవైపు గన్‌ను చూడొచ్చు. రాజాసాబ్ తేదీన వస్తుండటంతో సూపర్ బజ్ క్రియేట్ అవడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సిద్దు జొన్నల గడ్డ దీంతోపాటు నీరజ కోన డైరెక్షన్‌లో తెలుసు కదా సినిమా చేస్తుండగా.. మరోవైపు టిల్లు 3 కూడా లైన్‌లో ఉంది.

# ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ అవమానిస్తోంది

ఉప్పు-నిప్పులా ఉండే బీజేపీ, కాంగ్రెస్ మధ్య కొత్త వివాదం రాజుకుంది. అంబేద్కర్ కేంద్రంగా కొత్త రగడ మొదలైంది. నిన్న రాజ్యసభలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు, ఉభయసభల్లో దుమారం రేపాయి. అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాల ఆరోపణలకు కౌంటర్ ఇచ్చారు. అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎలాంటి విధివిధానాలను ఆచరిస్తోందో ప్రజలు చూస్తూనే ఉన్నారని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. ట్విట్టర్ వేదికగా ఆరు అంశాలతో కూడిన థ్రెడ్‌ను ఆయన పోస్ట్ చేశారు. 'కాంగ్రెస్ పార్టీ, దాని కుళ్లిన పర్యావరణ వ్యవస్థ రాజ్యాంగ నిర్మాతైన బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడాన్ని ద్వేషపూరిత అబద్దాలు దాచగలవని భావిస్తే.. వారంతా పొరపాటుపడినట్టేనని. భారతదేశ ప్రజలు ఓ రాజవంశం నాయకత్వంలోని పార్టీ ఎలాంటి విధివిధానాలను ఆచరిస్తోంది.? అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి, ఎస్సీ, ఎస్టీలను అవమానపరిచేందుకు అవసరమైన ప్రతీ అవకాశాన్ని వదులుకోకపోవడాన్ని గమనిస్తున్నారని' ప్రధాని మోదీ పేర్కొన్నారు.



గత 10 ఏళ్లుగా తమ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు సర్వశక్తులు ఒడ్డిస్తోందని అన్నారు. రంగం ఏదైనా కూడా.. 25 కోట్ల మంది పేదరికాన్ని నిర్మూలించడమే కాకుండా.. SC/ST చట్టాన్ని సైతం బలోపేతం చేశామన్నారు. అంతేకాకుండా అంబేద్కర్‌తో అనుబంధం ఉన్న ఐదు ప్రసిద్ధ ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు ప్రధాని మోదీ. దశాబ్దాలుగా చైత్య భూమికి సంబంధించిన భూమి సమస్య పెండింగ్‌లో ఉంది. తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించడమే కాకుండా.. తాను ఆ ప్రాంతంలో ప్రార్థనకు కూడా వెళ్లానని అన్నారు. అంబేద్కర్ తన చివరి సంవత్సరాల్లో గడిపిన అలీపూర్ రోడ్డును కూడా తామే అభివృద్ధి చేశామన్నారు. అలాగే లండన్‌లో అంబేద్కర్ నివసించిన ఇంటిని కూడా ఎన్డీఏ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ప్రధాని మోదీ ట్విట్టర్‌లో తెలిపారు.

ఈ మధ్య అంబేద్కర్ అంబేద్కర్ అనడం కొందరికి ఫ్యాషన్ అయిందంటూ నిన్న రాజ్యసభలో అమిత్ షా వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై జరిగిన చర్చలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేయగానే.. కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అమిత్ షా వ్యాఖ్యలపై రాహుల్ మండిపడ్డారు. మనుస్మృతిని నమ్మేవాళ్లకు అంబేద్కర్‌తో నిస్సందేహంగా ఇబ్బందే అంటూ రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్‌తోపాటు, విపక్ష ఎంపీలు నిరసనలకు దిగారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మిస్టర్ షా దళితుల చిహ్నాన్ని అవమానించారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. ఈరోజు పార్లమెంట్ సమావేశమైనప్పుడు ప్రతిపక్ష పార్టీల ఎంపీలు బీఆర్ అంబేద్కర్ ఫోటోలు పట్టుకుని నిరసన తెలిపారు. బిఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎలా పక్కన పెట్టిందనే దానిపై షా చేసిన వ్యాఖ్యలను చూపని ఒక చిన్న వీడియో క్లిప్‌ను కాంగ్రెస్ ప్రసారం చేసిందని బిజెపి నాయకులు ఆరోపించగా, ప్రతిపక్ష నాయకులు అధికార పార్టీపై దాడిని పెంచారు మరియు హోం మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# పిల్లలు పుట్టకుండా మావోయిస్టుల ఆపరేషన్లు

**రాయ్‌పూర్ :** మావోయిస్టులను పూర్తిగా ఏరివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారిని జనజీవన స్రవంతిలోకి ఆహ్వానిస్తున్నాయి. వారికి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాయి. ఆయుధాలను వదిలి అజ్ఞాతం వీడిలాని విజ్ఞప్తి చేస్తున్నాయి. అయినా అడవుల్లోనే ఉండి ఉద్యమం చేసేవారికి వార్నింగ్ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా ఓ అంశం ఆసక్తికరం గా మారింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జగదల్‌పూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అస్సాం రాష్ట్రాలకు చెందిన మాజీ మావోయిస్టులతో కాసేపు మాట్లాడారు. ఈ సమయంలో.. తెలంగాణకు చెందిన ఓ మాజీ మావోయిస్టు అమిత్ షాకు ఆసక్తికరమైన విషయం చెప్పారు. 'సీనియర్ మావోయిస్టు నేతల ఆదేశాల మేరకు పెళ్లికి ముందు తాను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. జనజీవన స్రవంతిలో కలిశాక తిరిగి దానికి విరుగుడు శస్త్రచికిత్స చేయించుకున్నా. ప్రస్తుతం ఓ బాబు ఉన్నాడు. పిల్లలు పుడితే ఉద్యమంపై అంతగా దృష్టిపెట్టరన్న ఉద్దేశంతో.. మావోయిస్టు నేతలు తమ దళ సభ్యులకు అలా ఆపరేషన్లు చేయిస్తుంటారు' అని మాజీ మావోయిస్టు అమిత్ షాకు చెప్పారు. మాజీ మావోయిస్టులతో మాట్లాడటం తనకు చాలా సంతోషంగా ఉందని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఉద్యమాన్ని వీడి లొంగిపోయేలా మాజీ సహచరులకు సందేశం పంపించాలని వారికి సూచించారు. లేనిపక్షంలో భద్రతా బలగాల చేతుల్లో వారికి చావుదెబ్బ తప్పదని హెచ్చరించారు. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టురహితంగా మారుతుందని.. అమిత్ షా స్పష్టం చేశారు. సామ్రాజ్యవాదులు, దేశ, విదేశీ కార్పొరేట్లు, దోపిడీ పాలకుల సొంత లాభాల కోసమే.. భారతదేశంలో



మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో ఈ నరమేధం కొనసాగుతుందని.. ఆ పార్టీ దళ సభ్యులు ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉండి దేశ సంపదను, శ్రమను కారు చౌకగా అమ్మడానికి, దోపిడీ అనుకూల విధానాలు సరళం చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. దేశ వనరులను, శ్రమను కాపాడే లక్ష్యంతో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో పీడిత ప్రజల వైపు పోరాడుతున్నామని మావోయిస్టు దళ సభ్యులు చెబుతున్నారు. ఈ ప్రజా పోరాటాలు వారి సొంత లాభాలకు అడ్డుగా మారడంతో.. మావోయిస్టు పార్టీని, పీడిత ప్రజలను నిర్మూలించాలని పథకం పన్నారని ఆరోపిస్తున్నారు. దోపిడీ వర్గాలు తమ ఆర్థిక సంక్షోభాలను, తమ మార్కెట్ విస్తరణను యుద్ధం ద్వారా పరిష్కరించుకోవాలనుకుంటారని ఫైర్ అవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తున్నాయని మావోయిస్టు పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు, కార్పొరేట్లకు దోచిపెట్టడంలో, మావోయిస్టు పార్టీని నిర్మూలించడంలో బీజేపీ, కాంగ్రెస్‌లు వేర్వేరు కాదంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి సాయుధ బలగాల మద్దతుతో పాటు ఆర్థిక బలం కావాలన్నారని.. ఆనాటి నుంచి కాంగ్రెస్ మావోయిస్టు పార్టీపై నిర్బంధాన్ని పెంచిందని అంటున్నారు.

## ముసుగు తొలగింది..
# అమిత్‌షాపై టీఎంసీ ప్రివిలిజ్ నోటీస్

**న్యూఢిల్లీ:** దళితుల ఆరాధ్యదైవం డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై పెను దుమారం రేగుతోంది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వారసత్వాన్ని, పార్లమెంటు గౌరవాన్ని దిగజార్చారంటూ అమిత్‌షాపై తృణమూల్ కాంగ్రెస్ ప్రివిలిజ్ నోటీసు ఇచ్చింది. 187వ నిబంధన కింద టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ రాజ్యసభలో ఈ నోటీసు ఇచ్చారు. భారత రాజ్యాంగం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యసభలో మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిత్‌షా మాట్లాడుతూ, అంబేద్కర్ పేరు పదేపదే ప్రస్తావించడం విపక్షనేతలకు ఇప్పుడొక ఫ్యాషన్‌గా మారిందని అన్నారు. ఇన్నిసార్లు భగవంతుడి పేరు వల్లెవేస్తే వాళ్లకు స్వర్గంలో చోటు దొరుకుందని వ్యాఖ్యానించారు. "అంబేద్కర్ పేరు వందసార్లు వల్లెవేయండి.. కానీ ఆయన విషయంలో మీ సెంటిమెంట్లు ఏమిటో నేను చెప్పదలచుకున్నాను. జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలోని



ప్రభుత్వంతో విభేదించడం వల్లే తొలి మంత్రివర్గం నుంచి అంబేద్కర్ రాజీనామా చేశారు" అని అన్నారు. కాగా, పార్లమెంటు శుక్రవారం సమావేశమైనప్పుడు అమిత్‌షా వ్యాఖ్యలు దళిత నేత అంబేద్కర్‌ను అవమానపరచేలా ఉన్నాయంటూ కాంగ్రెస్, విపక్ష పార్టీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అంబేద్కర్ ఫోటోలతో పార్లమెంటు ఆవరణలో నిరసన తెలిపారు. అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ పాపాల చిట్టా..**

అమిత్‌షా వ్యాఖ్యలు దుమారం రేగుతున్న నేపథ్యంలో అంబేద్కర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ తీరును, పాపాల చిట్టాను వివరిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "ఆయనను (అంబేద్కర్) రెండు సార్లు ఎన్నికల్లో ఓడించేందుకు పండిట్ నెహ్రూ ప్రచారం సాగించారు. భారతరత్న నిరాకరించారు. పార్లమెంటులో ఫోటో పెట్టేందుకు కూడా ఇష్టపడలేదు" అని మోదీ విమర్శించారు. అంబేద్కర్‌పై కొన్నేళ్ల పాటు కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, అంబేద్కర్‌ను అవమానించిన తీరును ఇప్పుడు చెప్పే అబద్ధాలతో దాచలేరని, ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలు దేశ ప్రజలంతా చూశారని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం గత దశాబ్దకాలంగా అవిశ్రాంతంగా కృషి చేస్తోందని చెప్పారు.

# కిమ్ సైనికుల ముఖాలను రష్యా కాల్చేస్తోందన్న జెలెన్ స్కీ

**మృతదేహాలను గుర్తుపట్టకుండా ఉండేందుకేనని మండిపాటు**

**రష్యా కోసం ఉత్తర కొరియా జవాన్లు చనిపోతున్నారని వ్యాఖ్య**

**పుతిన్ మాత్రం వారి త్యాగాన్ని గౌరవించడంలేదని విమర్శలు**

రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో ఎలాంటి సంబంధంలేకున్నా నార్త్ కొరియా సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నారని, తమ సైనికుల చేతిలో చాలామంది చనిపోయారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్ స్కీ పేర్కొన్నారు. రష్యా కోసం యుద్ధం చేస్తూ చనిపోయిన నార్త్ కొరియా సైనికుల పట్ల పుతిన్ కనీస గౌరవం కూడా చూపడంలేదని మండిపడ్డారు. చనిపోయిన ఉత్తర కొరియా సైనికులను గుర్తుపట్టకుండా ఉండేందుకు మృతదేహాల ముఖాలను కాల్చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. కుర్స్క్ రీజియన్‌లో మృతదేహాలను పాతిపెట్టడానికి ముందు రష్యా సైనికులు ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈమేరకు ట్విట్టర్ లో జెలెన్ స్కీ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో చనిపోయిన కొరియా సైనికుల ముఖాలను కాల్చినట్లు కనిపించింది. 'ఉక్రెయిన్ పైకి ఉత్తర కొరియా సైనికులను పంపిస్తున్న పుతిన్.. ఆ సైనికుల త్యాగాలను అవమానిస్తున్నా డు. ఉత్తర కొరియా సైనికుల మరణాలను దాచడానికి రష్యా అనాగరిక చర్యలకు పాల్పడుతోంది. ఇలాంటి పిచ్చితనాన్ని ఇకనైనా ఆపాలి. దీనికి శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం ఒక్కటే మార్గం" అని జెలెన్ స్కీ చెప్పారు.



## నా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది

**న్యూఢిల్లీ:** రాజ్యాంగంపై రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చలో బాబాసాహెబ్ అంబేద్కర్‌పై తాను మాట్లాడిన మాటలను కాంగ్రెస్ పార్టీ వక్రీకరించిందని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా అన్నారు. కాంగ్రెస్ వక్రీకరణలను తాను ఖండిస్తున్నట్టు బుధవారం



నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ వ్యతిరేకి అని, రిజర్వేషన్లు, రాజ్యాంగానికి వ్యతిరేకమని విమర్శలు గుప్పించారు. వీరసావర్కర్‌ను అవమానించినదీ, ఎమర్జెన్సీ విధించినదీ కాంగ్రెస్ పార్టీయేనని, రాజ్యాంగ విలువలన్నింటినీ వాళ్లు కాలరాసారని అన్నారు. "నా మాటలను వాళ్లు వక్రీకరించారు. ఇంతకుముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాటలను సైతం ఎడిట్ చేశారు. ఎన్నికలు జరుగుతున్నప్పుడు నా స్టేట్‌మెంట్లను ఎడిట్ చేశారు. ఈరోజు సైతం నా ప్రకటనను వక్రీకరిస్తూ ముందుకొచ్చారు. నేను మాట్లాడిన పూర్తి స్టేట్‌మెంట్‌ను పబ్లిక్ ముందుకు తీసుకురావాలని మీడియాను కోరుతున్నాను. అంబేద్కర్‌ను ఎన్నడూ విమర్శించని పార్టీకి చెందిన వాడిని నేను. తొలుత జనసంఘ్, ఆ తర్వాత భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ అంబేద్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తూనే ఉన్నాయి. భారతీయ జనతా పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అంబేద్కర్ సిద్ధాంతాల వ్యాప్తి చేస్తూనే వచ్చాం. రిజర్వేషన్ల పటిష్టతకు బీజేపీ పాటుపడింది. ఈ విషయం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు కూడా చెప్పదలచుకున్నాను. ఆయన రాహుల్ గాంధీ ఒత్తిడిలో చిక్కుకున్నారు" అని అమిత్‌షా అన్నారు. కాంగ్రెస్ పార్టీనే బీఆర్ అంబేద్కర్‌కు 'భారత రత్న' ఇవ్వకుండా, లోక్‌సభ ఎన్నికల్లో అంబేద్కర్ ఓటమికి చేయాల్సినదంతా చేసిందని ఆరోపించారు

## జేపీసీలో ప్రియాంకాగాంధీ..!

'వన్ నేషన్, వన్ ఎలక్షన్‌బిల్లుపై ఏర్పాటు కాబోతున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వాయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ కి చోటు కల్పిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ఏదైనా బిల్లును జేపీసీకి పంపినప్పుడు ఆ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసే



జేపీసీలో ప్రతిపక్ష ఎంపీలకు కూడా చోటు కల్పిస్తారు. అయితే తమ పార్టీ తరఫున ఎవరిని జేపీసీలో సభ్యులుగా చేర్చాలనే విషయంలో ప్రతిపక్ష పార్టీలే తుది నిర్ణయం తీసుకుంటాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ.. ప్రియాంకాగాంధీ వాద్రాను వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ఏర్పాటు కాబోయే జేపీసీలో సభ్యురాలిగా చేరుస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రియాంకాగాంధీతోపాటు మనీష్ తివారి, సుఖ్‌దేవ్ భగత్, రణ్‌దీప్ సుర్జేవాలాకు కూడా జేపీసీలో చోటు కల్పించనున్నట్లు తెలుస్తోంది. దేశమంతటా ఒకే దఫా ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఒక బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ మంగళవారం బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై సమగ్ర అధ్యయనం కోసం జేపీసీకి పంపాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై లోక్‌సభ ఓటింగ్ నిర్వహించి జేపీసీకి పంపాలని నిర్ణయించారు.

## రూ.22,280 కోట్ల విలువైన మాల్యా, చోక్సీ ప్రాపర్టీలు సీజ్




**న్యూఢిల్లీ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విచారణలో భాగంగా అనేక కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను సీజ్ చేసి అటాచ్ చేసింది. ఆర్థిక నేరాలకు లింకున్న ఆ ప్రాపర్టీలను స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి సీతారామన్ బదులిస్తూ.. విజయవంతంగా ఈడీ సుమారు 22,280 కోట్ల విలువైన ప్రాపర్టీలను సీజ్ చేసినట్లు చెప్పారు. దీంట్లో విజయ్ మాల్యాకు చెందిన 14,131.6 కోట్లు ఆస్తి ఉన్నట్లు తెలిపారు. ఇక నీరవ్ మోదీ కేసులో 1,052.5 కోట్ల ఆస్తుల్ని బ్యాంకులు జప్తు చేసుకున్నట్లు చెప్పారు. నేషనల్ స్పాట్ ఎక్స్‌చేంజ్ స్కామ్‌లో 17.47 కోట్లు బ్యాంకులు సీజ్ చేశాయన్నారు. ఎస్ఆర్ఎస్ గ్రూపుకు చెందిన 20.15 కోట్లు, రోజ్ వాలీ గ్రూపుకు చెందిన 19.40 కోట్లు, సూర్య ఫార్మసీకి చెందిన 185.13 కోట్లు, నౌషేరా షేక్ గ్రూపుకు చెందిన 226 కోట్లు, నాయుడు అమృతేశ్ రెడ్డికి చెందిన 12.73 కోట్ల ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నాయి. మోహుల్ చోక్సీకి చెందిన 2,565.90 కోట్ల విలువైన ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## కేంద్ర మంత్రి ప్రయాణిస్తున్న విమానం దారి మళ్లింపు.. ఎందుకంటే?

**అమరావతి :** కేంద్ర రక్షణ సహాయ మంత్రి సంజయ్‌సేథ్ ప్రయాణిస్తున్న విమానానికి వాతావరణం అనుకూలించక పోవడంతో ముందు జాగ్రత్తగా విమానాన్ని హైదరాబాద్‌కు దారి మళ్లించారు. నౌకాదళం హైడ్రో గ్రాఫిక్ సర్వేల కోసం ఉద్దేశించిన



ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌకను విశాఖ నావెల్ డాక్ యార్డ్?లో ఉదయం జరగనున్న కార్యక్రమానికి జాతికి అంకితం చేసే కార్యక్రమానికి ఆయన విమానాశ్రయంలో బయలు దేరారు. విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో విమానాన్ని దారి మళ్లించడంతో కార్యక్రమాన్ని మధ్యాహ్ననికి వాయిదా వేశారు. కోల్?కత్తాలోని జీఆర్ఎస్ఈలో దేశీయంగా 80 శాతం పరికరాలతో ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌక నిర్మాణం జరిగింది. 110 మీటర్ల పొడవు, 3800 టన్నుల బరువైన ఈ నౌకను రెండు ఇంజిన్లతో రూపకల్పన చేశారు. అత్యాధునిక హైడ్రో గ్రాఫిక్ ఓషనో గ్రాఫిక్ సర్వే పరికరాలతో ఈ నిర్దేశక్?ను తీర్చిదిద్దారు. హైడ్రోగ్రాఫిక్ సర్వేలకు సంబంధించిన రెండో నౌక ఇదే కావడం గమనార్హం . గతంలో 32 ఏళ్ల పాటు భారత నౌకాదళంలో సేవలందించి 2014లో వీడ్కోలు తీసుకున్న నిర్దేశక్ స్థానంలో ఈ కొత్త నౌక రూపుదిద్దుకుంది. 25 రోజుల పాటు నిరంతరాయంగా 18 నాట్ల గరిష్ట వేగంతో ప్రయాణించడం ఈ నౌక ప్రత్యేకత అని నౌక అధికారులు తెలిపారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.